# గురుస్తుతి

## (భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారితో స్వానుభవాలు)



రచన:

**మూర్ఖబాలుడు**

గొలగమూడి (పోస్టు), నెల్లూరు జిల్లా - 524 321

మా ఇతర ప్రచురణలు:

| | | |
|---|---|---|
| 1. | వార్తా లాపము | 150 రూ|| |
| 2. | అవధూత లీల - అరవం | 50 రూ|| |
| 3. | శ్రీ వెంకయ్య స్వామి - అరవం, చిన్న పుస్తకం | 5 రూ|| |
| 4. | అవధూత లీల - శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము, తెలుగు | 40 రూ|| |
| 5. | అవధూత లీల - ఇంగ్లీషు | 30 రూ|| |
| 6. | శ్రీ వెంకయ్య స్వామి - ఇంగ్లీషు, చిన్న పుస్తకం | 5 రూ|| |
| 7. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 రూ|| |
| 8. | అవధూత బోధామృతము - శ్రీ స్వామి వారి బోధలు | 15 రూ|| |
| 9. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు | 15 రూ|| |
| 10. | మౌన బోధ | 1 రూ|| |
| 11. | పిలచిన పలికే దైవం | 1 రూ|| |
| 12. | ధర్మమూర్తి | 1 రూ|| |
| 13. | బోధ యజ్ఞాయ నమ: | 1 రూ|| |
| 14. | దివ్య లీలలు | 1 రూ|| |
| 15. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 1 రూ|| |
| 16. | శ్రీ స్వామి కృప | 1 రూ|| |
| 17. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 1 రూ|| |
| 18. | ఆచార్య భరద్వాజ గారి సత్‌సంగము | ఉచితము |
| 19. | శ్రీ మాష్టారి మంచిమాట - శ్రీ E.భరద్వాజ గారి దివ్యవాణి | ఉచితము |
| 20. | శ్రీ భరద్వాజ గారితో భక్తుల అనుభవాలు | ఉచితము |
| 21. | శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ చరిత్ర | ఉచితము |
| 22. | మృత్యువు పై ఘనవిజయము | ఉచితము |
| 23. | మన ధర్మము - కర్తవ్యము | ఉచితము |
| 24. | శ్రీ సుధీంద్ర బాబు గారు | ఉచితము |
| 25. | స్మృతిమాత్ర ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 26. | స్మృతిరహిత ప్రసన్నాయ నమ: | ఉచితము |
| 27. | జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 రూ|| |

సర్వస్వామ్యములు

శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్టు

ప్రథమ ముద్రణ - 2005
కాపీలు - 2000

**కాపీలకొరకు:**

శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్టు
గొలగమూడి (PO)
(Via) సర్వేపల్లి
నెల్లూరు జిల్లా A.P. – 524 321

వెల:





## అంకితము

నాకు శాంతిని ప్రసాదించిన పరమ పూజ్య ఆచార్య
శ్రీ భరద్వాజ మాస్టర్ గారి దివ్యపాదారవిందములకు

కనులున్న కబోదినయ్యా
చెవులున్న బదిరుండనయ్యా
మనసున్న మూర్ఖుండనయ్యా

వాచా శూరత్వమేగానీ క్రియాశూరత్వ మిసుమంతయున్ లేని
భీరుండనో ప్రభూ

అన్యదా శరణం నాస్థి
త్వమేవ శరణం మమ

## ఆచార్యులవారి అమృతవాక్కు:

లౌకిక జీవనము - ఆధ్యాత్మికత అనే గ్రంధంలో శ్రీ మాష్టారు చెపుతారు.

ఋణానుబంధాలు, నువ్విచ్చినటువంటి వాగ్దానాలు, చేసిన ప్రమాణాలు, నీ బాధ్యతలు నిర్వర్తించక ముందు గనుక బ్రహ్మానుభూతి కోసం ప్రయత్నం చేశావో పాడైపోతావు (మనుస్మృతి).

ఈ మాటనే శ్రీ సాయినాధుడు

ఋణానుబంధాన్ని గుర్తుంచుకొని ఏ ప్రాణినీ తోలెయ్యకు. నీ విచ్చినమాట తప్పక నెరవేర్చు, విశ్వాసంగల్గి ఓర్పుతో ఉండు. ఏ పని చెయ్యడాని కంగీకరిస్తావో ఆపని క్షుణ్ణంగా చెయ్యి, లేకుంటే చెయ్యడానికి అంగీకరించవద్దు, అంటారు.

పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజగారిని దర్శించగానే నాలోని అసంతృప్తి, చిరాకు, విసుగు, అదృశ్యమై ఆనందసాగరములో గ్రుంకులిడసాగాను. ఆ మహనీయుడు అనంత కరుణతో నా ఋణానుబంధాన్ననుసరించి నన్ను భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారికి అప్పగించారు. పిల్లి నోటిలోని పిల్లి పిల్లకు వలె నా రక్షణ భారము శ్రీ స్వామి వారు వహించియుండ నాకు చింతేముంది. హే సద్గురునాధా! నను మీ శుభ్రమార్గమున నడిపించి కావుమయ్యా. నాలో దొంగలు పడి సర్వమూ అపహరించకుండా కావుమా ప్రభో.

**మూర్ఖబాలుడు**



# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రార్ధన | 1 |
| 2. | అమృతబోధ | 5 |
| 3. | చిద్విలాసము | 9 |
| 4. | గురుస్తుతి | 13 |
| 5. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారితో నా ప్రధమ పరిచయము | 13 |
| 6. | ప్రధమ దర్శనం | 15 |
| 7. | ఆయన అన్నం ఆయన తింటూ ఉండమను | 17 |
| 8. | బంగారు పోవడం | 18 |
| 9. | రెండుమార్లు ఇంటికి వెళ్ళమనడం | 19 |
| 10. | చిన్న తప్పయినా తప్పే | 20 |
| 11. | కలిచేడు సాయి మందిర నిర్మాణం | 22 |
| 12. | కలిచేడు సాయి మందిర కమిటీ ఎలక్షన్లు | 23 |
| 13. | మత్త: స్మృతిర్జ్ఞానమపోహనంచ | 24 |
| 14. | హెడ్మాష్టరు పరీక్ష పాసవడం | 25 |
| 15. | 15 రోజులు ఘాఢనిద్ర | 27 |
| 16. | స్నేహితుని బియ్యం నేనే వండుకుని తినడం | 30 |
| 17. | గొలగమూడిలో రేకుల ఇల్లు | 33 |
| 18. | బియ్యం అక్షయం చేయడం | 35 |
| 19. | కట్టెలు - రావడం | 36 |
| 20. | కిటికీ తీసి ద్వారం పెట్టాలనడం - చీట్లు వేయడం | 37 |
| 21. | పొలం అమ్మాలంటే వద్దనటం | 38 |

| | | |
|---|---|---|
| 22. | 10 సంవత్సరాల వయసులో శేషయ్య నెల్లూరులో తప్పించుకోడం | 39 |
| 23. | శేషయ్య ఆరోగ్యానికి పారాయణ | 43 |
| 24. | శేషయ్యకు మల్టీలాక్ వేయవద్దని చెప్పడం | 47 |
| 25. | రస్కు బిస్కెట్లలో నూనె ఉందని చూపడం | 49 |
| 26. | సైకిల్‌కు 19 పంచర్లు | 50 |
| 27. | అవధూత లీల గ్రంధమునకు ఒకరిని ప్రేరేపించి ధనమిప్పించుట | 51 |
| 28. | సైకిల్ షాపు రాత్రి 2 గంటల వరకు తెరచి ఉండడం | 53 |
| 29. | అరటిపండ్ల విషయంలో శ్రీ స్వామి వారు హెచ్చరించుట | 54 |
| 30. | కాలిలో గాజు పెంకు గుచ్చుకోవడం | 55 |
| 31. | కాలిలో కంకర రాయి గుచ్చుకోవడం | 56 |
| 32. | శ్రీ స్వామి వారి చరిత్రను ఇంగ్లీషులో ప్రచురించడం | 57 |
| 33. | ఇంగ్లీషు పుస్తకం రెండవ - ముద్రణ శ్రీ స్వామి వారే వేయించారు | 58 |
| 34. | తొగురు వెంకయ్యగారి ద్వారా హైదరాబాద్ నుండి స్వామికృప పుస్తకాల డబ్బు తెప్పించుట | 60 |
| 35. | నా కుమార్తెకు ఫార్మసీలో సీటు రావడం | 62 |
| 36. | హుబ్లీ డివిజన్‌లో ఉద్యోగం | 63 |
| 37. | స్టేట్ బ్యాంకు ఉద్యోగం | 65 |
| 38. | రైల్వే ఉద్యోగం వదలి బ్యాంకు ఉద్యోగంలో చేరడం | 66 |
| 39. | మా కుమార్తె బ్యాంకు ఉద్యోగం ఇంటర్వ్యూ కాగితాలు పోస్టుమాస్టర్ ఇవ్వకపోవుట | 69 |
| 40. | ఒక సంబంధం చూస్తే శ్రీ స్వామి వారు వద్దనడం | 70 |





| | | |
|---|---|---|
| 41. | నా కుమార్తె లూనా యాక్సిడెంట్ | 71 |
| 42. | మా కుమార్తెకు పెండ్లి సంబంధం | 72 |
| 43. | బస్సు తప్పగొట్టడం | 73 |
| 44. | అమ్మాయి పెండ్లి రోజు నిద్రలేపడం | 74 |
| 45. | స్వామి కృప పబ్లికేషన్స్ రిజిస్ట్రేషన్ | 75 |
| 46. | గొలగమూడికి వచ్చిన ఏడు సంవత్సరముల తర్వాత బడికిపోవద్దనడం | 76 |
| 47. | పాయసం మొక్కు | 80 |
| 48. | పెన్షను రానందుకు కారణం నాకు స్ఫురించడం | 82 |
| 49. | కోనేరు దాటిపోతే నీవు గాడిదతో సమానం | 83 |
| 50. | అన్నగారి అంత్యక్రియలు | 85 |
| 51. | మిద్దె ఇల్లు కట్టడం | 86 |
| 52. | సాయి మాస్టర్ నిలయం కట్టించడం | 89 |
| 53. | శ్రీ సాయి మాస్టర్ నిలయంలో అధర్మపరులను నాకు చూపడం | 91 |
| 54. | శ్రీ సాయి మాస్టర్ నిలయం ముందున్న స్థలం కొనిపించడం | 94 |
| 55. | శ్రీ సాయి మాస్టర్ నిలయం పై మిద్దెకు యుగందర్‌ను డబ్బు అడుగుట | 95 |
| 56. | ఆరాధన పనులు కావని భయపడుతుంటే తిరుత్తణి నుండి మనిషిని తీసుకవచ్చుట | 96 |
| 57. | 2003 ఆరాధనకు శ్రీ సాయి మాస్టర్ నిలయంలో అన్నదానం | 97 |
| 58. | శ్రీ బ్రహ్మం గారి మఠం పునరుద్ధరణ, సత్సంగాలు - స్వప్నాలు | 98 |

| | | |
|---|---|---|
| 59. | పడి నా చెయ్యి విరిగింది. ఏ వైద్యం లేకుండా శ్రీ స్వామి వారే సరి చేశారు | 100 |
| 60. | హ్యూమానిటేరియన్ మిషన్ నుండి విరమింపజేయడం | 102 |
| 61. | నా చేతిలోని టవల్‌ను ప్రసాదం పొట్లమనుకోవడం | 103 |
| 62. | చిన్నతప్పయినా తప్పే అనే బోధను రెండవసారి శిక్ష ద్వారా తెలుపడం | 103 |
| 63. | రెండు కాళ్ళు ఒకేచోట కాల్చి పాఠం చెప్పారు | 105 |
| 64. | నా భార్య కాలు నొప్పి - పసరు పూయడం | 106 |
| 65. | పరదూషణకు పనిష్‌మెంట్ | 106 |
| 66. | చాపల్యములు నసించనిదే వెయ్యి జన్మలు తపస్సు చేసినా నీవు ఉన్నచోటే ఉంటావు | 108 |
| 67. | కొన్ని దుష్ట సంస్కారాలను తొలగించడం | 109 |
| 68. | నియమపాలన - స్వప్నాలు | 111 |
| 69. | చాపల్యం నసింపజేయడం | 112 |
| 70. | నీవు నిశ్చలంగా కూర్చో అవసరమైనదంతా నే చేస్తాను | 113 |
| 71. | చమురు లేకుండా కాల్చు | 116 |
| 72. | శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీకి బానిసకాబోయిన నన్ను ఆ బానిస బ్రతుకు నుండి రక్షించిన స్వామి | 117 |
| 73. | శ్రీ స్వామి వారి నిర్ణయము కొరకు నాల్గవ చీటీ పెట్టించుట | 119 |
| 74. | మోటారును విప్పే దొంగను తరమడం | 120 |
| 75. | పుణ్యం | 124 |

# గురుస్తుతి

## ప్రార్థన

పరమ పూజనీయమైన ఓ గురుదేవా! నన్ను నీ చెంతకు చేర్చుకొని నన్నుద్ధరించాలని మీరెంతో శ్రమపడుతున్నా పరమ మూర్ఖుడనైన నేను మాత్రం ఏ మాత్రమూ మారడం లేదు ప్రభూ. శ్రీ అక్కల్ కోట స్వామి చరిత్రలో శ్రీ కేల్కర్ మహరాజ్ గారు తన కడుపు నొప్పి వారం రోజులలో తగ్గితే నా జీవితం నీ కంకితం చేస్తానని చెప్పుకొని తన బాధ తగ్గగానే తానిచ్చిన మాట చెల్లించారు. సంస్కారహీనుడనైన నేను ఎన్ని అనుభవాలు పొందినా హృదయపూర్వకంగా మిమ్ము సేవించుచున్నానా? లేదే! ఎన్ని సంవత్సరాలు గడిచినా ఈ మలిన మనస్సు సంపూర్ణంగా మీ మీద లగ్నమవడం లేదే.

తమరు నాకొరకు పడ్డ శ్రమంతా ఒకసారి చెపుతాను. వినండి.

1. నా ప్రథమ పరిచయంలో - "గొలగమూడాయన స్నేహితుడు నీతో వచ్చాడు" అని ఒక తహసిల్దారు గారికి వ్రాసి ఇచ్చారు గదా.

2. శెనగలు, బెల్లం పొడి నా చేత పెట్టించుకొని తిని, మీ వంటికి, తలకు నూనె అంటించుకున్నారు, స్నానం చేయించుకున్నారు.

3. పదిహేను రోజులు ఇంటి దగ్గర మా తల్లిగారు అన్న మాట ఒక్క అక్షరం పొల్లు పోకుండా చెప్పి మీ సర్వజ్ఞత్వం ఎరుక పరచుకున్నారు.



4. రెండు సార్లు నేను మీ సన్నిధికి రాగానే నన్నింటికి పొమ్మని చెప్పారు. నా జబ్బును అలా పొమ్మంటున్నారని నేనెరుగక మీరిచ్చిన సదవకాశం జారవిడుచుకున్న నిర్భాగ్యుడను ప్రభూ.

5. నేనెంతో ఆయాసం బాధలో ఉండి నిద్ర, అన్నం లేని నరకయాతనలో మీ సన్నిధికి రాగానే పదిహేను రోజులు నిత్యం ఎనిమిది గంటలు నిద్ర పుచ్చి మీ సర్వ సమర్థత్వం ఎరుక పరచారు. అయినా నేను ఇసుమంతైనా మారానా ప్రభూ.

6. నెలరోజులుగా ఆయాసంతో బాధపడుతూ ఉన్నప్పుడు నీవు మద్రాసు వైద్యం తీసుకోకుంటే మరణం తద్యమని డాక్టర్లు చెప్పినప్పుడు మీ సమాధి దర్శనం చేసుకొని మద్రాస్ పోవాలని గొలగమూడికి బస్సెక్కగానే నా బాధ నివారించారు. గొలగమూడిలో మూడు రోజులు ఆరోగ్యంగా ఉండి కలిచేడు వెళ్ళేందుకు సంచులు తీసుకోగానే తిరిగి ఆయాసం పెట్టారు. ఈ క్షణంలో నా ఆయాసం తగ్గితే ప్రతినిత్యం గొలగమూడిలో నిద్రచేస్తానని చెప్పుకోగానే ఆయాసం నివారించావే కరుణామయా! ఇప్పుడు నా దుర్గుణంబులు మాన్పి నిరంతరం నీ దివ్య చింతనలో నా మనస్సును నిల్పకూడదా ప్రభూ.

7. గొలగమూడి ఆశ్రమ సమీపంలో ఇల్లు వేసుకోవాలంటే ఆశ్రమం వారు అంగీకరించకుంటే మూడుసార్లు చీట్లు వేస్తే కూడా ఒకే స్థలంలో ఉండమని పలికారు, పిలవగానే పలుకుతున్నారన్న కృతజ్ఞతాభావం కూడా లేని మూర్ఖుడ నయ్యాను ప్రభూ.

8. నేను కోరకున్నా స్వప్నాదేశముతో ఉద్యోగ విరమణ చేయించిన పుణ్యమూర్తివి గదా తండ్రీ. నేడు నా ప్రార్థనయే మీకు వినిపించదా ప్రభూ.

9. నీ అవసరాలన్నీ నేను చూస్తానని - మా ఇంటిలోని బియ్యం అక్షయం చేశావు గదా. ఈ అనుభవం పొంది కూడా నిరంతర ధ్యాస కుదరడం లేదంటే నా మనసెంత మలినమైనదో ప్రభూ. దానిని నీ కృప అనే వైద్యము చేత పరిశుద్ధమొనర్చవలసినదే గానీ నా ప్రయత్నమే సఫలము కాదు ప్రభూ. పైన తెల్పిన అనుభవములే గాక ఈ గ్రంధ మంతా మీరీ దీనునిపై చూపిన అనంత కరుణకు నిదర్శనము గదా. నా మనో మాలిన్యము వదలుటెప్పుడో తమకు సర్వస్య శరణాగతి చేయుటెప్పుడో గదా దయానిధి. ఈ లోగా ఎన్ని జన్మలు గడుస్తాయో మరెన్ని దుష్టసంస్కారాలు తగిలించు కుంటానో ఈ బాధలన్నింటి నుండి నీకృపయే నన్నుద్ధరించ వలె ప్రభూ.



ఓ సద్గురు రాయా!

నా ప్రార్థన లేకయే నను నీ సన్నిధికీడ్చి,
నను నిరర్థకుని చేయుట ధర్మమా ధర్మమూర్తే

కోరను నిన్ను భోగభాగ్యముల్ సిరిసంపదల్ కోరను
నీదివ్యకరావలంబనమొసంగి ఈ దుష్టగుణంబులల్ పరిహరించుమా ప్రభో

నీ అంకిత భక్తులెందరికో అరిషడ్వర్గంబులన్ హరించినావే
వారి గురుభక్తియున్, ధర్మనిరతియున్ కఠోరనియమపాలనయున్
నాకనుగ్రహించి బ్రోవుమా ప్రభో

చాపల్యంబులు నశించబోవు ఈషణత్రయంబునే విడువలేను
అరిషడ్వర్గంబులు అష్టమదంబులు నన్‌బాధించగా చూచి
ఆనందించుట ధర్మమా ధర్మమూర్తే.

ఓ సద్గురు సింగమా ఈ అహంకార మత్తగజంబును
ప్రోదోల నీకు మనసు రాదా ప్రభూ

నీ పంజా చూపిన పలాయనము చిత్తగించదా
ఈ అహంకార మత్తగజంబు పోవక సర్వస్యశరణాగతి ఎట్లు ప్రభూ.

నిర్ధనత్వములేకుండుటే నా ఇడుములకు కారణమైన
నను నిర్ధనుని చేసి కావుమా ప్రభో.

తోయకుమయ్యా నను నీ అతిధుల లిస్టులోన
నను నీ ఆత్మీయునిగా గొని ఉద్ధరించుమా ప్రభూ.

మరుపే మరణమంటివే ప్రభూ ఈ మరుపేల రుద్దితివో
మానొసటన్ ప్రభో
సర్వసాక్షివని సర్వకర్మఫలప్రదాతవను మాటే అనుక్షణమున్
మరచు చుంటినో ప్రభూ.

# అమృతబోధ

ఒకసారి కాదు, ఐదుమార్లు బోధించిన ఈ అమృతబోధను ఇరవై ఐదు సంవత్సరాలు గడచినా నేటికి గూడా ఆచరించలేని హీనుడనై ఉన్నాను.

1. శ్రీ స్వామి వారి సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన నా ఆయాసం పూర్తిగా తగ్గిపోయింది గనుక ప్రతిరోజు శ్రీ స్వామివారికి నాలుగు ఇడ్లీలు తెచ్చి సమర్పించేవాణ్ణి. ఆ మహనీయుడు వాటిని ఎంతో ప్రీతిగా ఆరగించేవారు. ఇడ్లీ తెచ్చేందుకు నడచిపోయినంతసేపు తిరిగి వచ్చినంత సేపు ఏమారకుండా నామం చెప్పుకుంటుండేవాణ్ణి. ఒకరోజు నా జేబులో పదిపైసలే ఉన్నాయి. ఈ పది పైసలకు ఒక్క ఇడ్లీ తేవాలా లేక అప్పు పెట్టి నాలుగు ఇడ్లీలు తేవాలా అనే ఆలోచనతోనే మార్గమంతా సరిపోయింది. నామజపం చేయలేదు. నాలుగు ఇడ్లీలు తెచ్చాను. కానీ శ్రీ స్వామివారు వాటిని తాకనుకూడా నిరాకరించారు. ఒక సేవకుడు ఇడ్లీ తాకి నాకు ఇవ్వమని శ్రీ స్వామివారి మణికట్టు పట్టుకున్నాడు. "ఏందయ్యో" అంటూ చెయ్యి విదిలించుకున్నారేగాని ఇడ్లీ తాకలేదు. నేను నామజపం చేయకుండా ఇడ్లీ తేవడమే దోషమని గ్రహించాను.

2. ఇది గుర్తుంచుకొని, మరొకరోజు శ్రీ స్వామి వారికి, వారి సేవకులందరికి ఇంటినుండి ఇడ్లీ తెస్తాను, ఏడు గంటలకు తప్పక తెస్తానన్నాను. ఇంట్లో మినపప్పు నానబోసినది మొదలు రుబ్బి, రవ్వ తడిపెట్టేంత వరకు నేనే కూర్చొని నామం చెప్పాను. ఉదయం ఇడ్లీ, చెట్నీ, మిరప్పొడి తయారు చేసినంతవరకు నామం చెప్పాను. అందరికీ ఎనభై ఇడ్లీలు ఏడు గంటలకు తెచ్చేలోపలే హోటల్ నుండి ఇడ్లీ తెప్పించి శ్రీ స్వామి వారు తినేశారు. అది తెలిసి నేను



కుప్పకూలిపోయి చాలా బాధపడుతూ కూర్చున్నాను. అక్కడున్న ఈశ్వరమ్మ అనే భక్తురాలు నా బాధ తెలుసుకొని శ్రీ స్వామివారికి ఇడ్లీ పెట్టబోతే సేవకులందరూ ఆమెను మందలించారు. ఇప్పుడే గదా శ్రీ స్వామివారు ఇడ్లీ తిన్నారు. మరలా ఎందుకు నీవు పెట్టడం అన్నారు. ఈ ఇడ్లీలు శ్రీ స్వామిచేత తాకించి ఆయనకిస్తాను. అంతేనంటూ ఆమె నాలుగు ఇడ్లీలు ప్లేటులో పెట్టుకొనిపోతే శ్రీ స్వామివారు ఇడ్లీ తాకాలంటే అరచెయ్యి బోర్లపెట్టాలి, కానీ ఇడ్లీ పెట్టమని అడిగినట్లు అరచెయ్యి వెల్లికిలా పెట్టారు. ఆమె సగం సగం ఇడ్లీ మిరప్పొడి అద్ది శ్రీ వారి చేతిలో పెడితే నాలుగు ఇడ్లీలు తినేశారు. శ్రీ స్వామివారు నేను చేసిన నామజపం గుర్తించి ఆ ఇడ్లీలు స్వీకరించారు. నేటికీ ఇదే మనందరికీ గొప్ప పాఠము. శ్రీ స్వామి వారికి ఏ సేవచేసినా వదలకుండా నామజపం చేస్తే వారెంతో సంతోషిస్తారు. ఆ మహనీయుడు సంతోషిస్తే సృష్టినంతా సంతోషపరచినట్లేగదా!

3. ఒకరోజు శ్రీ రామిరెడ్డి తాతగారు నెల్లూరులో జయమ్మగారింట్లో ఉన్నారు. నేను వారి దర్శనానికిపోతూ గోధుమపిండి, ఇడ్లీరవ్వ, యర్రగడ్డలు, పచ్చిమిరపకాయలు, కరివేపాకు, ఉప్పు వేసి అట్లు పోసుకొని శ్రీ స్వామివారికి తీసుకపోవాలి. రాత్రి ఏడుగంటలప్పుడు విపరీతంగా నామం చెపుతూ చేసి బస్సులోనామం చెప్పుకుంటూ గొలగమూడి నుండి నెల్లూరు వెళ్ళాను. అక్కడ తాతగారిని అన్నానికి రమ్మంటున్నారు భక్తులు. వాళ్ళందరినీ చండాలంగా తిడుతున్నారు. నాకు అట్లు కావాలని అడుగుతున్నారు. ఇప్పుడు భోజనము చేయండి, ఉదయం అట్లు తెస్తామంటున్నారు. ఎంతసేపు బ్రతిమాలినా నాకు అట్లు కావాలంటున్నారు. ఇంతలో నేను వెళ్ళి నా పొట్లం శ్రీ స్వామి వారి చేతిలో పెట్టాను. వారా పొట్లం విప్పి

అట్లు తింటున్నారు. అప్పుడు భక్తులకు వారు అట్లు కావాలన్న కారణం అర్ధమైంది. వారంతగా రాత్రి ఏడు - ఎనిమిది గంటల సమయంలో అట్లు కావాలని మారాం చేయడంలోని కారణం నేను చేస్తున్న నామజపమేగదా.

4. ఇదేవిధంగా శ్రీ తాతగారు దత్తసాయి మందిరం - నెల్లూరులో ఉన్నారు. ఉదయం తొమ్మిది గంటలైనా టిఫిన్ తినమంటే తినకుండా అందరినీ తిడుతున్నారు. అంతలో నేను వెళ్ళాను. సార్ ఇలా అందరినీ తిడుతున్నారు. మీరైనా ఏమైనా తీసుకరాండి. ఇప్పటికేమీ తినలేదంటుంది జయమ్మగారు. నేను ఇడ్లీ తెచ్చేందుకు బజారుకుపోతూ నామంచేస్తూ పోతున్నాను. అక్కడ నిలబడినంత సేపు మరలా వచ్చేటపుడు విడవకుండా నామం చెపుతూ తెచ్చాను. తెచ్చీ తేక ముందే నా చేతిలోని పొట్లం అందుకొని విప్పి తినసాగారు. ఒక ఇడ్లీ ఉంచి కాగితం తోటి నా పైన విసిరేశారు. అందరినీ తిడుతున్న మహనీయుడు నా ఇడ్లీ తినేటట్లు చేసింది నా నామస్మరణ మాత్రమే గదా. అదే అందరూ తరించే మార్గమని శ్రీ తాతగారు బోధిస్తున్నారు.

5. నేనెప్పుడు శ్రీ భరద్వాజ మాష్టరుగారిని దర్శించినా వట్టి చేతులతో పోవడం తప్ప అందరిలాగా వారికేమైనా పండ్లు, బిస్కెట్లు, సిగరెట్లు తీసుకపోయే వాణ్ణి కాదు. ఎందుకంటే మనమిచ్చినా వారు తినరు. అందరికీ పెట్టేస్తారు అనేదే నా భావం. ఒకరోజు గూడూరులో యాభై పైసలిచ్చి చిన్న కిరిణీ పండుకొని దాన్ని చేతిలో పట్టుకొని బస్సులో విద్యానగర్ పోతున్నాను. నేను వదలకుండా నామ జపం చేస్తాను, ఈ పండు శ్రీ మాష్టారు తినాలి అని అనుకొని మార్గమంతా వదలకుండా నామం చెపుతూ వెళ్ళాను. శ్రీ మాష్టారు



ఒక్కరే సత్‌సంగహాలులో ఉన్నారు. నేను పోగానే రెండు చేతులూ చాపి ఆ పండునందుకొని దాన్ని అక్కడున్న అందరి పండ్లతో కలుపకుండా ఒక చోట పుస్తకాలమీద పెట్టారు. ఆహా! ఈపండుకేదో గొప్ప మహర్దశ పట్టిందనుకొన్నాను. వారు నన్నేదో పనిమీద పంపారు. నేను తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటల హారతికూడా అయిపోయింది. శ్రీ మాష్టారు భోంచేసి కూర్చొనున్నారు. నన్ను చూస్తూనే ఆ ప్రసాదం ఇట్లా ఇస్తారూ అని అడిగారు. ఆ కిరిణీ పండు తొక్కు తీసి విత్తనాలు తీసి సన్నని దబ్బలుగా తరిగి ఒక ప్లేటులో తెచ్చారు. అది తప్పకుండా నేను తెచ్చిన చిన్న కిరిణీ పండే. లేకుంటే చాలా స్వల్పంగా ఉన్న దబ్బలు మరి ఏ ఇతర పండుకూ రావు. ప్లేటు తెస్తూనే కొన్ని దబ్బలు కళ్ళకద్దుకొని నోట్లో వేసుకున్నారు. నాకు కొన్ని పెట్టారు. మిగిలినవి ఇంట్లో అందరినీ తీసుకోమని పంపారు. ఆ పండు శ్రీ మాష్టారు తినేటట్లు చేసింది నేను చేసిన నామస్మరణే గదా! ఈ విధంగా ఐదు సార్లు చెప్పినా ఇంకెన్నో నిదర్శనాలిచ్చినా ఈ ఇరవై ఐదు సంవత్సరాల తర్వాతైనా నేను నిరంతరమూ నామస్మరణ చేయలేకున్నాను.

దానికి కారణం నా మనసుకు పట్టిన తుప్పు అలాంటిది. గురువు ఎంత కృపచూపినా మన వైపు నుండి ప్రయత్నం లేకుండా ఏమీ ఫలితం పొందలేము.

ఓ సద్గురు రాయా, అనంత కరుణామయా, సర్వసమర్ధా! నా మాలిన్యం వదిలించి నన్నుద్ధరించుమా ప్రభూ. నా ఇంద్రియలోలతే నన్ను ఆచరణ శూన్యుని జేయుచున్నది. ఈ దుర్గుణంబులన్ బాపి నన్నుద్ధరించుమాప్రభో.

# చిద్విలాసము

కొత్తగా శ్రీ స్వామివారి పాదములాశ్రయించిన రోజులవి. పదిహేను రోజులుగా విపరీతమైన ఆయాసం. ద్రవాహారం తీసుకున్నాసరే ఆయాసం తీవ్రాతి తీవ్రస్థాయికి చేరుతుంది. ఘన పదార్థం తింటే ఇక చనిపోవడమే. అసలు అహారమే లేదు, రాత్రి పగలు నిద్ర లేదు. అన్ని వైద్యాలు విఫలమైనాయి. అలోపతి, హోమియోపతి ఆయుర్వేదం అన్నీ తిన్నాను. లారి క్రింద తలపెడితే బాధ ఒక్కసారి నివారణౌతుందని ఏడుస్తున్నాను. రాత్రి పగలు నాభార్య, మా అమ్మ నాకు కావలి కాచేవారు. ఎందుకంటే మా వాకిలి ముందరే లారీలు, బస్సులు, కార్లు నడిచే తారు రోడ్డు.

ఒకరోజు అన్నం వంచుతున్న మా అమ్మ తూగడం చూచాను. ఎందుకలా తూగుతుంది? నాకు కావలి కాచి కాచి రాత్రి పగలు నిద్ర లేక తూగుతుంది. ఇప్పుడా అన్నం గిన్నె చేయిజారి కాళ్ళ మీద గంజి పడితే ఇక ఆమెను ఆస్పత్రిలో వేయాల్సిందే. నా వల్ల వీళ్ళకెంతటి కష్టమొచ్చిందని నా కడుపు మంట మరొక వైపు దహించి వేస్తుంది.

సర్వసాక్షి, అనంత కరుణామయుడైన శ్రీ స్వామి వారు కలిచేడు వచ్చారని స్కూలు పిల్లలు వచ్చి చెప్పారు. శ్రీ స్వామివారు మా గ్రామమొస్తే స్కూలు పిల్లలను శ్రీ స్వామి వారి దగ్గరకు తీసుకవెళ్ళి భజన చేయిస్తాను.

అప్పుడు రాత్రి 7 గంటల 30 నిమిషాలు. ఇంట్లో ఉండి వీరికి నిద్ర లేకుండా చేసేకంటే నేను శ్రీ స్వామి వారి దగ్గరకెళితే నా బాధ నేను పడతాను. వాళ్ళయినా నిద్రపోతారని బయలుదేరాను. కొందరు హాస్టలు పిల్లలను నాకు తోడుగా పంపింది మా అమ్మ. మా యింటి నుండి రెండు



ఫర్లాంగుల దూరంలో శ్రీ స్వామి వారు కల్యాణరాం గనిలో ఉన్నారు. ఈ రెండు ఫర్లాంగులు నడిచేందుకు నాకు అరగంట పట్టింది.

నేను శ్రీ స్వామి వారి సన్నిధికి రావడంలో నా ఉద్దేశ్యము - ఇంట్లో వాళ్ళు హాయిగా నిద్రపోతారనే గానీ నాకు ఆయాసం తగ్గి నిద్రపోతానని కానే కాదు. ఎంతటి ఆయాసంలో ఉన్నానో చెప్పలేను.

వస్తూనే నేలమీద కూలబడ్డాను. అక్కడ కటిక మంచు కురుస్తుంది. అది డిసెంబరు నెల. చలి ఎక్కువ. కూర్చున్న వెంటనే మట్టిలో పడి ఒక అనాథవలె ఘాడంగా నిద్రపోయాను. రాత్రి 8 గంటల నుండి వేకువఝామున 4 గంటలవరకు అంటే 8 గంటలసేపు ఘాడంగా వళ్ళు తెలియకుండా నిద్రపోయాను. నేను నిద్ర లేచేసరికి ఆ గనిలో గంట గంటకూ కొట్టే గంట నాలుగు దెబ్బలు కొట్టారు. పరమ దయా నిధియైన శ్రీ స్వామి వారు నన్ను తన సొంత బిడ్డకువలె సేద తీర్చారు.

ఎంతటి దుష్ట సంస్కారాలో చూడండి. నా ఆయాసం తగ్గింది, శ్రీ స్వామి వారి సన్నిధి ప్రభావం వలన కాదు, నేను తీసుకున్న అహారం దానికి సరిగ్గా సరిపోయే మందు వలన అని తలచానే కానీ శ్రీ స్వామి వారి ఎడల మామూలు భావం తప్ప ఇంక ఎక్కువగా పూజ్యభావం లేదు. ఈ విధంగా తినరాని పదార్ధాలు తింటూ నిత్యం రాత్రికి విపరీతమైన ఆయాసంతో శ్రీ స్వామి వారి సన్నిధికి రాగానే నా ఆయాసం తీసేసినట్లు పోయి గాఢంగా నిద్ర పోయేవాడిని. మందే తినకుండా వచ్చేది. నాకు గిట్టని పదార్ధాలు తిని విపరీతమైన ఆయాసంతో వచ్చేది నా శరీరం భూమికి తగలగానే నిద్రపొయేవాడిని.

మాఇంట్లో ఎంత సంబరమైందో చెప్పలేను, కొన్ని సంవత్సరాలుగా బోగి పండుగ, పెద్ద పండుగ, కనుమ పండుగలకు కూడా ఇంట్లో

ఏ తినుబండారాలు చేయరు. చేస్తే నేను తింటాను, తింటే విపరీతమైన ఆయాసం వస్తుంది. మిఠాయి అంగడిలో తెచ్చి పిల్లలకిచ్చి చాటుగా తినమని చెప్పేవారు. ఈ సంవత్సరం శ్రీ స్వామివారున్నారని లడ్డు, అరిసెలు, వడలు, దోశలు అన్నీ చేశారు. నేను ముక్కు మునగ తిని ఆయాసం తెచ్చుకొని శ్రీ స్వామివారి సన్నిధిలో రాత్రంతా హాయిగా నిద్రపోయి ఇంటికి వచ్చేవాడిని. ఇంత జరిగినా నా వక్ర బుద్ధి పోలేదు. నాకు ఆయాసం తగ్గేది శ్రీ స్వామి వారి కృప వలన కాదు వారి దగ్గర ఉండే మంట వేడికి, సెగకు అనే యోచన మొదలైంది. ఆ కరుణామయుడు ఆ సంశయాన్ని గూడా సమూలంగా నశింప జేయదలచారు.

కనుమ పండుగ పోయిన మరునాడు తన మకాము తలుపూరు - చెర్లో పల్లెకు మార్చారు. రాత్రి గంట ఏడు. ఆయాసం విపరీతమైంది. ఇక్కడ ఉండి ఇంట్లో వాళ్ళకు నిద్రాభంగం చేసే కంటే శ్రీ స్వామి వారి దగ్గర కెళితే నాకూ వాళ్ళకు బాధ ఉండదని కదిలాను. మా అమ్మ సైకిల్ పట్టుకొని చీకటిలో పోవద్దంటుంది. ఆమెను నెట్టేసి సైకిల్ ఎక్కాను, రెండు ఫర్లాంగులు పోయాక బాధ విపరీతంగా ఉంది. సైకిల్ దిగి ఆ మార్గాన వచ్చే వారి చేత మంట వేయించుకుందామని ఒక ఆలోచన. చచ్చినా సరే శ్రీ స్వామి వారి దగ్గరకెళ్ళే వరకు ఆగకూడదు. సైకిల్ తొక్కలేకుంటే అక్కడ దాన్ని పడేసి దొర్లుకుంటానైనా శ్రీ స్వామి వారి దగ్గరకెళ్ళాలని మరొక యోచన. సైకిల్ హాండిల్ మీద పడి తొక్కలేక తొక్కుతూ శ్రీ స్వామి వారి కృపవలన ఎక్కడా ఆగకుండా ఇరవై నిమిషాలలో వెళ్ళే దూరం ఒకటిన్నర గంట సేపటిలో చేరాను.

ఎంత చిత్రమో! అదే సమయంలో శ్రీ స్వామివారు గంజి త్రాగుచున్నారు. గంజి త్రాగేటప్పుడు అగ్ని హోత్రం ప్రక్కన గూడ అడ్డం పెడతారు. శ్రీ స్వామి వారు గంజి త్రాగేది ఎవ్వరూ చూడకుండా



ఉండాలని. నా సైకిల్ శబ్దము విని ఓ సైకిలాయనా! స్వామి వారు గంజి త్రాగుతున్నారు. అక్కడనే ఆగమని అరిచారు. నేను సైకిల్ దిగి సైకిల్‌కు స్టాండు వేసే శక్తి లేక సైకిల్ దబేల్‌మని పడేసి అక్కడే మట్టిలో చతికిల కూలబడ్డాను. ఇప్పుడు నాకు శ్రీ స్వామి వారు గానీ అగ్ని హోత్రంగానీ కనిపించే వీలే లేదు. మా మధ్య అడ్డంగా గూడ పెట్టి యున్నారు.

ఇంతలో రోశిరెడ్డి నా దగ్గరకొచ్చి అయ్యో! ఇంత బాధలో ఇంత దూరం రావాలాయ్యా. అక్కడుండి పిలిచినా స్వామి పలకరా! అని అంటూ ఏదేదో మాటలు చెపుతున్నారు. ఐదు నిమిషాలు గడిచిపోయింది. నేను ఇప్పుడు పూర్తిగా ఆయాసం లేకుండా ఉన్నాను. కానీ "నీకిప్పుడు ఆయాసం తగ్గినట్లుందే" అని రోశిరెడ్డిగారన్నంతవరకు నా పరిస్థితి నాకు తెలియదు.

ఆ నాటితో అగ్నిహోత్రం వలన ఆయాసం తగ్గుతుందేమోననే సంశయం కూడా పూర్తిగా నిర్మూలనమైంది. శ్రీ స్వామి వారి కృపవలన మాత్రమే బాధా నివారణ జరుగుతుంది అనే దృఢ నిశ్చయానికి వచ్చాను.

దీక్షలు లేకనే, నియమము లేకనే ప్రార్ధనలసలే లేనే లేకనే ననుకాపాడితివా! హే ప్రభో నను కాపాడితివా! అర్ధమాసము నిద్దురబుచ్చి నీ బిడ్డవలె కాపాడితివా! నీకు సాటి ఎవరయ్యా, ఇలలో నీకు సాటి ఎవరయ్యా, చీకటినే పోద్రోలుగాని ఆ సూర్యదేవుడు మరల మరల చీకటి రాదా ప్రభూ? నీ దయ గల్గి నీ దివ్య కరావలంబనములభించి ఇసుమంత జ్ఞానాగ్ని మా హృదయమందు రగిల్చిన శాశ్వతముగా చీకటియే మా దరిచేరదు గదా ప్రభూ.

# గురుస్తుతి

శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమైన శ్రీ భరద్వాజ మాష్టరుగారు శ్రీ సాయిలీలామృతం అనే గ్రంధరాజం వ్రాస్తూ మొదట గురుస్తుతి వ్రాశారు. గురువు తనకు చేసిన మేలు స్మరించడం గురుస్తుతి. ఇతరులకు చేసిన దానిని స్మరించడం గురుస్మరణ అన్నారు. గురువు తనకు చేసిన మేలు నిత్యం స్మరించకుంటే కొన్నాళ్ళకు ఆ మేలు మన జ్ఞాపకాల నుండి మరుగున పడి మన గురువు ఎడల మన ప్రగాఢమైన భావం పలుచబడే ప్రమాదముంది. అలాంటి సేవకుడు లేక శిష్యుడు ఉత్తమ సేవకుడుగా పరిగణించబడడు అంటారు శ్రీ భరద్వాజ మాష్టరుగారు. చాలా సంవత్సరాలనుండి నేనీ సత్యాన్ని గుర్తించక శ్రీ స్వామి వారు నాకు చేసిన మేలు సాటి భక్తులతో పంచుకోకుండా వెనుకాడాను. నా అనుభవాలు ప్రచురిస్తే నేను సెల్ఫ్ డబ్బా వాయించు కుంటున్నానని అందరూ అనుకుంటారని తలచాను. కానీ గురుస్తుతి చేయడం మనకెంతో శ్రేయస్కరమని గుర్తింపచేశారు శ్రీ స్వామి వారు. అందుకే నేడీ అనుభవాలను మీ అందరితో పంచుకుంటున్నాను. నేనెంత పనికిమాలిన వాణ్ణయినా శ్రీ స్వామివారు నన్ను ఇంకా తన అమృత హస్తములతో పట్టుకొని రక్షించి నడిపిస్తున్నారంటే అది వారి అనంత కరుణకు, అవ్యాజనీయమైన ప్రేమకు నిదర్శనమే.

## భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారితో నా ప్రథమ పరిచయము

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టరు గారితో నాకు పరిచయమయ్యాక 1975 సంవత్సరం నుండి శ్రీమాష్టారు నన్ను భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారిని దర్శించమని చెపుతూనే ఉన్నారు. కానీ నేను



వారిని దర్శించలేదు. ఎందుకంటే తలుపూరు, కలిచేడు గ్రామాలలో శ్రీ స్వామి వారిని అమేషా నేను చూస్తూనే ఉన్నాను. కానీ ప్రత్యేకంగా వారికి సాష్టాంగపడవలెనని నాకనిపించేది కాదు. కేవలం గోచి పెట్టుకొని, మంట ముందు కూర్చొని ఉంటారు. వారే దేవుడంటే నాకు నమ్మశక్య మయ్యేది కాదు. శ్రీ మాష్టారి ఆజ్ఞ మేరకు మేము రాములు వారి గుడిలో సత్‌సంగం చేస్తుంటే ఒక రోజు వార్ధా గ్రామం, గాంధీ గారి ఆశ్రమం నుండి ఒక సన్యాసి వచ్చి శ్రీ స్వామి వారిని గూర్చి అడిగాడు. వారికి శ్రీ స్వామి వారిని చూపేందుకు ఆ సన్యాసితోటి నేనే కలిచేడు నుండి తలుపూరు వెళ్ళాను. మేము వెళ్ళే సమయానికి ఏదో గ్రామ తగాదాలు తీర్చమని రెండు గ్రామాల జనం కిటకిటలాడుతూ శ్రీ స్వామి చుట్టూ చేరియున్నారు. మేము ఆ జనాన్ని చూచి చాలా దూరంగా నిలబడి యున్నాము. వెంటనే శ్రీ స్వామి వారి దగ్గర నుండి ఒక వ్యక్తి వచ్చి కాషాయ గుడ్డలున్న ఆయనను రమ్మన్నారని నాతో వచ్చిన సన్యాసిని శ్రీ స్వామి వారి దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆ సన్యాసి దీక్ష తీసుకున్న తేదీ, ఆ దీక్ష పూర్తి కాబోయే తేదీ వారు ఉద్యోగ విరమణ చేసిన తేదీ ఇవన్నీ శ్రీ స్వామి వారు వారికి వ్రాసి ఇచ్చి చివరి వాక్యంగా గొలగమూడి ఆయన స్నేహితుడు నీ తోటి వచ్చాడు అని వ్రాయించారు. నాకు శ్రీ భరద్వాజ గారికంటే ముందుగానే శ్రీ స్వామి వారిని గూర్చి చెప్పిన వారు నా గొలగమూడి స్నేహితుడే. ఆ విధంగా మొదటిసారి శ్రీ స్వామి వారు నన్ను గురించి కాగితం మీద వ్రాయించారు. తహసిల్‌దారుగా ఉండి సన్యాసిగా మారిన వీరు శ్రీ స్వామి వారిని ఎంతో కొనియాడారు. వారికి వ్రాయించిన కాగితం చదువుకు సామర్థ్యానికి సంబంధం లేదని చెపుతుందని ప్రశంసించారు.

# ప్రథమ దర్శనం

శ్రీ భరద్వాజ మాష్టరుగారు ఎనిమిది నెలలుగా నాకు శ్రీస్వామి వారిని దర్శించమని చెపుతూనే ఉన్నా నేను వారిని దర్శించింది లేదు. చివరకు వారు "శ్రీ స్వామివారు భూమి మీద దేవుడు, వారిని దర్శించకుంటే నా దగ్గరకు రావద్దు" అన్నారు. నేనెంతో మనో వ్యాకులంలో పడ్డాను. నా మనస్సు గ్రహించిన శ్రీ మాష్టారు "ఆయన దేవుడని నిరూపణైతేనే నమస్కరించు లేకుంటే వద్దు" అన్నారు. "దేవుణ్ణి నిరూపించేటంతటి వాడనా సార్" అంటే అదే ముంది వారు ఎవరిని తాకనివ్వరు. "నా చేత వారు వంటికి నూనె పూయించుకోవాలి. వారెవ్వరేమిచ్చినా తీసుకోరు. గనుక నేను తీసుకపోయిన పదార్ధం తనకైతానే అడిగి పెట్టించుకొని తినాలని, అట్లా చేస్తే భగవంతుడని నమ్ముతానని చెప్పుకొని మనసులో సాయినామం చెపుతూ పది నిమిషాలు దూరంగా కూర్చో." వారు నీ రెండు కోరికలు తీరిస్తే వారు భగవంతుడని నమ్ము లేకుంటే ఇక వారి దర్శనానికి పోవద్దు అని చెప్పారు. నాలుగు మార్లు వెళ్ళి ఎవ్వరినీ తాకనివ్వరని ఎవరేమిచ్చినా తీసుకోరనేది నిర్ధారణ చేసుకున్నాను. శెనగపప్పు, బెల్లం పిడికిటిలో పట్టుకొని నేను మరొక టీచరు వెళ్ళాము. కొత్త వారొచ్చి శ్రీ స్వామివారిని తాకుతారని శ్రీ స్వామి వారికి కాపలా ఉండే ఇద్దరు సేవకులూ ఒకేసారి ఎటో వెళ్ళారు. అక్కడ మేము, స్వామీ తప్పితే ఇంకెవ్వరూ లేరు. "అయ్యా తినేందుకేమైనా పెడతా" అంటూ శ్రీ స్వామి వారు చేయిచాపారు. వారికి పండ్లు లేవు గనుక కొద్దిగా బెల్లం చేతిలో పెట్టి, శనగలు బెల్లం పొడి చేసి తెచ్చేలోగా కాపలా సేవకులొచ్చి ఆ పొడి వారు పెడతామన్నా శ్రీ స్వామి వారు "ఆయనే పెడతాడులేయ్యా" అని నా చేతనే పెట్టించుకు తిన్నారు. దానితోనే నా ఆనందమునకు అవధులు లేకుండా పోయాయి. నేను లేచి రాబోతే "కాళ్ళకు కొంచెం నూనె పూయయ్యా" అన్నారు. సేవకులు పూస్తానన్నా అంగీకరించక నాచేతనే కాళ్ళు, వళ్ళు, తలా అంతా



అంటించుకున్నారు. స్నానం కూడా నేనే చేయించాలని ప్రయత్నిస్తే - నీటి యొక్క వేడి భరించలేక సబ్బు మాత్రం రుద్దాను. సేవకులు నీళ్ళు పోశారు. ఆ విధంగా శ్రీ స్వామిని పరీక్షించాను.

వెంటనే విద్యానగర్ వెళ్ళి శ్రీ మాష్టారికి నా అనుభవాన్ని గొప్ప ఆనందంతో వివరించాను. "ఇక మీదట నీవు వీలున్నంత సేపు వారి సన్నిధిలో కూర్చో. నిప్పుశెగన కూర్చుంటే గుడ్డలలోని చెమ్మ ఆరి పోయినట్లు మనం సాధనతో నిర్మూలించుకోలేని దుష్ట సంస్కారాలన్నీ వాటంతటవే రాలిపోతాయి" అని మాష్టారు చెప్పారు. అది మొదలు సాయంకాలం 4 గంటలనుండి రాత్రి 12 గంటల వరకు శ్రీ స్వామి వారి సన్నిధిలో కూర్చునేవాణ్ణి. అక్కడ వారికి మనం చేసే సేవలేమీ ఉండేవి కావు. అప్పుడు నాకనిపించలేదు కానీ ఇప్పుడు తెలుస్తుంది సాయంకాలం 4 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు - 8 గంటల సేపు వారి సన్నిధిలో ఎలా కూర్చోగలిగాను అనేది గొప్ప విశేషము. అక్కడ టి.వి. గానీ, రేడియోగానీ, హరి కథ, డ్రామా, పాట కచ్చేరీ ఏమీ లేవు కదా? ఆనుకొని కూర్చునేందుకు గోడ కూడా ఉండదు.

మన మనసులోని ప్రతిమాట వారికి తెలుస్తుంది. శ్రీస్వామివారు అప్పుడప్పుడు బిస్కెట్లపొడి బెల్లం లాంటివి పెట్టించుకు తినేవారు. నాకు కొంచెం పెడితే బాగుండును గదా అని మనసులో అనుకోగానే తనచేతిలోని ఆ పదార్ధం - ఉ - అంటూ నాపైన వేసేవారు. నేను రాత్రివేళ పొద్దుపోయ్యాక ఇంటికి వస్తున్నానని ఒకరోజు పెందలకడనే ఇంటికి వచ్చేయ్‌మని, ఒకరోజు పురుగు పుట్ర ఉంటాయి పెందలకడనే వచ్చేయ్‌మని మరొక రోజు, రోడ్డు బాగుండదు చీకటి పడి ఎందుకొస్తావని మా అమ్మ అంటుండేది. ఆమె ఏరోజు ఏమంటే అదే మాట శ్రీ స్వామి వారు అనే వారు. నేనీమాట శ్రీ మాష్టారికి చెపితే "అవధూతంటే ఏమనుకున్నావ్" అన్నారు.

# ఆయన అన్నం ఆయన తింటూ ఉండమను

శ్రీ స్వామి వారు చెప్పిన ఈ మాట అర్థం నాకు పూర్తిగా అర్థం కాలేదు. కొన్ని నెలలపాటు మా మామగారింట్లో భోంచేసి వస్తే తప్పనిసరిగా మూడురోజులు అనారోగ్యమై బడికి సెలవు పెట్టవలసి వచ్చేది. కొన్ని నెలలకు ఇది గుర్తించి మామ గారింట్లోనే కాదు ఇంట్లో తప్ప మరెక్కడా భోంచేయకుండా గడుపసాగాను. ఇంట్లో మాత్రం నా అన్నం నేను తయారు చేసుకోవడంలేదు. అలా తయారు చేసుకోవాలంటే నా భార్య ససేమిరా అంగీకరించేది కాదు. ఒకసారి వరుసగా మూడు నెలలు విపరీతమైన దగ్గు పెట్టారు. రాత్రింబవళ్ళు పెద్దగా దగ్గవలసివచ్చేది. నాకే గాకుండా ఇంట్లో అందరికీ నిద్ర ఉండేది కాదు. ఈ మూడు నెలలలోను మూడువేల రూపాయలు వైద్యానికి ఖర్చయింది. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, నాటు వైద్యాలు అన్నీ విఫలమైనాయి. రేపటిరోజు మా మరదలు వివాహం, పెండ్లిపిలుపుకు వచ్చిన మా మామగారితో అందరినీ తీసుకుపో నేను మాత్రం రాను. వస్తే పెండ్లిలో అందరూ నా చుట్టూ చేరతారని చెప్పి పంపాను. ఆ రోజు చీట్లు వేయాలనే ప్రేరణ పెట్టారు శ్రీ స్వామి వారు.

1. నా అన్నం నేనే వండుకోవాలని శ్రీ స్వామి వారి ఆజ్ఞ.
2. ఇంట్లో ఎవ్వరైనా వండవచ్చు అని శ్రీ స్వామి వారి ఆజ్ఞ.
3. నా భార్య మాత్రమే వండాలని శ్రీ స్వామి వారి ఆజ్ఞ.

అని మూడు చీట్లు వ్రాసి పెట్టి వాటిని నా భార్య చేతనే తీయించాను. నా భార్య 1వ చీటీ వచ్చింది. రోజూ రాత్రిపూట నా భార్య గోధుమ రవ్వ నూనె లేకుండా హల్వా లాగ చేస్తే అది తింటాను. ఆ రోజు ఆ హల్వా నేనే చేసుకొని తిన్నాను. ఎంతో గొప్ప అద్భుతం జరిగింది. మూడు నెలలుగా బాధించిన దగ్గు ఏమైందో గానీ తెల్లవార్లూ ఘాడంగా దగ్గు లేకుండా నిద్రపోయాను. తెల్లవారి మరదలు పెండ్లికి పోయాను.



అది మొదలు నా ఆహారం నేనే తయారు చేసుకొని తింటున్నాను. ఆయాసము, దగ్గు మాత్రమే గాకుండా ఎన్నో ఇతర శారీరక బాధలు మటుమాయ మయ్యాయి.

# బంగారు పోవడం

1979 లో శ్రీ స్వామి వారు పర్యటనలు మాని గొలగమూడిలో స్థిరంగా యున్నరోజులు. శ్రీ స్వామి వారికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో కొన్నాళ్ళు నేను వారి దగ్గరుంటానని శ్రీ స్వామి వారిని అడగమన్నాను. అందుకు శ్రీ స్వామి వారు "ఆయనన్నం ఆయన తింటూ ఉండ" మన్నారు. ఇంతమంది తింటుంటే ఆయనొక్కడు మనకు బరువా స్వామీ - అంటే - వాళ్ళు బాపనోళ్ళు మన దగ్గర తినకూడదయ్యా అన్నారు. బాపనోళ్ళు కాదు స్వామీ కోమటివారు అని సేవకులు చెపితే "కాదయ్యా బాపనోళ్ళు" అన్నారు. ఇక ఆ మాట తర్కించక వదిలేశాము. ఇక నాఅన్నం నేను తింటూ ఇక్కడొక సంవత్సరముంటే ఇంటి దగ్గర ఐదుగుర్ని చాకాలి. వాళ్ళకు, నాకు భోజనానికి డబ్బు ఎట్లా వస్తుంది. బడికిపోను గనుక జీతం రాదు. కొంత బంగారం అమ్మాలి. ఛీ - ఛీ - బంగారం అమ్మి స్వామికి సేవచేయడమా - అని ఆ ప్రయత్నం మానేశాను. సరిగ్గా మూడు నాలుగు నెలలకు మా మామ గారింట్లో డెకాయిట్ దొంగలు పడి నా బంగార మంతా దోచుకపొయ్యారు. అంత పెద్ద దొంగతనంలో కూడా మా అమ్మగారి చేతులకున్న 4 బంగారు గాజులు, బొడ్లో పెట్టుకున్న ఎనిమిది సవర్ల బంగారు దండ మాత్రము దొంగల కంట పడలేదు. దొంగ మా అమ్మను కర్రతో తలమీద కొట్టి ఆమె చేతులు తవిడి చూచాడు. గాజులు వానిచేతికి తగల్లేదు. నడుమంతా తవిడి చూచాడు దండ తగల్లేదు. అప్పుడు నాకు బాగా అర్థమైంది. వారి సేవ కొరకు కొంత బంగారు అమ్మి ఉంటే నా బంగారంతా రక్షించబడేదేనని తెలిసి వచ్చింది.

1989 సంవత్సరంలో రేపటి నుండి బడికి పోవద్దని ఆదేశించారు. ఆ యాజ్ఞపాటించడమా మానడమా అనేది సంశయమైంది. ఇంతకు ముందు బంగారం అమ్మి శ్రీ స్వామి వారికి సేవ చేయడం ఇష్టం లేక మానేస్తే బంగారంతా దొంగల పాలైంది. శ్రీ స్వామి వారి ఆజ్ఞ పాటించకుంటే ఏమౌతుందోనని వెంటనే వాలంటరీ రాజీనామా చేసేశాను. ఏ దిగులూ చీకు చింతా, ఆర్థిక ఇబ్బంది లేకుండా ఆ మహనీయుడు కరుణతో కాపాడుతున్నాడు.

1995 లో శ్రీసాయి మాష్టర్ నిలయం ఉత్తరం వైపు స్థలం అమ్ముతుంటే శ్రీ స్వామి వారు దొంగలబారినుండి కాపాడిన మా అమ్మ బంగారం అమ్మి ఆ స్థలం కొనడంలో వాడాను. ఆ విధంగా వారు కాపాడిన బంగారం వారిసేవకు వినియోగపడు తుందని నమ్మాను.

## రెండుమార్లు ఇంటికి వెళ్ళమనడం

శ్రీ స్వామి వారు తన సన్నిధికి వచ్చిన వారినెవ్వరినీ వెళ్ళమని చెప్పరు. కానీ నన్ను రెండుమార్లు వారి దగ్గరకు వెళ్ళిన మరుక్షణమే ఇంటికి పొమ్మని ఆజ్ఞాపించారు. వేసవికాలం ఒంటిపూట బడి జరుగుతుంది. కలిచేడులో కాపురమున్న నేను తలుపూరులో పనిచేస్తూ తలుపూరులో ఉన్న శ్రీ స్వామి వారి సన్నిధికి మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో వెళ్ళాను. శ్రీ స్వామి వారి సన్నిధిలో కూర్చోకముందే నన్ను చూపుతూ "ఆయనను ఇంటికి పొమ్మనయ్యా" అన్నారు. మారు మాట్లాడ కుండా ఇంటికి పోయిఉంటే ఆనాడే నా ఆయాసం జబ్బు శాశ్వతంగా పోయి ఉండేది. కానీ నేను ఎప్పుడు రమ్మంటారు స్వామీ అని అడిగాను. మూడు రోజుల తర్వాత, అని అన్నారు. వారు చెప్పినట్లే మూడు రోజుల



తర్వాత నా జబ్బు నాకు తగులుకున్నది. నన్నుపొమ్మనడంలో - ఇంటిలో నాతో ఏదో అవసరముండవచ్చునని కొందరనవచ్చు. అలాంటిదేమీ లేదు. వారు చెప్పి ఆజ్ఞాపించినది నా జబ్బునేనని ఇప్పుడు తెలుస్తుంది.

రెండువారాల తర్వాత శ్రీ స్వామి వారు చెర్లోపల్లెలో ఉన్నారు. రాత్రి ఎనిమిది గంటలకు నేను సైకిల్ మీద చెర్లో పల్లెలోని శ్రీ స్వామి వారి సన్నిధికి వెళ్ళాను. నేను సైకిల్ దిగుతున్నాను. వెంటనే శ్రీ స్వామి వారు "అయ్యా ఆ సైకిలాయ నను ఇంటికి పొమ్మనిచెప్పు" అన్నారు. నేను చెర్లోపల్లి పొలిమేర దాటి పదిబారలు వెళ్ళి తిరిగి శ్రీ స్వామి వారి సన్నిధికి వచ్చి వారి వెనుకవైపు పడుకున్నాను. ఎందుకు? వారికి కనబడేటట్లు పడుకుంటే ఇంటికి పోలేదేమిటి అని అడుగుతారని, ఎంతటి అజ్ఞానమో చూడండి. నేను తిరిగి వచ్చి అక్కడే పడుకున్నానని సర్వజ్ఞుడైన శ్రీ స్వామి వారికి తెలియదా? ఆ విధంగా కుతంత్రంగా ప్రవర్తించాను గనుకనే నా వ్యాధి నన్ను వదలలేదు. ఎన్నిమార్లు సాయిలీలామృతం చదివినా షామా గారికి పాముకరిస్తే బాబాగారు మెట్లు దిగమన్నది షామా యొక్క విషాన్నని నాకు ఆ సమయంలో గుర్తు రాలేదు. సద్గురుని ఆజ్ఞలకు మారు చెప్పకుండా ఆచరించే సంస్కారము ఇక ఎన్ని జన్మలకైనా నా కొస్తుందా? అది నీ కృపవల్లనే నాకు రావాలి ప్రభూ.

## చిన్న తప్పయినా తప్పే

పొదలకూరులో ఒకరు గృహప్రవేశానికి ఆహ్వానించారు. అక్కడ నన్నేమి తినమని బలవంతం చేయమని వారంగీకరించాకనే వెళ్ళాను. తాంబూలంలో పెట్టి ఒక అరటి పండిచ్చారు. ఏమీ తినలేదని వాళ్ళు చిన్నబుచ్చుకుంటారని వాళ్ళముందే సగం అరటి పండు తినేశాను. వెంటనే

కన్ను జిలపుట్టి నలిపాను. విపరీతంగా వాచిపోయింది. అది కనబడకుండా కళ్ళద్దాలు పెట్టుకొని అక్కడనుండి స్కూలుకు వచ్చాను. మొదటి పీరియడ్ అయిపోయింది. రెండవ పీరియడ్ నాకు పనిలేదు. విపరీతంగా ఆకలిగా ఉంది. లేబరేటరీలోకి వెళ్ళి నా సంచిలో ఉన్న మిగిలిన సగం అరటిపండు తినేశాను. వెంటనే పెద్ద మైకం వచ్చి పిల్లలు కూర్చునే డ్యూయల్ డెస్కుపై పడుకున్నాను. వెంటనే కల. నేనొక పెద్దహాలులో ఎనిమిది అడుగుల ఎత్తుగల తలుపు ముందు నిలుచొని ఉన్నాను. రెండు కాళ్ళు ఒకచోట ఉన్నాయి. ఆ మూసియున్న తలుపును రెండు అరచేతులతో ఎక్కడో నొక్కితే తెరుచుకుంటుందట. కొంచెం సేపు ప్రయత్నించి కుడికాలు ఒక్క అరంగుళం కదిలించాను. నా వెనుకనున్న సభలో అందరూ గడ్డాలు పెంచిన ఋషులే ఉన్నారు. వారిలో ఒకరు లేచి వచ్చి "అన్ ఫిట్ తీసెయ్" అని ముమ్మారు పలికారు. ఈ తలుపు నేను తెరువలేనా? ఒక్క కాలు ఒక్క అరంగుళం దూరం కదిలిస్తే అదీ తప్పేనా? అంటున్నాను. ఆ పెద్దాయన "చిన్న తప్పయినా తప్పే, అన్ ఫిట్ తీసెయ్" అని ముమ్మారు పలికారు. మెలకువ వచ్చింది. గంట చూస్తే పదకొండు గంటల ఇరవై నిమిషాలే. ఏమిటా ఈ కల అని ఆలోచిస్తే శ్రీ స్వామి వారు ఆత్మలో చెప్పారు, నాముందున్నది ముక్తి ద్వారం. అది తెరవాలంటే చిన్న తప్పయినా తప్పేనని బోధిస్తున్నారు. మనం చేసే తప్పు మనకు తెలియదు. కానీ సర్వసాక్షియైన శ్రీ స్వామికి తెలుస్తుంది. నీ అన్నం నీవు తిను అని శ్రీ స్వామి వారు చెపితే దానికి భిన్నంగా వారిచ్చిన అరటిపండు తినడం పెద్ద తప్పేనని శ్రీ స్వామి వారు చెపుతున్నారు. ఈ లోకంలో అందరూ పొగిడేవారే కానీ మన తప్పు చెప్పేవారు లేరు. ఇంతటి సూక్ష్మ విషయాలు సైతం బోధించే శ్రీ స్వామి వారి వంటి సద్గురువు లభించడమే దుర్లభం కదా.



# కలిచేడు సాయి మందిర నిర్మాణం

దేవుడొక్కడే. పేర్లు, రూపాలు అనేకం. ఈ క్రింది అనుభవంలో శ్రీ సాయి రూపంలో దైవం చేసిన దివ్యలీలను స్మరిద్దాము. కలిచేడులో మందిరం కట్టాలని గ్రానైట్ రాళ్ళు తోలించాము. నేను గొలగమూడికి ప్రతి రోజు వచ్చి నిద్ర చేస్తానని మ్రొక్కుబడి చెప్పుకొని ప్రతి రోజు అలా గొలగమూడి రాసాగాను. ఇక కలిచేడు మందిరం పని నిలబడిపోయింది. శ్రీ భరద్వాజ మాష్టర్ గారు ఎలాగైనా కలిచేడు మందిరం పని పూర్తి చేయమని తొందర పెట్టసాగారు. ఏప్రిల్ 12 వ తేది వారు మహా సమాధి చెందే విషయం వారికి స్పష్టంగా తెలిసే అలా తొందరించ సాగారు.

ఏ భక్తునికీ బాధ కల్గించకూడదని ఒక్క రూపాయ టిక్కెట్టు అచ్చు వేయించి నెల్లూరు, గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి, ఒంగోలు గ్రామాలలో ప్రతి ఒక్కరి దగ్గర ఒక్కొక్క రూపాయి బిక్ష చేయాలని పదిహేను రోజులు స్కూలుకు సెలవు పెట్టి బయలుదేరబోతున్నాను. కందేరి క్రిష్ణయ్యగారు - తురిమెర్ల - వారికి వారి స్వప్నంలో నన్ను చూపించి "ఆయన బిక్షకు పోతున్నాడు. ఆ పని నీవు చేయరాదా?" అని సాయిబాబా చెప్పారు. ఆయన ఆ విషయం నాకు చెప్పి నీవు బిక్షకు ఎందుకు పోతున్నావు? అని అడిగాడు. నా ప్రోగ్రాం చెప్పగానే నన్ను బిక్షాకార్యక్రమం నుండి విరమింపజేసి ఆయనే తన సొంత ఖర్చుతో మందిరమంతా కట్టించాడు. మనం హృదయపూర్వకంగా భగవంతుని సేవ చేయాలని ప్రయత్నిస్తే ఆ కారుణ్యమూర్తి ఆ పనిని ఎలా నిర్వహిస్తారో చూడండి. జీతం లేకుండా సెలవు పెట్టి బిక్ష చేసే అవసరం లేకుండా భగవంతుడు ఆ కార్యం ఎలా నిర్వహించాడో చూడండి.

# కలిచేడు సాయి మందిర కమిటీ ఎలక్షన్లు

మనం ఏమారి ఉన్న సమయాలలో కూడ శ్రీ స్వామి వారు ఎంత జాగ్రత్తగా మనలను కాపాడుతారో చూడండి. మందిర కమిటీలో ప్రెసిడెంటు పదవికి తప్ప అన్నీ పోష్టులకు భాధ్యత స్వీకరించేందుకు అందరూ అంగీకరించారు. ప్రెసిడెంటు పదవికి ఎవ్వరూ అంగీకరించలేదు. "సుబ్బరామయ్య బిక్షకు పోతున్నాడు. నీవా పని చేయరాదా?" అని ఒకరి స్వప్నంలో నన్నాయనకు శ్రీ సాయిబాబా చూపించారు. ఆ తర్వాత నేను శ్రీ సాయి మందిర నిర్మాణానికిగాను బిక్షకు పోతున్నానని తెలుసుకొని నన్ను బిక్షకు పోకుండా ఆపి తన సొంత ఖర్చుతో మందిరమంతా కట్టించాడు క్రిష్ణయ్య అనే భక్తుడు. ప్రెసిడెంటుగా ఆయనను ఉండమని ఎందరు చెప్పినా ఆయన అంగీకరించలేదు. "శ్రీ సాయి దగ్గర చీట్లు వేస్తాము. వారు ఉండమంటే మీరు తప్పక ఉండాలి" అని చెప్పి కందేరి క్రిష్ణయ్యను ప్రెసిడెంటుగా ఉండమని శ్రీ సాయి ఆజ్ఞ అని ఒక చీటి, కందేరి క్రిష్ణయ్యను ప్రెసిడెంటుగా ఉండవద్దని శ్రీ సాయి ఆజ్ఞని మరిక చీటీ వ్రాసి శ్రీ సాయి చిత్రపటం దగ్గర పెట్టి క్రిష్ణయ్యగారిని ధ్యానం చేసుకోమని చీటీ ఒక పిల్లవాని చేత తీయించాము. ప్రెసిడెంటుగా ఉండమనే చీటీ వచ్చింది. ఆ చీటి ఆయన చేతికిచ్చి చదువుకోమన్నాను. పిల్లవాడు రెండవ చీటీ నా చేతికిచ్చాడు. నేను దాన్ని రెండుగా చించి నలిపి నాకు మూడడుగుల దూరంలో నున్న గోడవతల పారవేయబోయి కూడ ఎందుకో గానీ ఆ రెండు ముక్కలను క్రిష్ణయ్య చేతిలో పెట్టి కలిపి చదువుకోమన్నాను. అలా చదివిన వెంటనే అందరిలోను ఆయన కన్నీళ్ళు కారుస్తూ తన మనసులో మెదిలిన దురాలోచన ఇలా చెప్పాడు. "అయ్యవారు రెండు చీట్లలోను ఉండమని వ్రాసి ఉంటాడు" అని అనుకున్నాడట. నేనా కాగితం ముక్కలు ఆయన చేతిలో పెట్టకుండా పారేసి ఉంటే నామీద ఆయనకు ఆ చెడ్డ భావం కలకాలం ఉండేదే కదా.



ఆ క్షణంలో ఆ కాగితం ముక్కలు పారవేయకుండా ఆయన చేతిలో పెట్టేటట్లు చేసిన అదృశ్య శక్తి శ్రీ స్వామి వారే కదా! ఈ సహాయం చేయకుంటే ఆయన ప్రవర్తన ఆ తర్వాత ఎలా ఉండేదో చెప్పలేము. పరమ కరుణా మయుడైన శ్రీ స్వామి వారికి కృతజ్ఞత ఎలా తెలపాలో తెలియదు.

# మత్తః స్మృతిర్జ్ఞానమపోహనంచ

నేను కలిచేడులో ఉండగా నాకూ మా ప్రక్క ఇంటి వానికి స్థలం హద్దులలో తగాదా వచ్చింది. నా ప్రక్కింటి అతను, నేను ఒకే ఆసామి దగ్గర స్థలం కొన్నాము. కొనేటప్పుడు ప్రక్కింటి అతనిచేత సంతకం చేయించాను. ఇప్పుడతను చెపుతాడు "నా బిడ్డ చనిపోయిన దిగులులో ఉండి సంతకం చేశాను. నేను మనసు పెట్టి చదవలేదు". గ్రామస్తు లందరూ ఏకగ్రీవంగా అది మంచిపద్ధతి కాదు. నీవు మనసుపెట్టి చదవలేదు గనుక ఇప్పుడు కాగితం ప్రకారం అంగీకరించు అన్నారు. అతడు మరిఒకరి దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. వాళ్ళు నన్ను పిలిపించారు. ఇంటి దగ్గర ఎన్నో మార్లు వాళ్ళు ఇట్లా అడిగితే ఇలా చెప్పాలి, అట్లా అడిగితే అట్లా చెప్పాలని రిహార్సల్ వేసుకున్నాను. కానీ అక్కడికి వెళ్ళి - చివరి విషయం అతడ్ని ప్రమాణం చేయమని అడగాలనుకున్న విషయం మాత్రం అడగకుండా మరచిపోయి ఇంటికి వచ్చేశాను. గనుక అతని మాటలే నెగ్గాయి. అలా ఎందుకు మరచి పోయాను అంటే - మత్తః స్మృతిర్జ్ఞానమపోహ నంచ - అని గీతలో కృష్ణ పరమాత్మ చెప్పినదే అక్షర సత్యం. పూర్వ జన్మ ఋణాను బంధాన్ని బట్టి ఇప్పుడు మనకు గుర్తురావడం గానీ, మరచిపోవడం గానీ, అపోహ కల్గడం గానీ జరుగును. ఎన్నో జన్మల క్రింద జరిగిన దానికి ఈ జన్మలో మనకు

అనుభవం కావటమే God Principle - విధి నిర్ణయం - గనుక బాధ పడకుండా - బ్యాంకులో అప్పు తెచ్చుకున్నాము. ఇప్పుడు అప్పు తీరుస్తున్నామని బాగా గుర్తుపెట్టుకోమని శ్రీ స్వామి వారు బోధిస్తున్నారు.

## హెడ్మాష్టరు పరీక్ష పాసవడం

హెడ్మాష్టరు సీటంటే నాకు పరమ అసహ్యం. గనుక హెడ్మాష్టరు అకౌంట్స్ పరీక్షకు కూర్చోదలచలేదు. నాతోటి ఉపాధ్యాయులు పరీక్ష ఫీజు కడుతూ నాకు కూడా పరీక్ష ఫీజు కట్టి వచ్చి నన్ను పరీక్షకు రమ్మన్నారు. అప్పటిలో నాకు క్షణం తీరిక లేదు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పారాయణ, పూజ, ధ్యానం చేసుకోవాలి. ఆ తర్వాత స్కూలుకు పోవాలి. మధ్యాహ్నం 1 గంట 2 గంటల మధ్య పిల్లలకు మహనీయులను గూర్చి చెప్పాలి. సాయంత్రం 5 గంటల నుండి ఇంట్లో సత్సంగం రాత్రి 8 గంటలకు ఊర్లో రాముల వారి దేవాలయంలో సత్సంగం చేయాలి. ఇక ఈ పరీక్ష కొరకు చదవాలంటే వీటిలో ఏదైనా మానుకోవాలి. ఒక్క పుస్తకం కొనలేదు. నీవేమీ చదువవద్దు. మేము చర్చించుకునే విషయాలు విను చాలు అంటారు టీచర్సు. నేను దానికీ పోలేదు. రేపు అందరూ పరీక్షకు పోతున్నారు. శ్రీ మస్తానయ్య, శ్రీ ప్రసాద్ అనే వారు వచ్చి మా ఇంటిలో కూర్చుని నీవు పరీక్షకు వస్తానని చెపితే లేచిపోతాము. లేకుంటే లేదు అని కూర్చున్నారు. ఎంత చెప్పినా ఎంతసేపైనా లేవలేదు. నేను దేవుణ్ణి అడిగి చెపుతాను అని చెప్పగానే వాళ్ళు పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వుతున్నారు. ఆ నవ్వు చాలా వ్యంగ్యంగా ఉంది. అది ఎందుకో మీరు అర్ధం చేసుకోగలరు.



వాళ్ళుపోగానే నేను భగవంతునకు చెప్పుకున్నాను. ఈ వెదవ పరీక్ష కోసం నేను నా కార్యక్రమాన్ని దేన్నీ మానుకోలేను. ఒకవేళ ఋణానుబందాలు తీరాలి గనుక వెళ్ళమంటే కడపకు వెళ్ళివస్తాను. R.T.C. వారికి బాకీ, లాడ్జి వారికి బాకీ, కిరొసిన్, పాలు, కూరగాయలు వీళ్ళందరికీ బాకీలు తీరాలిగదా. పరీక్షకు పొమ్మనేటట్లయితే సాయిబాబా చరిత్రలో షేవాడే విషయం గానీ దాసగణు విషయంగానీ నేను పుల్ల పెట్టి తీసినచోట రావాలి. వీటి రెంటిలో ఏ ఒక్కటీ రాకుంటే పరీక్షకు పోనక్కరలేదని అర్ధము అని చెప్పుకొని పుల్ల పెట్టి తీశాను.

చిత్రంగా దాసగణు పోలీస్ ఇనస్పెక్టరు పరీక్ష పాసవడం వచ్చింది. ఇక తప్పదని కడపకు పరీక్షకు వెళ్ళాను. మా టీచర్స్ అంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఎందుకంటే నేను వాళ్ళను చూచైనా వ్రాసుకుంటానని. భగవంతుడు ఎంత గొప్ప మేధావంతుడో ఎవ్వరూ చెప్పలేరు. వాళ్ళంతా నా ముందు నెంబర్లు - నేను వాళ్ళకు చివరివాడిని. వాళ్ళ వరకు ఒక రూము. నా రూము నా నెంబరుతో మొదలైంది. ఇక వాళ్ళను చూచి నేను వ్రాసేదేముంది.

పరీక్ష మొదలైంది. ఎవరి గొడవలో వాళ్ళు చాలా వేగంగా వ్రాస్తున్నారు. ఏమీ తెలియని నేను మాత్రం ఎక్కడో చూస్తున్నాను. మధ్య వరుసలో ఆయన కాకుండా అతని ప్రక్క టీచర్ పేనాతో బెంచ్ తడుతున్నాడు. ఏ పనీ లేని నేను ఆయన వైపు చూచాను. ఏమి ఊరక కూర్చున్నావని సైగతో అడిగాడు. నా తలకాయలో ఏమీ లేదని సైగతోనే చెప్పాను. పుస్తకం ఇమ్మని అడిగాడు. లేదని సైగచేశాను. అతను నవ్వి - చిన్న కాగితం ముక్కపై ఏ ఏ ప్రశ్నకు ఏ ఏ పేజీలో ఆన్సర్లు ఉన్నాయో వ్రాసి ఒక ప్రింటెడ్ పుస్తకంలో పెట్టి అందించాడు.

ఇక ఊరకుండలేక మొదటి పేరా మధ్యలో కొంత చివరి పేరాగ్రాఫు ఎంతో స్పీడుగా వ్రాస్తూ అన్నీ ప్రశ్నలూ వ్రాసేశాను. నా దృష్టి ప్రింటెడ్ బుక్ మీద పేనా తెల్ల కాగితం మీద దొర్లిపోతుంది. నేను వ్రాసిన వ్రాతకు అర్థం పర్థం లేదు. ఎవరైనా పూర్తిగా చదివి మార్కులేసి ఉంటే నాకు మైనస్ మార్కులే వస్తాయి. కానీ ఎంత చిత్రమో నేను కూడా పాసయ్యాను. మా టీచర్స్ అందరికీ గొప్ప గుణపాఠమైంది.

## 15 రోజులు ఘాఢనిద్ర

శ్రీ స్వామివారు "చమురు లేకుండా కాల్చు" అని ఒకరోజు నా స్వప్నంలో చెపుతున్నారు. అప్పుడు నేనొక చెట్టెక్కి ఒక పెద్ద డబ్బాతో ఆ చెట్టు మీద ఏదో చమురు చల్లుతున్నాను. ఆ చెట్టుకు పదడుగుల దూరంలో శ్రీ స్వామి వారు అగ్ని గుండం ముందు కూర్చొని చెట్టు మీదనున్న నా వైపు చేయి చూపిస్తూ "చమురు లేకుండా కాల్చు" అని పెద్దగా అరుస్తున్నారు. నా స్వప్నం అయిపోయింది. తెల్లవారి శ్రీ స్వామి వారిని ఈ స్వప్నం యొక్క అర్థమేమిటని ఎన్ని మార్లు అడిగినా మౌనం వహించారు. శ్రీ స్వామి వారి సేవకులు - "నిదానంగా మీకే అర్థమౌతుంది. ఆ విషయంలో శ్రీ స్వామి వారిని ఇక అడగబాకండి" అని చెప్పడంతో నేను వారినిక ప్రశ్నించలేదు. అప్పటి వరకు చమురు పదార్థాలు తింటున్నాను. ఆయాసం వస్తూ బాధపడుతున్నాను. కానీ చమురు పదార్థాలు తిన్నందున ఆయాసం వస్తుందనే గుర్తింపులేదు. శ్రీ స్వామి వారు ఈ స్వప్న సందేశమిచ్చాక చమురు పదార్థాలు (వడలు వగైరా) తినినాను. అందువలన ఆయాసం వచ్చింది, అనే గుర్తింపు కలిగి క్రమేణా చమురు పదార్థాలు తినడం తగ్గించగానే ఆయాసం బాధించడం కూడా తగ్గింది.



కానీ శ్రీ స్వామి వారు "చమురు లేకుండా కాల్చు" అని చెప్పినా నేనా ఆదేశాన్ని నూటికి నూరు పాళ్ళు ఆచరించ లేకపోయాను. ఆచరిస్తున్నానని అనుకున్నానేగానే అంతా తప్పని తెలియలేదు. నూనె లేదని రస్కు బిస్కెట్లు ఎక్కువగా తినేవాణ్ణి. వేరుశెనగ ముద్దలు తినేవాణ్ణి. వీటిలో చమురు ఉందని తెలియదు. ఒకప్పుడు బేకరీలో గోధుమపిండి నూనెతో కలపడం చూపించి అవి తినకుండా చేశారు శ్రీ స్వామి వారు. బేకరీలో ఆ విషయం చూడడమే స్వామికృప. విపరీతమైన ఆయాసం, రాత్రి పగలు నిద్రగానీ ఆహారంగానీ లేదు. లారీ క్రింద పడితే బాధ విరగడై పోతుంది అని అనేవాణ్ణి గనుక నా భార్య, మా అమ్మ తెల్లవార్లులూ పగలంతా నాకు కాపలా ఉండేవారు. దేనికి ? లారీ క్రింద పడకుండా. ఒకరోజు అన్నం వంచుతున్న మా అమ్మ తూగడం చూచాను. ఆ తూగులో అన్నం గిన్నె చెయ్యి జారితే ఎంత ప్రమాదమో గదా! చెప్పరాని బాధ వేసింది. ఆ రోజు సాయంత్రమే శ్రీ స్వామి వారు కలిచేడు వచ్చారని తెలిసింది. రాత్రికి నేను ఇంట్లో లేకుండా అట్లా స్వామి దగ్గరకుపోతే మా అమ్మ నాభార్య నిద్రపోతారని తలచి రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి వారి దగ్గరకు బయలు దేరాను. చాలా ఎక్కువగా ఆయాసముంది. హాస్టలు పిల్లలను తోడు పంపింది మా అమ్మ.

నేను శ్రీ స్వామి వారి దగ్గరకు పోయింది ఇంట్లో వాళ్ళు నిద్ర పోతారని మాత్రమేగానీ నా బాధ తగ్గించమని శ్రీ స్వామి వారిని ప్రార్థించేటందుకు కానేకాదు. ఎంత చిత్రమో - నేను శ్రీ స్వామి వారి సన్నిధికి చేరిన మరుక్షణమే నేల మీద పడుకొని 8 గంటల సేపు (రాత్రి 8 గంటల నుండి వేకువ జాము 4 గంటల వరకు) ఘాఢంగా నిద్ర పోయాను. ఆ అనుభవం ఎంతో చిత్రంగా తోచింది. ప్రతి నిత్యం తినరాని పదార్థాలు తిని ఎంతో గొప్ప ఆయాసం బాధలో వచ్చినా వెంటనే

ఘాఢంగా నిద్రపోయే వాణ్ణి, ఇలా పదిహేను రోజులు జరిగాయి. ఏ ఏ పదార్ధాలు తింటే ఆయాసం వస్తుందో అవన్నీతిని ఆయాసం బాగా తెచ్చుకొని శ్రీ స్వామి వారి సన్నిధికి పోతానే హాయిగా నిద్ర పోయేవాడిని. తినరాని పదార్ధాలు తిని మందు త్రాగకుండా పోయేవాడిని. ఎప్పుడైనా వారి సన్నిధికి పోగానే ఘాఢంగా నిద్రపోయేవాడిని. చివరకు ఒక అనుమానం పీకుతోంది. మన జబ్బు తగ్గడం శ్రీ స్వామి వారి దయ కాదు, వారి దగ్గరున్న మంట ప్రభావమని అనుమానించాను. ఈ అనుమానం కూడా లేకుండా చేశాడా కరుణామయుడు. ఇప్పుడు కలిచేడు వదలి చెర్లోపల్లి రామాలయం (పూరి కొట్టం) లో ఉన్నారు శ్రీ స్వామి వారు. సాయంత్రానికి ఆయాసం విపరీతంగా ఉంది. ఇంటి దగ్గరుండి తెల్లవార్లులూ నేను బాధపడడమే గాక ఇంట్లో వాళ్ళని బాధ పెట్టడమెందుకు. అట్లా చిన్నగా తలుపూరు చెర్లోపల్లెకు శ్రీ స్వామి వారి సన్నిధికి పోతే నిద్రపోవచ్చని ఆశపడి సైకిల్ తీశాను. ఆ చీకటి రాత్రివేళ 8 గంటల టైంలో బాగాలేని వాడివి పోవద్దు అంటారు మా తల్లీ, భార్య. మా అమ్మ అడ్డమొస్తే తోసేసి కదిలాను. ఊరి బయట కొచ్చేసరికి ఆయాసం ఇంకా ఎక్కువైంది. సైకిల్ దిగి ఎవరినైనా అడిగి మంట వేసుకుందామని ఒక వైపు - చచ్చినాసరే సైకిల్ వదిలేసి దొర్లుకుంటానైనా శ్రీ స్వామి వారి చెంతకు చేరాలని మరొకవైపు ఆలోచనలతో 20 నిమిషాలు పట్టే దూరాన్ని సైకిల్ హేండిల్ మీద పడి తొక్కుతూ అతి కష్టం మీద ఒక గంటకు పైన ప్రయాణం చేసి శ్రీ స్వామి వారిని చేరాను.

నేను వెళ్ళే సమయానికి శ్రీ స్వామి వారు గంజి త్రాగుతున్నారని శ్రీ స్వామి వారు గానీ, అగ్ని హోత్రంగానీ కనబడకుండా గూడ అడ్డుపెట్టి యున్నారు. నా సైకిల్ శబ్దం విని దగ్గరకు రావద్దని చెప్పడంతో సైకిల్ దిగి స్టాండు వేయలేక అక్కడ పడేసి నేలమీద కూలబడ్డాను. రోశిరెడ్డి గారు దగ్గరకొచ్చి ఈ రాత్రి పూట చీకటిలో రావడమెందుకు. అక్కడుండి



పిలిస్తే పలుకడా. అబ్బా ఎంత బాధలో వచ్చావయ్యా అంటూ ఇంకేమిటో మాట్లాడుతున్నాడు. ఐదు నిమిషాలలో నాకు పూర్తిగా ఆయాసం తగ్గిపోయింది. తగ్గిందని కూడా నాకు తెలియదు. మామూలు స్పృహలో లేను. రోశిరెడ్డి గారే నీకిప్పుడు కొంచెం తగ్గినట్లుందే అనడంతో మనలోకంలోకొచ్చాను.

ఇప్పుడు శ్రీ స్వామి వారి గుండం చూడనే లేదు. శ్రీ స్వామి వారు గంజి త్రాగుతుంటే గూడ అడ్డం పెడుతారు గనుక, గుండం వలన నా ఆయాసం తగ్గుతుందనే సంశయం కూడా తీరింది. కేవలం శ్రీ స్వామి వారి కృప వలననే నా బాధ తగ్గుతుందని తీర్మానించుకున్నాను.

## స్నేహితుని బియ్యం నేనే వండుకుని తినడం

పూజ్యశ్రీ రోశిరెడ్డి గారి లాగా "నీ ఆజ్ఞలను నీకు ప్రీతిపూర్వకంగా ఆచరించేటట్లు నాలో ప్రేరణ పెట్టి ఆచరింపచేయి ప్రభూ" అని వారి మాటకు ఎదురు ప్రశ్న వేయకుండా ప్రార్ధించే సంస్కారము ఎన్ని జన్మలకు వస్తుందో గదా. ఒకసారి హెడ్మాష్టర్సు అకౌంట్ టెస్ట్ వ్రాసేందుకు కడపకు వెళ్ళాను. అక్కడ నాస్నేహితుడు నన్ను లాడ్జి ఖాళీ చేయించి తన ఇంటికి తీసుక వెళ్ళాడు. ఎంత చెప్పినా వినిపించుకోకుండా నా బియ్యం వాడకుండా వాళ్ళ బియ్యమిచ్చి నన్నే వండుకుని తినమన్నాడు. అన్నం పూర్తిగా కూడా తినలేదు. తినేటప్పుడే ఆయాసం, చలి, దగ్గు మొదలైంది. నా స్నేహితుడు అదిరి పోయాడు. ఇంటికి డాక్టరును పిలిపించి ఇంజెక్షను వేయించాడు. ఏమీ తగ్గలేదు. చిన్నగా పరీక్ష వ్రాసి వచ్చేశాను. పరీక్ష పాసైనాను గానీ ఆయాసం చలి, దగ్గు వరుసగా నెలరోజులు విపరీతంగా బాధపెట్టాయి. ప్రతి నిత్యం ఆస్పత్రికి పోవాలి. నిద్ర ఆహారం లేక

ఈ నెల రోజులలో ఎముకల గూడైనాను. డాక్టర్ల బిడ్డలందరూ నా దగ్గర చదువుకొంటారు. గనుక డాక్టర్లందరూ ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేశారు. "మద్రాసు వెళ్ళి పరీక్ష చేయించుకొని రావలసింది. మందులు మేమే తెచ్చి ఇస్తాము. ఇక్కడ పరికరములన్నీ చాలా పాతవి. సరైన ఫలితాలు చూపలేవు" ఇక చేసేది లేక మద్రాసు పోదలచినాను. ముందుగా గొలగమూడి వెళ్ళి శ్రీ స్వామి వారి సమాధి దర్శించి వారికి విన్నవించుకోవాలని ప్రయాణమయ్యాను. మూడురోజులు గొలగమూడిలో ఉండాలని వంటకు స్టౌ, కిరొసిన్, గిన్నెలు, బియ్యం, సామాను అన్నీ సంచులకు పెట్టుకొన్నాను. అప్పుడు నా వేషం చాలా హీనంగా ఉంది. బాగా చలి గనుక చలి చొక్కా, దాని పైన దుప్పటి కప్పుకున్నాను. తలకు మఫ్లర్ చుట్టుకున్నాను. బస్సులో దగ్గువచ్చి గల్ల ఊసుకోవాలంటే పాత గుడ్డలు సంచిలో పెట్టుకున్నాను. నన్ను చూచి మా అమ్మ ఏడుస్తుంది.

బస్సు ఎక్కి కూర్చున్నాను. టిక్కెట్టుకు డబ్బులు ఎప్పుడిచ్చానో తెలియదు. నా సీటుకు ముందు సీటు కమ్మి పట్టుకొని నిద్రపోయాను. ఎంత ఘాఢమైన నిద్రో! నెల్లూరు వచ్చి ప్రక్క ప్రయాణీకులు లేపినంత వరకు నాకు స్పృహ లేదు. బస్సు దిగి గొలగమూడి బస్సుకొరకు ఎదురు చూస్తున్నాను. గొలగమూడి నివాసితో కాలక్షేపంగా హాయిగా మాట్లాడు తున్నాను. రాత్రి తొమ్మిది గంటలు అయింది. ఇంతలో అదే బస్సు ఎక్కేందుకు మా మామ వచ్చాడు. నా మద్రాసు ప్రయాణం గురించి చెప్పాను. ఆయన నన్ను పరిశీలించి - మద్రాకు పోవలసిన పరిస్థితి నీకేమీ లేదు గదా? పోవడమెందుకు అన్నాడు. అప్పుడు నాకు కలిచేటిలోని నా పరిస్థితికి, ప్రస్తుత పరిస్థితికి భేదం తెలిసి నాకు ఆయాసం, చలి, దగ్గు లేవు అని తెలిసింది. ఇంతలో బస్సు వచ్చింది. పెద్ద రద్దీ. చిన్నగా ఎక్కి గొలగమూడి చేరాను. ఆ రాత్రికి ఆయాసం, దగ్గు, చలి చూస్తామన్నాలేవు. చాలా ఆశ్చర్యంగా ఉంది. రాత్రంతా



బాగా నిద్రపోయాను. తెల్లవారి మొదటి కార్యం క్షురకర్మ. మంగలిని పిలచి క్రాపు, గడ్డం చేయించాను. హాయిగా చన్నీళ్ళ స్నానం చేశాను. శ్రీ స్వామివారికి ప్రదక్షిణలు నమస్కారాలు చేశాను. ప్రస్తుతం నేను జబ్బు మనిషినని ఎవ్వరికీ తెలియదు. నా వంట నేను చేసుకొని గత నెలరోజులకుగాను ఈ రోజే కడుపునిండా తిన్నాను. శుక్ర, శని, ఆది మూడు రోజులున్నాను, కడుపునిండా తినడం, కమ్మగా నిద్రపోవడం, రాత్రి పగలు సాయి చరిత్రతో సత్‌సంగము - ఇది కాలక్షేపము. ఉదయం 5½ గంటలకు బస్సు. గనుక ఆదివారం రాత్రి 10 గంటలకు సంచులన్నీ రెడీగా సర్ది పెట్టుకున్నానో లేదో వెంటనే పాత పద్ధతిలో ఆయాసం అప్పటికప్పుడు వచ్చింది. నేలపైన దొర్లాడుచున్నాను. ఆశ్రమంలో అందరూ గుమికూడారు. పూజారి నాగయ్యగారు వస్తే అందరూ ఆయనకు నా సంగతి చెపుతున్నారు. "ఇప్పుడిదాకా బాగానే ఉన్నాడు. సాయిబాబా చరిత్ర చదివి చెప్పాడు. సంచులు సర్దుకున్నాడో లేదో వచ్చిందీ మాయరోగం" అన్నారు. నాగయ్య వెంటనే అదీ కథ. సంచులు సర్దుతూనే అనారోగ్యం గనుక కొన్నాళ్ళు ఇక్కడే ఉంటానని మొక్కుకో బాగుంటుంది అన్నాడు. "స్వామీ నే నిక్కడుండడమే మీ సంకల్పమైతే ఈ క్షణంలో నాకు ఆరోగ్యంగా ఉంటే ప్రతిరోజు ఉద్యోగం చేసి రాత్రికి ఇక్కడకు వస్తాను" అని చెప్పుకున్నాను. ఒక గంటసేపు బాధ పడ్డవాడిని ఈ మాట చెప్పుకోగానే ఐదు నిమిషాల్లో మరలా ఆయాసం లేకుండా హాయిగా ఉన్నాను. దాంతో ప్రతినిత్యం సైకిల్ మీద నెల్లూరు వెళ్ళి అక్కడనుండి బస్సులో నలభై కిలోమీటర్ల దూరంలోని కలిచేడు వెళ్ళి టీచర్ పనిచేసి రాత్రికి గొలగమూడి చేరేవాణ్ణి. ఒక సంవత్సరం తిరిగినా శ్రీ స్వామి వారు ఇక రావద్దని చెప్పలేదు. మా అమ్మ శ్రీ స్వామి వారిని అడిగి ఇక పోవద్దంటుంది. నేనడుగకనే నిత్యం రమ్మని చెప్పింది వారే గనుక - రావద్దని కూడా వారే చెప్పాలి. నేను వారిని అడుగను అని నేను మొండిగా మాట్లాడేవాడిని. ఒక సంవత్సరం చూచి - పిల్లలు చదువు

కోవడం లేదని నా భార్య పిల్లలు గొలగమూడి వచ్చేశారు. ఇల్లులేని మాకు ఆశ్రమమే ఇల్లయింది. ఇక తప్పదని 10 × 12 అడుగులు ఉండే చిన్న పూరిగుడిశ వేసుకొని ఒక సంవత్సరం గడిపాను. శ్రీ స్వామి వారి జీవిత చరిత్ర ప్రింటయింది. భక్తులు విపరీతంగా రాసాగారు. ఆశ్రమానికి సేవకులుండే పూరిల్లు తప్ప ఇక వేరే నీడేలేదు. అందరి చెప్పులు, సంచులు పెట్టేందుకు మా ఇల్లే ఆధారమైంది. భక్తుల కొరకైనా ఇల్లు పెద్దదిచేయాలని నిర్ణయించాను.

## గొలగమూడిలో రేకుల ఇల్లు

నా ఆరోగ్యం కొరకు డాక్టర్ల సలహాపై మద్రాస్ వెళ్ళాలని ముందుగా శ్రీ స్వామి వారి సమాధిని దర్శించిపోవాలని కలిచేడులో బస్సు ఎక్కినది మొదలు నా ఆరోగ్యం బాగుంది. మూడు రోజులు గొలగమూడిలో ఉంటే బాగానే ఉన్నాను. కలిచేడు వెళ్ళేందుకు సంచులు తీసుకుంటూనే అనారోగ్యం తిరగబెట్టింది. ఉద్యోగం చేసుకొని ప్రతిరాత్రి గొలగమూడి వస్తానని చెప్పుకోగానే ఒక గంట సేపు బాధించిన అనారోగ్యం బాగుంది. అది మొదలు నిత్యం రాత్రికి గొలగమూడి వచ్చేవాడిని. శ్రీ స్వామి వారి ఆశ్రమంలో ఆ రోజులలో తలదాచుకోను నీడలేదు. 10 × 10 అడుగులు ఉండే పూరి గుడిశ వేసుకోవాలని ప్రయత్నిస్తే ఆశ్రమంలో అందరూ నిరాకరించారు. అదే సమయంలో ఆశ్రమానికి దగ్గరలో స్థలం అమ్ముతానన్నారు. డబ్బేలేకుండా అతి దగ్గరలో గవర్నమెంటు స్థలంలో వేసుకోమని కరణం చెపుతున్నాడు. శ్రీ స్వామి వారి స్థలంలో ఉండవలెనా బయట ఉండాలా అని చీట్లు వేశాను. శ్రీ స్వామి వారి స్థలంలోనే ఉండమని వచ్చింది. కానీ ఆశ్రమంలో అందరూ ఆశ్రమానికి చాలా దూరంలో వేసుకోమన్నారు. సరే నేను కోరే



స్థలాలు మూడు. ఎక్కడ వస్తే అక్కడే ఉంటానని చీట్లు వేస్తే ప్రస్తుతం పోలీసుస్టేషన్‌కు ప్రక్కన ఉండే స్థలం వచ్చింది. అక్కడ చిన్న పూరి ఇల్లు వేసుకొని ఉంటున్నాను. శ్రీ స్వామి వారి చరిత్ర వెలువడింది. భక్తులు విపరీతంగా వస్తున్నారు. వాళ్ళ సంచులు, చెప్పులు భద్ర పరిచేందుకు నా చిన్న గుడిశ తప్పితే వేరే ఏ ఆధారమూ లేదు. వచ్చే భక్తులకోసమై నా ఇల్లు పెద్దది చేయాలంటే ఆశ్రమవాసులంతా ఏకగ్రీవంగా వద్దంటున్నారు. వచ్చే భక్తుల కొరకు వాళ్ళు కట్టరు. నన్ను కట్టనివ్వరూ.

శ్రీ స్వామి వారు అనుక్షణమూ మనలను గమనిస్తూనే ఉంటారు. మన ఆత్మలోని భావాలు వారికి చక్కగా ఎరుకే. ఒకరోజు ఒక కమిటీ మెంబర్ వచ్చి నా బాధ విన్నాడు. నేను రేకులతో ఇల్లు వేస్తాను. నేను అందులో ఉండకుంటే ఆశ్రమానికి ఇచ్చేస్తాను లేక భవిష్యత్తులో ఆశ్రమ ప్లానులకు ఈ ఇల్లు అడ్డమైతే పడకొట్టుకోండి అని కాగితం మీద వ్రాసి ఇస్తానని చెప్పాను. అట్లయితే తులసమ్మ కుమారుడు నారాయణ రెడ్డి గారి సమక్షములో చీట్లు వేస్తాము. ఆయనను పిలిపించమన్నారు. ఎంత చిత్రమో శ్రీ స్వామి వారి కరుణ. తెల్లవారి ఉదయం 5 గంటలకు నేను పెనవర్తికి మనిషిని ప్రయాణం చేసి వాకిట్లోకి తీసుకవచ్చేసరికి ఆదినారాయణ రెడ్డి గారే రాత్రి మూడు గంటలకు లేచి పెనవర్తి నుండి గొలగమూడి వచ్చారు. చీట్లు వేశాము. రేకుల ఇల్లు వేసుకోమని ఆజ్ఞాపించారు. ఇల్లు వేశాక ఇంటిలోపల సిమెంటు వేయవద్దు. బయట వేసుకో అని చెప్పారు. సరేనని అలా చేస్తే గోడలు మట్టితోను ఇసుకతోను కట్టాము గనుక ఇల్లంతా చెదులే. ఒకరోజు గోడకు తగిలించిన చొక్కా ఒక పొర తినేశాయి. రెడ్డిగారికి ఈ విషయం చూపించి అడిగితే లోపల కూడా సిమెంటు వేసుకోమన్నారు. ఆ ఇంటిలోనే 85 వ సంవత్సరం నుండి 94 వరకు ఉన్నాము. ఆశ్రమ కమిటీతో నా మనస్తత్వం గిట్టక ఆ యింటిలో అనేక కష్టాలు పడ్డాము. ఉదాహరణకు - బయట అందరూ

వచ్చి స్వామి వారి తొట్టి దగ్గర నీళ్ళు ముంచుకు పోతారు. మేము తాగేందుకు ఒక్క బిందె తెచ్చుకోబోతే తెచ్చుకోనివ్వలేదు. కోనేటి నీరే మాకు శ్రీ స్వామి వారిచ్చిన అమృతమైంది.

నేను కలలోనైనా తలంచని విధంగా మిద్దె ఇల్లు కట్టించి, తరుగులేని మంచినీళ్ళు గల బావి త్రవ్వించి ప్రహరీ గోడలుతో సహా ఏర్పాటు చేసి నన్నొక బంగ్లాలో నిలిపారు. ప్రక్కనే మరల సాయిమాష్టర్ నిలయం అనే భక్తనివాస్ కట్టి పదిమంది యాత్రికులకు ఉచిత నివాసం ఏర్పరచారు. శ్రీ స్వామి వారి కృపకు పాత్రుడనయ్యే విధంగా నన్ను నడిపించమని నాలో కలుపు మొక్కలు బలపడకుండా చేయమని శ్రీ స్వామి వారిని వేడుకుంటున్నాను.

## బియ్యం అక్షయం చేయడం

ఆ రోజుల్లో ఆశ్రమంలో గుమాస్తాలు లేరు. ఇంతమంది భక్తులు నిత్యం దర్శించే వారు కాదు. హుండీలో రాబడి కూడా చాలా తక్కువ. అన్నీ పనులు నేనే చూచే వాణ్ణి. ఆ సమయంలో ఆశ్రమంలో కంటి ఆపరేషన్ల క్యాంపు పెట్టినట్లు గుర్తు. ఒక్క క్షణం తీరిక లేకుండా తిరుగుతున్నాను. ఇంటిలో బియ్యం అయిపోయాయి. ఇక ఆరాధన ఒక నెల ఉంది. ఆ రోజుల్లో ఆరాధనకు వచ్చిన బియ్యం మిగిలిపోయిన వాటిని వేలం వేసేవాళ్ళు. నేను ఐదు లేక ఆరు బస్తాలు ఒకేసారి కొని వేపాకు బియ్యంలో కలిపి బస్తాలు కుట్టి పెడితే పురుగు పట్టకుండా నిల్వ ఉంటాయి. అలా కొనాలని చూస్తున్నాను. ఇంట్లో బియ్యం రోజుకు మూడులోటాలు చొప్పున 10 రోజులకు మాత్రమే ముప్పైలోటాలు ఉన్నాయి. ప్రతిరోజు బియ్యం తెమ్మంటారు. నాకు బొత్తిగా తీరికలేదు.



రేపు, రేపు అంటూనే గడిపేస్తున్నాను. చిత్రంగా పది రోజులకు సరిపోయే బియ్యం నెలరోజులకు సరిపోయి ఆరాధనకు మాత్రమే వేలంలో కొన్నాను. పది రోజులకు సరిపోయే బియ్యం ముప్పై రోజులకు రావడమేమిటి. ఇంటిలో అందరికీ ఇది శ్రీ స్వామి వారి గొప్ప మహిమగా తెలిసి వచ్చింది.

శ్రీ స్వామి వారి నుండి ఇలాంటి మహిమలు ఆశించ కుండా మనం శ్రీ వారికి సేవచేస్తుంటే వారు మనలను ఎలా రక్షిస్తారో తెలిపేదే ఈ లీల. ఇలాంటి లీల ద్వారా మనలను రక్షిస్తారులే, అని మన మనసులో ఆలోచన కల్గితే మాత్రం వారు మన సమస్యను పరిష్కరించరు. చెమట పట్టేటట్లు మనం శ్రమిస్తుంటే వారేవిధంగానైనా మన సమస్య పరిష్కరించి తీరుతారు.

## కట్టెలు - రావడం

కొందరు స్వార్ధపరులు ఆశ్రమము మీద సర్వాధిపత్యము కావాలని దానికి మేమే వారసులమని కోర్టులో కేసువేశారు. కోర్టువారు, ఆడిట్ చేసిన లెక్కలు ఆశ్రమం వారిని పదిహేను రోజులలోగా దాఖలు చేయ మన్నారు. మూడు సంవత్సరాల లెక్కలు ఆడిట్ కాలేదు. నెల్లూరులో ఎవ్వరి దగ్గరకు పోయినా మూడు సంవత్సరాల లెక్కలు ఆరు నెలలలోపల వ్రాయలేమన్నారు. శ్రీ ఆదినారాయణ రెడ్డి గారు, శ్రీ బుజ్జన్న గారు, శ్రీ నాగయ్య గారు అందరూ నన్ను వ్రాయమని వత్తిడి చేయసాగారు. నాకందులో అనుభవం లేకున్నా వ్రాయక తప్పలేదు. నా విద్యార్థి హనుమంతరావును తీసుకవచ్చి రాత్రింబవళ్ళు వ్రాస్తున్నాము. రోజుకు మూడు గంటల నిద్రమాత్రమే. క్షణం తీరికలేదు.

ఈ సమయంలో ఇంట్లో కట్టెలు బొత్తిగా అయిపోయాయి. ఈ గ్రామంలో కిరోసిన్ దొరకదు. తగిన స్టౌ లేదు. ఇవి నెల్లూరు నుంచి తెచ్చిచ్చే మనిషి లేడు. గతవారం నుండి ఇట్లాగే జరిపేస్తున్నాను. ఈ రాత్రికి అన్నం వండేది లేదని చెపుతున్నారు. రేపు ఉదయాన్నే వెంకటాచలం నుండి కట్టెలు సైకిల్ మీద తెస్తాను. రాత్రికి తాటాకులతోనైనా వంట చేయమని నా పనిలో నేనున్నాను. ఎంత చిత్రమో నేను ఆశ్రమం నుండి ఇంటికి వచ్చేసరికి కట్టెల బండి మా వాకిట ముందు నిలబడి ఉంది. ఎండు కట్టెలు. కట్టెలు కావాలా అని బండివాడు అడిగితే - ఎంత ఖరీదు అని కూడా అడగకుండా వేసెయమన్నాను. అతనడిగిన ధర ఇచ్చేశాను.

అతనెందుకు కట్టెలు తోలుక వచ్చాడు? బజారులో హోటలు వాళ్ళు తెమ్మన్నారట. తెచ్చినాక ధర తగ్గించి అడిగారట. బండి తిప్పుకొని పోయేవాడు పోక మా యింటిముందు ఆపి అడిగాడు. ఇది కాకతాళీయంగా జరిగిందని ఎవరేమన్నా నాకు మాత్రం శ్రీ స్వామి వారి కృపవల్ల జరిగిందేనని నమ్మకము. మనం హృదయపూర్వకంగా వారిసేవ చేస్తుంటే వారు తప్పక మన అవసరాలు తీరుస్తారు. అలా తీర్చాలని మనంమాత్రం కోరరాదు.

## కిటికీ తీసి ద్వారం పెట్టాలనడం - చీట్లు వేయడం

మందిరం దగ్గరున్న పాత రేకుల ఇంటి వెనుక స్థలం ఉంది. కానీ అక్కడికి పోవాలంటే ఇంటి చుట్టు తిరిగి పోవాలి. వేసవికాలంలో ఇంట్లో గాలి ఉండదు. అక్కడ ఉత్తరం వైపు ఉండే కిటికీ తీసి ద్వారం పెడితే గాలి కావాలన్నప్పుడు ఆ ద్వారం గుండా పోవచ్చు. ఎందుకో ఇల్లు



కట్టేటప్పుడు శ్రీ స్వామి వారు కిటికీ పెట్టించారు. ఇప్పుడు తీయాలంటే సమాధి దగ్గర చీట్లు వేశాను. ఎట్లా ఉన్న కిటికీ అట్లాగే ఉంచమని వచ్చింది. ఇక ఆ ప్రయత్నం మానేశాను. మూడవ రోజు ప్రక్కింటి వారికి అక్కడ ద్వారముంటే దాని గడియ తీసి దొంగలు దూరి చాలా సామాను తీసుకపోయారు. మా ఇంటికి కూడా ద్వారముంటే వాళ్ళింటికంటే ముందు మా ఇంట్లో ఆ దొంగలు ప్రవేశించి ఉండేవారు. అది తెలిసే శ్రీ స్వామి వారు ద్వారం పెట్టవద్దని ఆదేశించారు.

## పొలం అమ్మాలంటే వద్దనటం

నాకొక చేనుంది. దానిని అమ్మి డబ్బు బ్యాంకులో వేసుకుంటే కావలసినంత వడ్డీ వస్తుంది. కానీ ప్రస్తుతం బ్యాంకు వడ్డీలో ఆరవభాగం గూడా ఫలింపుగా పొలం కవులకు చేసేవాడు ఇవ్వడం లేదు. ఒకసారి పొలం చేసేవాని పోరు పడలేక శ్రీ స్వామి వారి దగ్గర చీట్లు వేశాను, అమ్మవద్దని వచ్చింది. అప్పుడే ఇరవై వేల రూపాయలకు అడిగాడు. ప్రతి సంవత్సరం ధర పెరగడం చీట్లు పెట్టడం - అమ్మవద్దని రావడం. మూడు సంవత్సరాల తర్వాత చీట్లు పెట్టడం మానేశాను. అదే ఇరవై వేల రూపాయలకు అడిగిన చేను ప్రస్తుతం లక్ష అరవై వేల రూపాయలకు అడుగుతున్నారు. ఆ సర్వజ్ఞమూర్తి ఆజ్ఞలను శిరసావహిస్తే మనం పొందే మేలుకు అవధులు లేవు.

# 10 సంవత్సరాల వయసులో శేషయ్య నెల్లూరులో తప్పించుకోడం

మా కుమారుడు శేషసాయి పది సంవత్సరముల వయస్సులో మాకు చెప్పకుండా ఒక పిల్లవానితో నెల్లూరుకు వెళ్ళాడు. ఆ పిల్లవాడు వీనిని మంచి ట్రాఫిక్ సెంటరులో వదలి అదే మీ బంధువుల ఇల్లు అని చెప్పి వచ్చేశాడు. అక్కడ మా బంధువులెవ్వరూ లేరు. ఆ చోటుకు రెండు కిలోమీటర్ల దూరములో మా బంధువులున్నారు. వీడికి వాళ్ళ పూర్తి అడ్రసు తెలియదు, కనీసం పూర్తి పేరు కూడా తెలియదు. రాజా అంటాము. ఇంటిపేరు కూడా తెలియదు. గుడ్డలంగడి రాజా అంటే అందరూ నవ్వుతున్నారు. వీడు రైలుగేటు దాటి బాలాజీ నగరం అంతా అడుగుతూ తిరుగుతున్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు. చేతిలో డబ్బులు లేవు. మంచినీళ్ళు దాహమయితే గూడ అడిగేందుకు తెలియదు. సాయంకాలం మూడు గంటల ప్రాంతంలో రోడ్డున పోతున్నాడు. రోజూ ప్రహరీ గోడ ఇవతల నుండి పుల్లిస్తరాకులు గోడవతల పారేసే ఆమె ఏదో ఆలోచనలో పడి గేటుగుండా బయటకు పోయి విస్తరాకు పడేసి ఇలా చూస్తే వీడు పోతున్నాడు. వీడి విషయమంతా ఆమెకు తెలుసు. ఏమి శేషయ్యా ఇక్కడికెందుకొచ్చావురా అని పలకరించింది. ఆమ్మా మీరిక్కడున్నారా. మీ ఇంటికొరకు వెతికి వెతికి చచ్చాననుకో అంటూ వాళ్ళింట్లోకి వెళ్ళాడు. ఆమె వీడికి స్నానం చేయించి అన్నం పెట్టి పండేసింది. బాగా అలసిపోయాడు గనుక అన్నం తింటూనే గాఢంగా నిద్రపోయాడు. ఈమె అంగటికి ఫోను చేసి తమ్ముడు రాజాను రమ్మంటే అతను రాకుండా గుమస్తాను పంపి సాయంకాలం సినిమా చూపించాడు. తెల్లవారి కొంచెం సేపు మాట్లాడి అంగటికి పోయాడు. వీణ్ణి తీసుక వచ్చి పత్తేఖాన్ పేటలో మా మేనమామ గారింట్లో వదిలారు.



వీడికి ప్రారబ్దముండి తిరిగినా స్వామి కృపలేకుంటే వాళ్ళ యింటిముందే పోవాలా? అప్పుడే ఆమె విస్తర పారెయ్యను రావాలా. గోడ ఇవతల నుండి విస్తర పారేసినా వీడు కనిపించడు. ఆమెను ఆలోచనలో పడేసి గోడవతలకు తీసుక వచ్చారు. ఇద్దరికీ మధ్యదూరం ఎక్కువైనా ఒకరినొకరు చూచుకోరు గనుక కలుసుకునే ప్రశక్తే లేదు. శ్రీ స్వామి వారు భక్త రక్షణ చేయడం ఎంతో చిత్రంగా ఉంటుంది. "వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది" అన్న శ్రీ స్వామి వారి మాటలు అక్షరాలా నిజమని నిరూపిస్తున్నారు.

గొలగమూడిలో నాభార్య చాలా బాధ పడుతున్నది. వాడి చేతిలో డబ్బులు లేవు - కాళ్ళకు చెప్పులు లేవు. బస్సుగానీ, బోర్డుకానీ చదువలేడు. నన్ను నెల్లూరులో వెతకమంటుంది. నేను కలిచేడు వదలి గొలగమూడి వచ్చింది పిల్లవాణ్ణి వెతుక్కునేందుకేనా. వెతకడం బిడ్డను ఇంటికి తీసుకరావడం అనేది శ్రీ స్వామి వారి పని. నేను మూడు రోజులు వెతకను అని బడికి వెళ్ళాను. ఆ రోజు కూడా పిల్లవాడు రాలేదు. తెల్లవారి బడికి పోతుంటే సైకిల్‌కు అడ్డుపడి ఏడుస్తుంది. సాయం కాలానికి రాకుంటే రేపు నేను వెతుకుతాను అని చెప్పి వెళ్ళిపోయాను. ఈమె అన్నం తినడంలేదు. బిడ్డ జాడ తెలియక అన్నం తినాలనే మాటే మరచిపోయి ఒకటే ఏడుపు. నేను లేనప్పుడు పటాల ముందు కూర్చొని బోరున ఏడుస్తూ "ఏమి స్వామి - నేను సమర్పించే నైవేద్యాలన్నీ ఏమైనట్లు, నేను చేసే పారాయణలన్నీ ఏమైనట్లు, నా బిడ్డనిలా బాధ పెట్టడం మీకు మంచిదేనా అని పెద్దగా ఏడ్చుకుంది. వెంటనే ఆమెకు మైకం వచ్చి మనలోకం లేకుండా పోయింది. ఆ మైకంలో ఆమెకొక దృశ్యం కనిపించింది. అగ్ని గుండంలో అఖండదీపం వెలుగుతోంది. అది మొదలు పెద్దగా ఏడుస్తుంది. నేను రాగానే సైకిల్ మీదపడి ఏడుస్తుంది. ఏమి జరిగిందో చెప్పమని స్థిమితంగా అడిగాను. తనకు మైకంలో

కనబడ్డ దృశ్యము అంతకుముందు తానన్న మాటలు చెప్పింది. నా నైవేద్యాలన్నీ ఏమైనాయి, నా పారాయణలన్నీ ఏమైనాయి అన్నావు. అందుకు శ్రీ స్వామి వారు నీ నైవేద్యాలు అగ్ని రూపంలో తింటున్నాను. పారాయణలు వెలుగు రూపంలో వింటున్నానని చెపుతున్నాడు అని చెప్పితే వినదు. చనిపోయిన వారికి దీపం పెడుతాము, తల దగ్గర గనుక దీపం కనిపిస్తే పిల్లవాని ప్రాణానికేమో ముప్పు అని ఈమె ఏడ్పు. మేము చెప్పుకుంటూ ఉన్నాము. పిల్లవాడు బస్సు దిగి వస్తున్నాడు.

పిల్లవాడు బాలాజీ నగర్ నుండి పత్తేఖాన్ పేట వచ్చాడు. మా మామ కుమారుడు వీణ్ణి హోటల్‌కు తీసుక వెళ్ళి ఏదో తినిపించాడు. సాయంకాలం సినిమాకు పోతాము ఉండమంటే వీడు రాజరాజేశ్వరి గుడి దగ్గర మా అక్క ఉంది అక్కడికి పోవాలన్నాడు. అప్పుడు నా కుమార్తె బ్యాంకు పరీక్షల కోచింగ్ కొరకు రాజేశ్వరీ గుడి వెనుక నా మిత్రుడు రాధాకృష్ణమూర్తి గారింట్లో ఉంది. మా మామ కుమారుడు వీణ్ణి సైకిల్ మీద తీసుకవచ్చి రాజేశ్వరీ గుడి ముందు వదలి వెళ్ళిపోయాడు. రాధాకృష్ణయ్య గారిని మేము ఫోటోలాయన అంటాము. వారికి ఫోటో స్టూడియో ఉంది గనుక. వీడా ప్రాంతమంతా ఫోటోలాయన ఇల్లు ఎక్కడని అడుగుతుంటే అందరూ నవ్వుతున్నారు. ఇక్కడ స్టూడియో లేదు. ఒక కిలోమీటర్ దూరంలో రెమ్మీ స్టూడియో ఉందని చెపుతున్నారు. వీడు వాళ్ళెంత నవ్వినా అందరినీ అడుగుతూనే ఉన్నాడు. ఈ రాధాకృష్ణయ్య గారికి పాలు పోసే గొలగమూడి నివాసి సీతారామయ్య వీణ్ణి చూసి ఏం శేషయ్య ఇక్కడికెందుకొచ్చావంటే ఇక్కడ ఫోటోలాయన ఇంట్లో మా అక్క ఉంది. ఆమె దగ్గరకు పోవాలి. ఫోటోలాయన ఇల్లెక్కడ అన్నాడు. ఆయనకూ మొదట అర్థం కాలేదు. వెంకయ్య స్వామి మందిరంలో ఫోటోలమ్మే ఆయన అన్నప్పుడు ఆయనకు అర్థమై రాధాకృష్ణయ్యగారింట్లో వదిలి పెట్టాడు. వీడు వెళ్ళే సమయానికి సుమతి



కోచింగ్‌కు పోతూ నేను ఒక గంటలో వస్తాను. నీవు ఇక్కడే ఉండు అని వెళ్ళిపోయింది. అక్కడ ఆమె ఏదో పెడితే తింటున్నాడు. ఆమె తమ్ముడు వీణ్ణి సైగ చేసి బయటకు పిలచి సైకిల్ మీద తీసుకపోయాడు. అది ఆమెకు తెలియక ప్రక్క ఇండ్ల T.V.లన్నీ చూచింది. ఆఫీసుకు ఫోను చేసి రాధాకృష్ణయ్య గారిని పిలిచి చెప్పి వెతకమంది. మరలా ఆఫీసులో చెప్పి వచ్చి వెతుకుతానని చెప్పాడు. ఈమె అన్నం తినకుండా కాలు కాలిన పిల్లివలె తిరుగుతుంది. అప్పుడు ఒక పిల్లవాడు చల్లని వార్త చెప్పాడు. "మీ తమ్ముడు ఎవరినో సైకిల్ మీద ఎక్కించుకొని మూలాపేట ధర్మరాజుల దేవాలయం దగ్గరకు పోతుంటే చూచాను. వెనకనున్న పిల్లవాడు క్రొత్తవాడు" అప్పటికి ఈమె కాస్త చల్లబడింది. ఈలోగా నా కుమార్తె వచ్చింది.

వీణ్ణి అన్నం తినమని 5 గంటల ప్రాంతంలో గొలగమూడి బస్సు ఎక్కించి పంపింది మా కుమార్తె. బాలాజీనగర్‌లో ఏ విధంగా ఆమెకు శేషయ్య కనిపించాడో అదే విధంగా రాజేశ్వరి గుడి దగ్గర సీతారామయ్య కంట్లో పడ్డాడు. మనం దోవన పోతుంటే ఎందరో తెలిసిన వాళ్ళు కనపడ్డా మనం అందరినీ పలకరించము గదా! శేషయ్యను సీతారామయ్య చూడగానే వీడు అమాయకుడు. ఎప్పుడూ నెల్లూరు రాడు. ఒక్కడినే అసలు పంపరు, ఈ పిల్లవాడు ఇక్కడెందుకున్నాడు. అని అన్నీ ఒక్కక్షణంలో మనసులో మెదిలి వెంటనే పలకరించాడు. పలకరించడమే కాక ఫోటోలాయన ఎవరు? ఏమి చేస్తాడు? అక్కడ మీ అక్క ఎందుకుంది? ఇలాంటి ప్రశ్నలు వేసి ఫోటోలాయన అంటే రాధాకృష్ణయ్య. ఆయనే మందిరంలో ఫోటోలమ్మేవాడు అని నిర్ధారణ చేసుకొని రాజ రాజేశ్వరీ గుడి వెనుక ఉండే వాళ్ళ ఇంటికి తీసుకపోయి మా కుమార్తెతో కలిపాడు. దోవనపోతుంటే సీతారామయ్య ఎక్కడో చూస్తూ స్కూటర్ మీద

పోయినా వీడు కనబడడు. వీణ్ణి చూచేలా చేసి సమయానికి వీణ్ణి గురించి అమాయకుడనేది గుర్తుచేసి ఇక వీధుల్లో వీడికి తిప్పట తప్పించారు.

ఇంటి దగ్గర నా భార్య ఏడుస్తుంటే ఆమెను ఓదారుస్తూ అగ్ని గుండం, అఖండ దీపమూ చూపించి ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సర్వవ్యాపకుడైన ఆ కరుణామయునకు సాధ్యము, అసాధ్యము లేదు. "వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మన ముండేది" అన్న వారి మాట గుర్తెరిగి అనుక్షణమూ వారు మనతో ఉన్నారన్న ఎరుకతో అంతా ఆయన దివ్యరూపమనే భావనలో జీవిస్తుంటే వారికి సంతోషం కలుగుతుంది.

## శేషయ్య ఆరోగ్యానికి పారాయణ

అనంత కరుణామయుడైన శ్రీ స్వామి వారు శేషయ్య బాధ్యత తాను తీసుకుంటానని అభయమివ్వడం చిత్రమైన లీల. పిల్లవానికి చదువు రావడం లేదు శ్రీ స్వామి వారికి చెప్పమని బయటి వాళ్ళు ఇంట్లో వాళ్ళు పోరుచేస్తున్నారు. ఒకరోజు పిల్లవాణ్ణి తీసుకొని శ్రీ స్వామి వారి సన్నిధికి వెళ్ళాను. శ్రీ స్వామి వారికి దూరంగా ఉండగానే నా కాళ్ళకు బ్రేకులు పడ్డాయి. ఇలా ఆలోచించసాగాను - పిల్లవానికి చదువు అడుగుతాము ఇస్తారు. అనారోగ్యమైతే మరలా శ్రీ స్వామి నాశ్రయించాలి గదా. అదీ ఇస్తారు. దారిద్య్రం వస్తే - ఉద్యోగంలో ఇబ్బందులు వస్తే - మంచి భార్య రాకుంటే - మంచి సంతానం కలుగకుంటే ఎన్నిటికని శ్రీ స్వామి నాశ్రయించి దేబిరిస్తాము అని అనుకుంటూ నిలబడే ఉన్నాను. ఆ కరుణామయుడు "అయ్యా! ఆయనకేమి కావాలో వ్రాసుకోమను" అన్నారు. అక్కడున్న శ్రీ స్వామి వారి సేవకుడు బరిగెల నాగయ్య "సార్ మీ రొట్టె విరిగి నేతిలో పడింది. మీకు ఏమి కావాలో వ్రాసుకోండి.



అవన్నీ శ్రీ స్వామి వారు ఇచ్చేస్తారట. ఇట్లాటి వరం ఎవ్వరికీ ఇవ్వలేదు" అని తొందర పెడుతూ, అట్ట, కాగితం, పేనా నా చేతికిచ్చాడు. ఆ కరుణామయుడే నా బుద్ధిని ప్రేరేపించి ఇలా వ్రాయించారు. "స్వామీ! ఈ పిల్లవాని బాధ్యత తమరు వహించండి" అని ఒకే వాక్యం వ్రాసి వారికా కాగితం ఇచ్చాను. వారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ తన అభయముద్రలు (అంటే తన అరచేతిని తన నడినెత్తికి తాకించి ఆ తర్వాత కాగితం తాకించడం) ముమ్మారు వేసి ఆ కాగితం నాకిచ్చారు. ఈపిల్లవాని బాధ్యత నాది అని శ్రీ స్వామివారు ప్రమాణం చేశారని అర్ధం.

ఎంత ధౌర్భాగ్యపు సంస్కారాలో చూడండి. శ్రీ స్వామివారు ఇంత గొప్ప ఆశీర్వాదమిచ్చినా కొన్నాళ్ళ తర్వాత మరలా శ్రీ భరద్వాజ గారి దగ్గరకెళ్ళి పిల్లవానికి చదువు బొత్తిగా రావడం లేదు సార్ అని చెప్పాను. అంటే శ్రీ స్వామి వారి మాట వ్యర్థమైందని నేను నోటితో చెప్పకనే చెప్పినట్లు కాలేదా? వారి మాట మీదనే కాదు నా మాట మీదకూడా నాకు నమ్మకం లేనట్లే అయింది కదా? శ్రీ స్వామి వారి దగ్గర కొచ్చి ఎక్కడా ఎవరూ పొందలేని వరం పొందికూడా నేను ఏమీ పొందని వాడనే అయ్యాను? ఎందుకు గురువు గారి మాట మీద విశ్వాసమే వుంటే రోశిరెడ్డిలాగా మరొక ప్రయత్నమే చేయకూడదు. శ్రీ రోశిరెడ్డి గారికి బొత్తిగా చూపు లేకుండా పోతే ఆయన ఆపరేషన్లు చేయించుకునే ప్రయత్నం చేయలేదు సరికదా, భిక్షాన్నానికి పొమ్మన్న శ్రీ స్వామి వారి ఆదేశాన్ని మానలేదు. గురుదేవా, గురుదేవా అనుకుంటూ ఊరంతా తిరిగి బిక్ష చేసేవాడు. ఆశ్రమానికి రాగానే ఆ కొద్దిపాటి చూపు లేకుండా పోయేది. గురువుగారి మాట జవదాటని సచ్ఛిష్యుని ప్రవర్తన అలా ఉంటుంది. మరి ఇప్పుడు నా ప్రయత్నం అందులకు భిన్నంగా ఉన్నదిగదా! అనంత కరుణామయుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వసమర్ధుడైన ఆ జగద్గురుడే శ్రీ మాష్టారి రూపంలో ప్రకటమౌతున్నారు

గనుక - శేషయ్యకు చదువు రావడంలేదు సార్ అని అనగానే మద్రాసు తీసుకపొమ్మన్నారు. "అట్లయితే నేను దీక్ష చేసి బాబాను అడుగుతాను. ఏ డాక్టరు దగ్గరకు తీసుకపొమ్మంటే అక్కడికి తీసుకపోతాను సార్" అన్నాను. అట్లా ప్రతి విషయానికి బాబాను పిలవకూడదు అన్నారు. బాబాను పిలచి చూడు, పలుకుతారు అని మీరే కదాసార్ చెప్పారు. ఇప్పుడు పిలవవద్దంటారేమిటి? అలాంటప్పుడు ఇక బాబాను పూజించడ మెందుకు సార్ అన్నాను. పిలచినప్పుడు బాబా పలుకుతాడు అనే నమ్మకం కలిగినంతవరకు పిలువవచ్చు. అలాంటి నమ్మకం కలిగాక ఇక పిలవకూడదు. మన ప్రయత్నం మనం చేస్తుంటే వారే మనలను సరైన డాక్టరు దగ్గరకు పోయేటట్లు చేస్తారు అన్నారు. వారి మాటలలోని లోతైన భావం నాకు బోధపడక తిక్క తిక్కగా చాలా బాధగా ఆలోచిస్తున్నాను. ఆ అనంత కరుణామయుడు నా బాధను గ్రహించి "మద్రాసుపోవద్దు - వాళ్ళమ్మను రోజూ పారాయణ చేయమను" అన్నారు. ఇక్కడ నా వక్రబుద్ధి పని చేయనీయకుండా శ్రీ మాష్టారే అడ్డుపడి నేను మాట్లాడ కుండా తలఊపేటట్లు చేశారు. లేకుంటే ఏ చరిత్ర పారాయణ చేయాలి. పూర్తిచేసి క్రతువేమి చేయాలి? అనారోగ్యమై పారాయణ నిలిచిపోవచ్చా అని అందరిలాగా అనేక చచ్చు పుచ్చు ప్రశ్నలు వేసేవాణ్ణే. అలా వేయకుండా ఆ మహనీయుడే వారి యోగశక్తితో నా నోరు కట్టేశారు. ఈ నాటికీ పారాయణ ఆగకుండా కనీసం ఒకటి రెండు పేజీలైనా చదువుతుంది. ఆమె చదవలేకుంటే నేనే చదివి ఆమెకు వినిపిస్తాను. ఇప్పుడు పిల్లవానికి ఏ వైద్యమూ లేకుండానే అన్ని ఇబ్బందులూ అనారోగ్యాలూ సర్దుకున్నాయి. చేతుల వణుకు పోయింది. జ్ఞాపకశక్తి పెరిగింది. ఒక్క చదువు మాత్రం రాలేదు. ఒక్కొక్క అక్షరం చదువుతాడు గానీ కలిపి చదవలేడు. ఇది రూపాయ ఇది ఐదు రూపాయల బిళ్ళ అలాగే నోట్లు, కానీ వరుసగా ఎంచలేడు.



ఇంత జరిగినా మరలా తప్పు చేశాను. మాష్టారు మద్రాసు వెళ్ళమన్నప్పుడు దీక్షచేసి ఏ డాక్టరు దగ్గరకు పోవలెనో బాబా చెపితే పోతాను అని నేనన్నప్పుడు శ్రీ మాష్టారు బాబాను అలా పిలవకూడదు అని చెప్పినా నేను వారి మాట ఖాతరు చేయకుండా షిరిడీ వెళ్ళి అక్కడ దీక్ష చేశాను. గొలగమూడిలో శ్రీ స్వామి వారి దగ్గర చేయలేదు. ఎందుకంటే శ్రీ స్వామి వారు తన ఆదేశాన్ని సంకేత రూపంలో చెపుతారు. ఆ సంకేతం మనకర్థం కాదు. సాయి అయితే మామూలు భాషలో చెపుతాడు అని తలచాను. ఎందుకంటే "శ్రీ స్వామి వారు చమురు లేకుండా కాల్చు అని నాకు స్వప్నాదేశమిచ్చారు. దాని అర్థం తెలియక చాలా తంటాలు పడ్డాను. ఒకసారి సాయినాధుడు - ఉప్పు, కారం తినకుండా ఉండగలవా? అని నా స్వప్నంలో అడిగారు. ఈ ఆదేశం బాగా అర్థమవుతుంది గదా? సాయి అయితే స్పష్టమైన భాషలో చెపుతారని షిరిడి వెళ్ళి దీక్ష చేస్తే వారు కూడా సంకేత రూపంలోనే సందేశమిచ్చారు. "శుశ్రూష జన్మిస్తుంది" అని ముమ్మారు పలికారు. అంటే ఓరి వెధవా అక్కడ ఇక్కడ కూడా నేనే పలికేది అని తెల్పారన్న మాట.

చూచారా నా వక్రబుద్ధి ఎలా పనిచేస్తుందో. ఈ పిల్లవాని భాద్యత నేను తీసుకుంటాను అని శ్రీ స్వామి వారు ఆశీర్వదించినా నేను ఆ మాటను పట్టించుకోకుండా మల్టీలాక్ మందు వేయబోతే ఎద్దుల కుమ్ములాట ద్వారా మందు వేయవద్దని సూచిస్తున్నా వినకుండా మందు వేశాను. అంతటితో ఆగక పారాయణ చేయమంటే - బాబాను పిలువ వద్దంటే దీక్ష చేసి పిలిచాను. అయితే ఆ కరుణామయుడు మాత్రం తన ఆశీర్వాదాన్నే నిజం చేసుకున్నారు. ఈ విధంగా మన స్వబుద్ధిని ఉపయోగిస్తాము కానీ వక్రించిన స్వబుద్ధిని మాని సద్గురువును సర్వస్య శరణుపొంది వారి ఆజ్ఞలను శ్రీ రోశిరెడ్డి లాగా నోరు విప్పి మారు ప్రశ్నించకుండా ఆచరించలేము. శ్రీ రోశిరెడ్డి గారు ఎప్పుడు ఒక మాట

చెప్పేవారు. "సుబ్బరామయ్యా స్వామి వారి దగ్గర నోరు విప్పితే బ్రష్టయిపోతావు జాగ్రత్త" అనే వారు. అదెట్లా తాత గారూ అంటే మనసులో ఇలా ప్రార్ధన చేయమన్నారు. "ఓ గురుదేవా నేను అజ్ఞానిని. మీ ఆదేశము అర్ధము చేసుకోలేని ధౌర్భాగ్యుడను. నాలో ప్రేరణ పెట్టి మీ ఆదేశాన్ని మీకు ప్రీతి పూర్వకంగా ఆచరించేటట్లు చేయండి ప్రభూ" అని మానసికంగా వేడుకోమన్నారు. ఈ ప్రార్ధన, ఈ ప్రవర్తన ఎన్ని జన్మలకు స్వతసిద్ధమౌతుందో గదా! ఈ ఒక్క ప్రార్ధన ఈ ఒక్క ఆచరణ నన్ను ఉద్ధరించగలదని నా నమ్మకము.

## శేషయ్యకు మల్టీలాక్ వేయవద్దని చెప్పడం

నా కుమారునికి చిన్నప్పుడు నరాల బలహీనత. గుండీలు పెట్టుకోలేడు. మంచినీళ్ళు గ్లాసు పట్టుకొని త్రాగలేడు. వేళ్ళు వణుకుతాయి. చదువు కూడా రావడంలేదు. మిగిలిన అన్నీ బాగానే ఉన్నాయి. టీచర్ గారికి వీడు నమ్మినబంటు. స్కూలు తాళాలు తీసేది వేసేది వీడే. అక్కడే కాదు గొలగమూడి పాఠశాలకొస్తే అక్కడా స్కూలు తాళాలు వీడికే ఇచ్చారు. స్కూలు మాని శ్రీ స్వామి వారి సమాధి మందిరంలో సేవ చేస్తుంటే కూడ మందిర తాళాలు వీడికే ఇచ్చారు. మానసికంగా కొంత ఎదుగుదలలేదు. ఎన్ని గ్రంధాలు చదివినా, ఎన్ని ఉపన్యాసాలు దంచినా మరెన్నో ఉపన్యాసాలు విన్నా సద్గురునికి తల తాకట్టు పెట్టడమంటే వారి ఆజ్ఞ శిరసావహించడంలో ప్రాణాన్ని కూడా లెక్క పెట్టకూడదనే ఆచరణ రానిదే సద్గురునికి తల తాకట్టు నిజంగా పెట్టలేదనే అర్ధం. ఒకప్పుడు నేను "ఈ పిల్లవాని బాధ్యత మీరు వహించండి స్వామీ" అని చీటీ వ్రాసుకుంటే వారు ఆశీర్వాద ముద్ర వేసి ప్రసాదించారు. నేనా మాట మీద ఉండలేకపోయాను. ఆనాడు వారు



ప్రసాదించిన చీటీకి, ఆమోదముద్రకు నేనేమీ విలువ నివ్వలేదని ఈనాడు తెలుస్తుంది.

శ్రీ స్వామి వారి నలభయ్యవరోజు ఆరాధనకు శ్రీ భరద్వాజ మాష్టరుగారు గొలగమూడి వచ్చారు. మా పిల్లవానికి మల్టీలాక్ బ్రాహ్మీతైలం హోమియో మందు ఒక్క బొట్టు నీటిలో వేసి పిల్లవాని చేత త్రాగించాలని, ఆ మందును శ్రీ మాష్టరుగారే గ్లాసుడు నీటిలో వేయబోతున్నారు. మేము ఆరుబయట కూర్చొనియున్నాము. దోవనపొయ్యే ఎద్దులు పోట్లేసుకొని మాపైకొచ్చాయి. అందరము ప్రక్కకు పరుగెత్తాము. శ్రీ మాష్టరు గారు కూడా మందు సీసా తీసుకొని ప్రక్కకొచ్చేశారు. ఎద్దులు వెళ్ళాక మరలా చాపల మీద కూర్చున్నాము. శ్రీ మాష్టారు గ్లాసులోని నీటిలో చీకరి పుల్లతో ఒక బొట్టు మందు వేయవలసి ఉంటే వేయకుండా అన్ని దిక్కులా పైకి చూస్తున్నారు. నాకు కాస్త బుద్ధి ఉంటే పలక్కుండా ఉంటే బాగుండును. సార్ మరలా ఎద్దులొస్తాయని తొందర చేశాను. వారేమీ మాట్లడకుండా మందు మాత్రం వేసి తాగించారు. కానీ మనమనుకున్నట్లు మానసిక ఎదుగుదల లేక క్రమంగా క్షీణించగా శారీరక మార్పులు బాగా వచ్చాయి. మీసాలు, చంకలలో వెంట్రుకలు ఒక నెల తిరగక ముందే ఎలా వచ్చాయా అని ఆశ్చర్యపోయాము. పిల్లవాని బాధ్యత శ్రీ స్వామి వారు తానే వహిస్తానని ఆశీర్వదించాక ఇక ఆ మాటకు తిరుగులేదు. నేను అజ్ఞానంతో మందు ఇప్పిస్తుంటే ఆ కరుణామయుడు విశ్వచైతన్యం గనుక ఆ ఎద్దుల పోట్లాట ద్వారా మందు వేయవద్దని చెపుతున్నారు. శ్రీ మాష్టారు మందు వేయకుండా చూస్తున్నారు. ఆశాబద్ధుడనైన నేను శ్రీ మాష్టారిని తొందరించడంతో మందు వేశారు. కానీ అనుకున్న ఫలితం రాలేదు. మానసిక ఎదుగుదలకు బదులు శారీరక ఎదుగుదల వచ్చింది. ఆరోగ్య సంబంధంగా ఇంకేదైనా ఇబ్బంది కల్గి ఉంటే చాలా బాధగా ఉండేది. అది మొదలు ఏ వైద్యము చేయించడం లేదు.

సత్య పారాయణే అతనికి మందు. క్రమంగా అన్నీ సర్దుకున్నాయి. డబ్బు లెక్క తప్పితే అన్నీ బాగున్నాయి. సత్య సంధుడైన శ్రీ స్వామి వారి మాట అబద్ధమెలా అవుతుంది. అజ్ఞానం అనే కటిక చీకటిలో నున్న నాకు శ్రీ స్వామి వారి నిజస్థితిని తెలుసుకునే జ్ఞానం ఎన్ని జన్మలకైనా వస్తుందా? రాదు, రాదు రానే రాదు.

## రస్కు బిస్కెట్లలో నూనె ఉందని చూపడం

హెడ్మాష్టరు పరీక్ష వ్రాయడానికి కడపకు వెళ్ళాను. వీధిలో అటు ఇటూ చూస్తూ వస్తున్నాను. 5 × 4 అడుగుల వైశాల్యం గల నాపరాయిపై పాతిక బస్తా గోధుమ పిండి పోగు పోసి మధ్యలో గుంట చేసి ఒక డబ్బాతో ఏదో పోస్తున్నాడు. నా దృష్టి ఆ వ్యక్తి మీద పడి అక్కడకు వెళ్ళి - ఏమిటి ఆ పిండిలో పోస్తున్నావని అడిగితే - ఆ డబ్బా లేబిల్ చూపాడు. అది డాల్డా. దీనితో ఏమి చేస్తారని అడిగితే బేకరీ అంతా తన చేతి సైగతో చూపాడు. ఈ ఒక్క పిండితో అన్ని రకాల బిస్కెట్లు, కేకులు ఎలా వస్తాయంటే - ఈ పిండికి ఏది కావాలంటే ఆ ఎసన్సు కలుపుతామన్నాడు. డాల్డా లేకుండా రస్కులు చేసి ఇవ్వమన్నాను. డాల్డా లేకుండా చేస్తే నమలలేము సరికదా రాయితో కొడితే కూడా పగలనంత గట్టిగా ఉంటాయన్నాడు. రస్కులో ఇంకేమి వేస్తారంటే కొంత ఉప్పు చెక్కర వేస్తామన్నాడు.

ఈ విషయాన్ని నేను మామూలుగా రస్కు కొనే బేకరీలో అడిగితే కూడా అలాగే చెప్పాడు. అది మొదలు రస్కు, మిల్క్‌బ్రెడ్ బిస్కెట్లు తినడం మానేశాను. శెనగముద్దలు తినడం మానేశాను. సర్వ సమర్ధుడైన శ్రీ స్వామి వారు ఆ గోధుమ పిండి కలపడం చూపకుంటే ఇంకెన్ని



సంవత్సరాలు ఆ నూనెతో చేసిన రస్కు తింటూ బాధపడుతూ ఉండేవాడినో గదా!

## సైకిల్‌కు 19 పంచర్లు

శ్రీ స్వామి వారి చరిత్ర ప్రథమంగా ప్రింట్ చేయ బోతున్నాము. శ్రీ భరద్వాజ మాష్టర్ గారు ఒంగోలులో ఉన్నారు. శ్రీ స్వామి వారి చరిత్ర విషయసేకరణ చేసి పేపర్సు వారికిచ్చి ఎడిట్ చేయమని అర్ధించాను. పని వత్తిడి వల్ల, వారు ఒక్క పేపరు కూడా చూడలేదు. ఆరాధన ఇక మూడు నెలలే ఉంది. పాతరోజులలో కంపోజింగ్ అని అక్షరాలు కూర్చాలి. ఇప్పటి వలె కంప్యూటర్ టైప్ సెట్టింగ్ లేదు. "సార్ ప్రతిరోజు నేను వస్తాను, నాకు ఒక్కగంట టైం కేటాయించండి" అని ప్రార్ధించాను. అట్లాగే నన్నారు. సీజన్ టిక్కెట్టు కొని ప్రతి రోజు స్కూలు పని చూచుకొని కలిచేడునుండి నెల్లూరు వచ్చి (బస్సు) అక్కడనుండి రైలులో సాయంత్రం 6½ గంటలకు బయలుదేరి ఒంగోలుకు రాత్రి 9½ గంటలకు చేరేవాణ్ణి. అప్పుడు శ్రీ మాష్టరు గారు సంతపేటలో ఉండేవారు. రాత్రి 12 గంటల వరకు పుస్తకం ఎడిటింగ్ చేసి తిరిగి రైలులో మెయిల్ లో నెల్లూరు వచ్చేసరికి రాత్రి 2 గంటలు అయ్యేది. నెల్లూరు నుండి సైకిల్ మీద గొలగమూడి వచ్చేసరికి 3½ గంటలు 4 గంటలు అయ్యేది. గాఢాంధకారమైన చీకటి, రోడ్డు సరిలేదు. టార్చిలైటు లేదు. మరలా తెల్లవారి 6 గంటలకు సైకిలెక్కితేనే కలిచేడు బస్సు అందుతుంది. ఏ మాత్రం ఆలస్యమైనా బస్సు వెళ్ళిపోయినా మరొక బస్సులో పోతే స్కూలుకు లేటుగా పోవాలి. ఇలా మూడు నెలలు తిరిగాను. ఏ రోజు కూడా సైకిల్ పంక్చర్ లేదు. పంక్చరైతే ఇక ఆ పూట సెలవు పెట్టవలసిందే. అలాంటి పరిస్థితి కలుగనేలేదు. ఆరాధనకు పుస్తకాలు

ప్రింటయి వచ్చాయి. ఆరాధన తెల్లవారి సైకిల్ పంక్చరు. పంక్చర్ వేయమని షాపులో సైకిలిస్తే పందొమ్మిది ముల్లులు గుచ్చుకొని ఉన్నాయి. 19 ముల్లులు ఉన్నా పని అయినంతవరకు గాలి తగ్గకుండా ఉండడమే శ్రీ స్వామి వారి దివ్యలీల.

## అవధూత లీల గ్రంధమునకు ఒకరిని ప్రేరేపించి ధనమిప్పించుట

శ్రీ స్వామి వారి హ్యూమానిటేరియన్ మిషన్ను కోర్టుకు లాగాడు ఒక పుణ్యాత్ముడు. అతడు ముప్పైవేల నష్టంతో ఓడిపోయాడు. ఆ సమయంలో రెండు సంవత్సరములకు పైన శ్రీ స్వామి వారి జీవిత చరిత్ర గ్రంధాలే లేవు. అందరూ నన్నే అడుగుతారు. అరవై వేల రూపాయలు లేనిదే పుస్తకం ప్రింట్ కాదు. నా కుమార్తె పెండ్లి ఉంది. ఉన్న డబ్బు పుస్తకానికి పెడితే పెండ్లికి డబ్బెక్కడతేవాలని నేను నిర్లిప్తంగా ఉన్నాను. ఓంగోలులో ఒక వ్యక్తి శ్రీ స్వామి వారికి పదివేల రూపాయలు మొక్కుబడి డబ్బు బాకీ అట. కానీ ఆ డబ్బు హుండీలో వేస్తే అది కోర్టు ఖర్చులకు పోతుందని వారా డబ్బు హుండీలో వేయలేదు. పుస్తక ప్రింటింగుకు వాడమని నా చేతికివ్వాలనుకున్నారట. కానీ పదివేల రూపాయలు ఒక ప్రయివేటు పర్సన్ చేతికివ్వడం ఇష్టంలేక ఆ డబ్బు ఇంటికి తీసుక పోయాడు. అక్కడ కూడా నాకే ఇమ్మని ఆత్మ చెపుతుంది. రెండవసారి హుండీలో వేయాలని వచ్చాడు. కానీ చేతులాడలేదట తిరిగి ఇంటికి వెళ్ళి పటాలముందు కూర్చుంటే ఈ ఆలోచనే మనసులో మెదులుతుందట. ఏమిటి స్వామీ ఈ టెన్షన్ అనుకుంటుంటే పటంలో శ్రీ స్వామి వారి వెనుక నేను స్పష్టంగా కనబడుతున్నానట. ఇక తట్టుకోలేక గొలగమూడి వచ్చి ఆ కట్ట నా చేతిలో పెడుతూ పుస్తక ప్రచురణకు



వాడమన్నాడు. ఎంత అని అడిగితే పదివేల రూపాయలు. పుస్తకం ప్రింట్ కావాలంటే అరవై వేల రూపాయలు కావాలి. నాకు మిగతా డబ్బు సమకూడకుంటే మీ డబ్బు వాపస్ చేస్తానని చెప్పి తీసుకున్నాను.

అంతా శ్రీ స్వామి వారు చేస్తుంటే మనం చేస్తున్నామని భ్రమించడం ఎంత గొప్ప అహంకారమో చూడండి. అదే రోజో లేక తెల్లవారో మరొక భక్తుడొచ్చి "మీరుండి కూడా పుస్తకాలు లేకుండా చేశారే" అన్నాడు. అయ్యా పుస్తకాలు కావాలంటే యాభైవేల రూపాయలు కావాలి ఇస్తావా? అన్నాను. ఇస్తే పుస్తకం వేయిస్తారా అన్నాడు. నాకేమి డొనేషన్‌గా వద్దు. పుస్తకాలు అమ్ముతుంటే ఎప్పటి డబ్బులు అప్పుడు ఇచ్చేస్తాను. వీలుంటే చూడండి అని చెప్పాను. ఆయన ఇంటికి వెళ్ళి పదివేల రూపాయల D.D. పంపాడు. తన స్నేహితులకు చెప్పి మిగిలిన నలభైవేలు ఇప్పించారు. వెంటనే ఒక నెలలో పుస్తకం వచ్చింది. వారి డబ్బు పుస్తకాలు అమ్మగానే ఇచ్చేశాను.

శ్రీ స్వామి వారి కార్యంలో దగా చేసిన వారికి ఎంతటి నష్టం వాటిల్లుతుందో చూడండి. ఆఫ్‌సెట్ ప్రింటింగులో ఇచ్చాను. ప్రింటింగులో మాష్టర్ అనే ఒక రూపాయి ప్లాస్టిక్ పేపరు, 15 రూపాయలు విలువ చేసే ఫిల్మ్ ఉంటుందని నాకు తెలియదు. ఈ ప్రెస్ అతను ఫిల్ముల ఖరీదు తీసుకొని మాష్టర్ మీద ప్రింట్‌చేశాడు. అగ్రిమెంట్‌లో ఆ విషయమేమీ వ్రాయలేదు. 1/8 డెమ్మి సైజు, ఆంధ్రా పేపరు, 300 పేజీలు లామినేషన్ లేకుండా మల్టీ కలర్ అట్ట అని వ్రాశారు. పుస్తకాలు ప్రింట్ అయ్యాక అనేక పుస్తకాలలో ప్రింట్‌లేని పేజీలు అనేకమొచ్చాయి. ఆ పుస్తకాలు రెండు వందల పుస్తకాలు వాపస్ చేసి సరిగా ప్రింట్ చేయమంటే పదిమార్లు తిప్పుకొని మీరిచ్చింది వందపుస్తకాలే అన్నాడు. చాలా గొప్పవాడనుకొని వచ్చేశాను. మరలా పుస్తకాలు అయిపోయాక మరొక

ప్రెస్‌లో పుస్తకమిస్తే - వాళ్ళు చెప్పారు - మీరు ఫిల్ములు తెచ్చిస్తే నాలుగువేల ఐదువందల రూపాయలు తగ్గుతుంది, వెళ్ళి అడగమన్నారు. మొదటి ప్రెస్ వాడిని అడిగితే మేము ఫిల్ముల మీద వేయలేదు. మాష్టర్ అనే ప్లాస్టిక్ పేపరు మీద వేశాము. ఫిల్ములమీద వేస్తామని మీకు అగ్రిమెంట్ ఇవ్వలేదు అన్నాడు. ఇక చేసేది లేక తిరిగి ఫిల్ములు తీసాము.

అతడు చేసిన దగాకు కొన్నాళ్ళపాటు అనేక కారణములుగా ప్రెస్ మూత పడింది. శ్రీ స్వామి వారేమీ శపించరు. వాళ్ళు చేసిన పాపమే వారిని శిక్షిస్తుంది. అది మొదలు అన్ని విషయాలు అగ్రిమెంటులో వ్రాసుకొంటేనే ప్రింట్ చేయిస్తున్నాను. ఫిల్ములు వాపస్ చేస్తాము అనే మాట కూడా వ్రాయిస్తున్నాను. సర్వసమర్థుడైన శ్రీ స్వామి వారి చేయూత ఉంటే ఎంతటి పనైనా సునాయాసంగా అవుతుంది.

## సైకిల్ షాపు రాత్రి 2 గంటల వరకు తెరచి ఉండడం

ఏదైనా ఒక అనుభవం జరిగితే అలా జరుగడం శ్రీ స్వామి వారి కృపయని తలస్తే వారికి కృతజ్ఞతతో ఉంటాము. అది మామూలుగా జరిగిందనుకొంటే మనం చేసిన మేలు మరచిపోయిన వారమవుతాము. ఈ అనుభవం చిన్నదే కానీ శ్రీ స్వామి వారు ఏమారకుండా అనుక్షణమూ నన్ను కాపాడుతున్నారు అనేది నిరంతరమూ గుర్తుంచుకుంటే మనం వారికి దగ్గరౌతాము.

ఒకరోజు నేను ఒంగోలు నుండి రైలులో దిగి రాత్రి 2 గంటల ప్రాంతంలో నా సైకిల్ తీసుకుంటే దానికి గాలిలేదు. కొత్తహాలు సెంటర్‌లో రిక్షాలకు గాలి కొట్టే పంపు అతను ఉంటాడు. అక్కడికి పోతే



ఆ పంపుతను లేడు. అక్కడ తప్పితే V.R.కాలేజీ సెంటర్‌లో అలాంటి పంపు ఉంటుంది. అక్కడికి పోతే అతనూ లేడు. ఇప్పుడు సైకిల్ ఎక్కడ పెట్టాలి? నడిచైనా గొలగమూడి పోవాలని నిర్ణయించుకున్నాను. సైకిల్ నడిపించుకొని వస్తున్నాను. నెహ్రూగేట్ దగ్గరకు రావాలంటే ఒకటి షార్ట్‌కట్ మార్గము, రెండవది కాస్త దూరమైన రాజమార్గము. నేను ఆలోచనలో ఉండి షార్ట్‌కట్ మార్గాన పోవలసిన నేను రాజ మార్గాన వస్తున్నాను. షార్ట్‌కట్ మార్గము గుర్తొచ్చికూడా తిరిగి ఆ మార్గాన పోలేక రాజమార్గాన్నే పోతున్నాను. కొద్ది దూరం పోగానే ఒక సైకిల్ షాపు పని చేస్తుంది. గాలి కొట్టిచ్చుకొని ఆ పిల్లవాడిని ఈ టైంలో షాపెందుకు తీసి ఉంచారని అడిగాను - ఒక రిపేరు పేచీ పెట్టింది. అది పూర్తికాకుండా ఇంటికి పోకూడదని చేసే సరికి ఈ టైం అయింది. ఈలోగా మీరొచ్చారు అని చెప్పాడు.

నా సైకిలుకు గాలి పోతే రాత్రి వేళ నెల్లూరులో ఉండిపోవచ్చు. కానీ నడిచైనా శ్రీ స్వామి చెంతకు వెళ్ళాకనే నిద్ర పోవాలనే పట్టుదలతో నడుస్తున్నాను. గనుకనే నన్ను షార్టుకట్ మార్గాన పోకుండా మతిమరుపు పెట్టి రాజమార్గాన నడిపించి సైకిల్ పంపు దొరికేచోటుకి తీసుకెళ్ళారు. గాలి కొట్టాక సుఖంగా గొలగమూడి చేరి శ్రీ స్వామి వారి సన్నిధిలో నిద్రపోయాను. మనం ఏమారిన సమయంలో కూడా వారిని ప్రార్థించకపోయినా మనలను ఆపదల నుండి రక్షించే కరుణామయుడు శ్రీ స్వామి.

## అరటిపండ్ల విషయంలో శ్రీ స్వామి వారు హెచ్చరించుట

1983, 84 సంవత్సరాలలో గొలగమూడిలో ఒక్క బంకు లేదు. నాకు ప్రతీరోజూ అరటి పండ్లు కావాలి. వేసవి సెలవులలో స్కూలుకు

పోను గనుక అరటిపండ్లు దొరకవు. శ్రీ స్వామివారికి డజన్లు, డజన్లు భక్తులు తెచ్చి సమర్పిస్తుంటారు. నాగయ్యా గారికి చెప్పి ప్రతిరోజు మూడు అరటి పండ్లు తీసుకపోయి మరలా నెల్లూరుకు పోయినప్పుడు తెచ్చి శ్రీ స్వామి వారికి బదులు ఇచ్చేసేవాడిని. ఒకసారి అలా తీసుకపోవడం మంచిది కాదని అనిపించింది. నేను ప్రతిరోజు మందిరం నుండి తీసుకపోవడం అందరూ చూస్తుంటారు. కానీ నేను తిరిగి తెచ్చి ఇచ్చినప్పుడు తీసుకపోయిన పండ్లు మరలా తెచ్చి ఇస్తున్నాడని వారికి తెలియదు గదా. మనమెన్ని ఇచ్చినా శ్రీ స్వామి వారికి నివేదిస్తున్నామని అనుకుంటారే గానీ బదులు ఇస్తున్నాడని వారికి తెలియదు. ఈ విషయం ఎక్కడో కొందరు చర్చించుకొని ఉంటారు. గనుకనే నాకు ఈ విషయంలో తీసుకపొమ్మంటారా? వద్దంటారా అని శ్రీ స్వామి వారి దగ్గర చీట్లు వేయాలనిపించింది. (1) మందిరంలో నుండి అరటి పండ్లు బదులు తీసుకపొమ్మని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. (2) మందిరంలో నుండి అరటి పండ్లు బదులు తీసుకపోవద్దని శ్రీ స్వామి వారి ఆజ్ఞ అని రెండు చీట్లు వేస్తే తీసుకపోవద్దనే చీటీ వచ్చింది. అది మొదలు ఏ వస్తువూ మందిరం నుండి బదులుతీసుకపోవడం లేదు. తన సేవకులపై ఏ కొద్దిపాటి నిందారోపణ రావడం కూడా శ్రీ స్వామి వారు సహించరు.

## కాలిలో గాజు పెంకు గుచ్చుకోవడం

నేను ఎక్కడికైనా వెళ్ళాలని ప్రయాణమయ్యేటప్పుడు నా చేతిలోని ఏ వస్తువు జారి క్రిందపడ్డా నన్ను పోవద్దని శ్రీ స్వామి వారి ఆదేశమని తలంచేవాడిని. కానీ నా ఆశ నన్నాభావనలో నిలువకుండా చేసేది. ఇట్లాకాదని ఇంటిలో ఇలా వస్తువు జారి పడింది. ఏమవుతుందో చూడాలని వ్రాసిపెట్టి వెళ్ళాను.



నెల్లూరు కలెక్టరు ఆఫీసుకు ఎదురుగా రాజవీధి చాలా రద్దీగా ఉంటుంది. ఆ రోజు సైకిల్ మీద ఆ వీధిలో పోతున్నాను. ఎదురుగా ఆటో, మోటార్ సైకిల్ వస్తున్నాయి. వీధి చాలా ఇరుకు. సైకిల్ దిగేశాను. ఆ దిగడంలో నా కాలు ప్రక్కనున్న చవిటి కాలవలో పడింది. కాలికున్న చెప్పు జారి ప్రక్కన పడింది. రోడ్డులో ట్రాఫిక్ తగ్గాక తిరిగి చెప్పు వేసుకొని సైకిల్ ఎక్కాను. నా వెనుక వచ్చే వాళ్ళు రక్తం, రక్తం అని అరుస్తున్నారు. నా కాలి నుండి కారుతుందని నాకసలు తెలియడం లేదు. ఓ సైకిలాయనా నీ కాలు నుండే రక్తం కారుతుందని అరిచారు. సైకిల్ దిగి చూస్తే నిజమే. నా కాలు చవిటి కాలువలో పడినప్పుడు ఆ కాలువలో ఉన్న గాజు పెంకు బాగా తెగింది. చేతి గుడ్డతో కట్టు కట్టి ఆస్పత్రికి వెళ్ళి కట్టు కట్టించుకున్నాను. ATS ఇంజక్షను వేయించుకొని గాయం మానే వరకు కాలు కదిలించలేక పోయాను. ఆ గాయంతో పోయింది, చాలా సంతోషం. చవిటి కాలువలో పడి కాలు విరిగినా దిక్కులేదు. తన ఆజ్ఞను దిక్కరించి నందుకు బాగా బుద్ధి చెప్పారు.

## కాలిలో కంకర రాయి గుచ్చుకోవడం

ఆశ ఎంత నీచమైనదో చెప్పలేను. కొన్నాళ్ళ తర్వాత మరలా నెల్లూరు పోతుంటే వస్తువు జారి క్రింద పడింది. ఈ దఫా ఏమౌతుందో చూడాలని మరలా ఇంట్లో వ్రాసిపెట్టి వెళ్ళాను. శ్రీ స్వామి వారికి నా పైన ఎంత దయో చెప్పలేను. నేనెంత మూర్ఖంగా ప్రవర్తించినా నన్ను రక్షిస్తూనే ఉన్నారు.

నెల్లూరు పత్తేఖాన్ పేట దగ్గర పీతిరి కాలువ అనే బ్రిడ్జి ఉంది. అక్కడ నుండి టెక్కేమిట్ట అనే చీలు రోడ్డు పోతుంది. మెయిన్ రోడ్డులోనుండి టెక్కేమిట్ట రోడ్డు చాలా డౌన్‌గా దిగుతుంది. నేను సైకిల్

మీద ఆ డౌన్‌లో పోతున్నాను. నా ఎదురుగా పాలకేనులు తగిలించుకొని ఒక సైకిల్ అతను వస్తూ నా సైకిల్‌ను గుద్దేసి తాను మాత్రం తప్పించుకొని వెళ్ళాడు. నా సైకిల్ బ్యాలన్సు తప్పి క్రింద పడింది. ఆ పడడంలో నాకాలి చెప్పు ఊడి పోయి ప్రక్కన పడింది. నా కాలి క్రింద కూచిగా ఉన్న కంకర రాయి దిగబడి రక్తం కారుతుంది. అదే సమయంలో నా వెనుక నుండి వచ్చే ఇసుక బండి చక్రం నా సైకిల్ ముందు చక్రంపై ఎక్కిపోయింది. బండి నిలపాలన్నా వీలయ్యే దూకుడు కాదది. సైకిల్ ముందు చక్రం ఫోర్క్ పూర్తిగా బెండ్, కాలికి రక్తం గాయం. పది రోజులు పూర్తిగా కాలు వాచిపోయి పడక మీద నుండి కదలలేక పోయాను. అదే బండి నా కాలు మీద ఎక్కి ఉంటే ఇక జీవితాంతమూ కుంటి బ్రతుకే అయ్యేది. అది మొదలు ఏ వస్తువు జారి క్రింద పడినా ఆ రోజుకు ప్రయాణం మానుకోవడమే చేస్తున్నాను. శ్రీ స్వామి వారు నాకు బాగా బుద్ధి వచ్చేటట్లు చేశారు.

## శ్రీ స్వామి వారి చరిత్రను ఇంగ్లీషులో ప్రచురించడం

శ్రీ స్వామి వారి చరిత్రను ఇంగ్లీషులో ప్రచురించాలని నేనెంత తహతహలాడినా ఎవ్వరూ ముందుకు వచ్చి వ్రాయలేదు. గొప్ప గొప్ప I.A.S. ఆఫీసర్లు, ఇంగ్లీషు లెక్చరర్లు, ఇంగ్లీషులో M.A. పాసయిన సాధకులు ఎందరినో అడిగాను. అందరూ సరేనంటారే కానీ ఒక్క అక్షరం వ్రాయరు. పూజ్యపాదులు శ్రీ E.భరద్వాజ మాష్టారుగారు ఉంటే పది రోజులలో వ్రాసేసి ఉండేవారు. నా ఆతృత పట్టలేక స్వామి కృప అనే తెలుగు 32 పేజీల పుస్తకాన్ని నేనే ఇంగ్లీషులోకి అనువదించాను. నేను బి.యస్‌సి. అయినా ఇంగ్లీషు పుస్తకాలతో పరిచయంలేదు గనుక ఆ పుస్తకం చివర "నాకు ఇంగ్లీషు భాషపై కమాండు లేదు గనుక ఈ పుస్తకంలోని సారాన్ని గ్రహించి తప్పులు మన్నించమని వ్రాశాను".



ఒక బాంబే నిరుద్యోగికి ఈ పుస్తకం మద్రాసులో దొరికిందట, అది చదవగానే శ్రీ స్వామి వారిని ఏమని ప్రార్థించాడో గానీ అతనికి ఉద్యోగం దొరికింది. అతడు వెయ్యి రూపాయలు మని ఆర్డర్ పంపుతూ "మీరు ఈ చిన్న పుస్తకాన్ని చక్కగానే వ్రాశారు. దయచేసి పెద్దపుస్తకాన్ని కూడా మీరే అనువదించండి. దయచేసి ఈ వెయ్యి రూపాయలు పుస్తక ప్రచురణకు వాడండి. తిప్పి పంపవద్దు అని వ్రాశాడు. రెండేళ్ళు ఎదురుచూచినా ఎవ్వరూ ముందుకు రాలేదు. నాకేదో పూనకం వచ్చినట్లు నేనే చాతనైనట్లు వ్రాయాలని పూనుకున్నాను. కొన్ని తెలుగు పదాలకు ఇంగ్లీషు పదాలు తెలియడం లేదు. తెలుగు పదాలకు ఇంగ్లీషు ఉండే డిక్షనరీ తెప్పించాను. మనకు కావలసిన పదం వెదకడమే కష్టంగా ఉంది. కానీ శ్రీ స్వామి వారి దయ సంకల్పమో ఏమోగానీ నాకే పదం కావాలో ఆ పదం దగ్గరే డిక్షనరీ ఓపెన్ అయ్యేది. అలా భాషాజ్ఞానం లేని నా చేత ఆ కరుణామయుడు తర్జుమా చేయించారు. ప్రస్తుతం జపాను భాషలోకి కూడా అనువదించడం జరిగి ప్రింట్ అయింది.

## ఇంగ్లీషు పుస్తకం రెండవ - ముద్రణ శ్రీ స్వామి వారే వేయించారు

మొదటి ముద్రణ పుస్తకాలన్నీ అయిపోయాయి. మరలా రెండవ ముద్రణ వేయించాలంటే నలభై వేల రూపాయలు - వెయ్యి కాపీలకు ఖర్చు. ఇది నా వల్ల అయ్యే పని కాదని నిర్లిప్తంగా ఉన్నాను. చిన్నప్పుడు నా దగ్గర చదువుకున్న విద్యార్థి పెద్ద ఇంజనీరై గుజరాత్‌లో పనిచేస్తున్నాడు. నిజాయితీకి పెట్టినపేరు. ఒక్క పైసా లంచం తీసుకోడు. యురేనియం నుండి కరెంటు తీసే ప్లాంటులో పని చేస్తున్నాడు. అదే ప్లాంటులో ఒక

కాంట్రాక్టరుకు ఆ ప్లాంటు వారు ఏడు లక్షలు బాకీ అట. అతడు అప్పు తెచ్చి పని పూర్తి చేశాడు. పని పూర్తయి కొన్ని నెలలైనా వాళ్ళు డబ్బు ఇవ్వరు. అతడు నిత్యం ఆఫీసు చుట్టూ తిరుగు తున్నాడు. ప్రతిరోజు నా పాత విధ్యార్థియైన ఇంజనీరుకు నమస్కారం చేసేవాడు. కొన్నాళ్ళుగా కనిపించడం లేదు. అతడు ఈ మధ్య రావడంలేదేమని అడిగాడు. సార్ అతడు అప్పు తెచ్చి పని పూర్తి చేశాడు. మనవారు నెలలు గడచి పోతున్నా డబ్బివ్వలేదు. అప్పులవాళ్ళ మాటలు పడలేక బి.పి. పెరిగి మంచాన పడ్డాడు. త్వరలో మరణించవచ్చని చెప్పారు. ఆ కాగితాలు ఎవరి దగ్గర పెండింగో కనుక్కొని ఈ ఇంజనీరు "అతనికి సాయంకాలానికి డబ్బు ఇవ్వాలి. లేకుంటే అతడు చనిపోయాక మనం డబ్బు ఎవరికి ఇస్తాము. అతని చావుకు మనం భాద్యులమవుతాము" అని రేపు వచ్చి డబ్బు తీసుకపొమ్మని అతనికి ఫోన్ చేశాడు. అతని జబ్బంతా గాలికి ఎగిరి పోయింది. తెల్లవారి ఏడు లక్షలు ఇచ్చేశారు. ఇంత త్వరగా డబ్బు వచ్చేందుకు ఆ ఇంజనీరే కారణమని అందరూ అతనికి చెప్పారు. నా ప్రాణం కాపాడారు, మీరేదైనా తీసుకోక తప్పదంటాడు. ఇతడేమీ తీసుకొనేవాడు కాదు. అతనికి శ్రీ స్వామికృప పబ్లికేషన్స్ అడ్రసిచ్చి వాళ్ళకేదైనా పుస్తకం ప్రింట్ చేసి ఇవ్వమన్నాడు. ఆ కంట్రాక్టరుకు నేను అవధూత లీల ఇంగ్లీషు వేయించమన్నాను. అతడు మూడు భాగాల ఖర్చు పెట్టుకున్నాడు. మిగిలినది నేనిచ్చాను. అతడే వెయ్యి కాపీలు ప్రింట్ చేసి పంపాడు. ప్రస్తుతం ఆ కాపీలన్నీ ఉచితంగా పంచుతున్నాము. శ్రీ స్వామి వారే ఆయా వ్యక్తులను ప్రేరేపించి పుస్తకాలు ఉచితంగా ప్రింట్ చేయించారు. మనం వాటిని అమ్ముకుంటే మనం శ్రీ స్వామి వారి కృప కోల్పోవడం ఖాయం గదా! అందుకే వారికి కృతజ్ఞతాభివందనాలు.



# తొగురు వెంకయ్యగారి ద్వారా హైదరాబాద్ నుండి స్వామికృప పుస్తకాల డబ్బు తెప్పించుట

నెల్లూరులో 32 పేజీల పుస్తకం 1 రూపాయికి ప్రింటు చేసి ఇస్తున్నవాళ్ళు 1.50 పైగా రేటు పెంచారు. హైదరాబాద్‌లో కంప్యూటర్ ప్రింటింగులో ధర తగ్గుతుందని ఆశ వలన డా|| టి.వి. శేషగిరిరావు గారి చేత 5,000.00 (ఐదు వేల రూపాయలు) ఇచ్చి హైదరాబాద్‌లో కంప్యూటర్‌లో వేయించ మన్నాను. వారు ఆ పైకం వారి బావగారికిచ్చి బావగారి ఇంటి సమీపంలో ఉండే ప్రెస్‌లో వేయించమన్నారు. అతడు ప్రెస్ క్రొత్తగా పెట్టాడు. పని రావడం లేదు. నిత్యం కూలైనా గిట్టు తుందని పుస్తకం ఒక్క రూపాయకే ప్రింట్ చేసి ఇస్తానని కాగితం కొనేందుకు అడ్వాన్సుగా ఐదువేలు అడిగాడు. పుస్తకాలు ఒక నెలకు ఇస్తానని ఆడబ్బంతా తినేసి ఆరు నెలలైనా ప్రింట్ చేయలేదు. నేనెన్ని జాబులు వ్రాసినా రిప్లయి రాదు. ఆ డబ్బు ఇకరాదు. వారికి నేనెప్పుడో బాకీ గనుక ఇలా జరిగిందని ముగించుకున్నాను. శ్రీ స్వామి వారి ఆరాధన ఇక పదిహేను రోజులుంది. బిట్రగుంట - బోగోల్లు గ్రామస్తుడు తొగురు వెంకయ్యగారు వచ్చి పుస్తకాలు కావాలన్నాడు, విషయం చెప్పాను. నాకు రైల్వే పాస్ ఉంది. మీరేమీ డబ్బు ఇవ్వనక్కరలేదు, ఒక లెటరు వ్రాసి ఇవ్వండి, పుస్తకాలు గానీ డబ్బు గానీ తీసుకొస్తానన్నాడు. డా|| టి.వి.శేషగిరిరావు గారికి మరియు వాళ్ళ బావ రామకృష్ణ గారికి లెటర్లు వ్రాసి పంపాను. తొగురు వెంకయ్య రామకృష్ణ గారితో మాట్లాడేటప్పుడు కరెంటు హెల్పర్ వాళ్ళ కరెంటు రీడింగు తీసుకునేందుకు వచ్చాడు. రీడింగు తీసుకుంటూ వీరి సంభాషణ విని - ప్రక్క ప్రెస్ అతనేనా మీకు ఐదు వేలు ఇవ్వవలసినది, నాతో రండి నేను ఇప్పిస్తానని వాళ్ళను తీసుకొని వెళ్ళాడు. అదే సమయంలో ప్రెస్ అతను ఉన్నాడు. ఏమయ్యా వీళ్ళకు నీవు ఐదు వేలు ఇవ్వాలట. ఆరు నెలలైందట నిజమేనా

అని అడిగాడు. అవునండి ఇంకొక్క వారంలో పుస్తకాలు ప్రింట్ చేసి ఇస్తానన్నాడు.

ఆరు నెలల నుండి ఇవ్వని వాడివి వారం రోజులలో ఇచ్చేది నిజం లేదు. నీ ప్రెస్‌కు కరెంటు పీకేస్తున్నాను. కరెంటు కావాలంటే ఐదు వేలు ఇప్పుడే కట్టెయ్ అని దబాయించాడు. అతడు కాళ్ళ వేళ్ళ బడి బ్రతిమిలాడి రేపు ఉదయం ఎనిమిది గంటలకు కట్టకుంటే అలాగే కరెంటు తీసెయ్యండి. ఈ కాస్త టైం ఇవ్వండని బ్రతిమాలాడు. నేను సరిగా ఎనిమిది గంటలకే వస్తాను. నీవు డబ్బు ఇవ్వకుంటే కరెంటు తీసేసిపోవడం ఖాయమని వార్నింగ్ గట్టిగా ఇచ్చి వెళ్ళాడు. తెల్లవారి ఏడున్నర గంటలకే డబ్బు తెచ్చి పెట్టుకొని ఎదురు చూస్తున్నాడు. వీళ్ళు పోగానే గుట్టుగా ఐదు వేలు చేతిలో పెట్టాడు. ఆ కరెంటు డిపార్టుమెంటు అతను కలుగజేసుకోకుంటే ఇంక ఆరు నెలలైనా మనకు డబ్బురాదు.

శ్రీ స్వామి వారు సర్వప్రేరణాధికారి గదా. రామకృష్ణ గారు, తొగురు వెంకయ్య గారూ ఈ విషయం మాట్లాడు కునేటప్పుడే ఆ కరెంటు వారు రావడమేమిటి, వచ్చాడే అనుకోండి. కరెంటు రీడింగ్ తీసుకొని వెళ్ళవచ్చు గదా. వీళ్ళ సంభాషణ విని తనకై తానే డబ్బిప్పిస్తాను రమ్మనడమేమిటి, వీళ్ళు పోయే సమయానికి ప్రెస్ అతను లేకుంటే గూడా కష్టమే. ఆ సమయానికి అతడు ప్రెస్‌లో ఉండడమేమిటి, కరెంటు తీసేస్తానంటే భయపడిపోయి తెల్లవారికంతా తన ప్రాణం తాకట్టు పెట్టి అయిదు వేలు తెచ్చి ఇచ్చాడు. ఆ డబ్బు రాగానే ఆరాధనకు పుస్తకాలు నెల్లూరులోనే వేయించాము. శ్రీ స్వామి వారు చేయించాలంటే ఎవరేమి అడ్డాలు పెట్టినా - అది జరిగి తీరుతుందన్నమాట.

**జై సద్గురు రాయా**



# నా కుమార్తెకు ఫార్మసీలో సీటు రావడం

తిరుపతిలో డి-ఫార్మసీ కోర్సు రెండు కాలేజీలలో ఉంది.

1. పద్మావతీ ఉమన్స్ పాలిటెక్నిక్ కాలేజీ
2. శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కాలేజీ - కో ఎడ్యుకేషన్ కాలేజీ. అమ్మాయిలూ, అబ్బాయిలూ ఇద్దరూ చదవొచ్చు.

మేము పద్మావతీ కాలేజీకి అప్లయి చేశాము. నా కుమార్తెకు జిల్లా స్థాయి ఆటల పోటీలలో నాలుగు సర్టిఫికేట్లున్నాయి. గేమ్స్ రిజర్వేషన్ సీటు ఇవ్వమని వ్రాశాము. అదే పద్మావతి కాలేజీకి శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గారి కుమార్తె కూడా అప్లయి చేసింది. ఆమెకు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలో సర్టిఫికేట్లున్నాయి. రాష్ట్రస్థాయి సర్టిఫికేట్లకు జిల్లాస్థాయికంటే విలువ ఎక్కువ. ఈమె రాష్ట్రస్థాయి సర్టిఫికేట్లు చిన్న సైజులో ఉన్నందున గుమస్తాలు చూడలేదు. మా అమ్మాయికి సీటు వచ్చింది. ఫీజు కట్టేశాను.

అప్పుడు శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీ పద్మావతి కాలేజీకి ఫోన్ చేసి గేమ్స్ సీటు ఎవరికి ఇచ్చారు? వాళ్ళకెన్ని సర్టిఫికెట్లు ఉన్నాయని విచారించాడు. జిల్లా స్థాయి సర్టిఫికెట్లున్న మా అమ్మాయికి ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి సర్టిఫికేట్లున్న మా అమ్మాయికి ఎందుకు ఇవ్వలేదని అడిగితే అప్పుడు చూచారు. సర్టిఫికేట్లు ఉన్నాయి. సీటు ఇస్తామన్నా ఆ ప్రిన్సిపాల్ గారు అంగీకరించక తన కుమార్తెకు తన కాలేజీలోనే సీటు ఇచ్చుకున్నాడు. ఈ విషయమంతా నారాయణరావు గారనే ఇన్‌చార్జి లెక్చరర్ నాకు చెప్పి భగవంతుడు న్యాయం చేసి ఇద్దరికీ సీటు వచ్చేటట్లు చేశాడని చెప్పాడు. అలా ఆమె

రాష్ట్ర స్థాయి సర్టిఫికేట్లు వారి కంటికి కనబడకుండా భగవంతుడు చేయకుంటే మా అమ్మాయి ఫార్మసీ చదివేందుకు వీలే ఉండేది కాదు.

## హుబ్లీ డివిజన్‌లో ఉద్యోగం

మా అమ్మాయికి రైల్వేలో వ్రాత పరీక్ష ఇంటర్వ్యూ అయ్యాక హుబ్లీ డివిజన్‌లో ఉద్యోగమొచ్చింది. మా అమ్మాయి, ఆమెకు తోడు ఉండేందుకు మా అమ్మ, వీళ్ళను అక్కడ వదలి పెట్టేందుకు నేను హుబ్లీ పోవాలని విజయవాడ నుండి మూడు టిక్కెట్లు రిజర్వ్ చేసుకొన్నాము. ఇంకొక అరగంటకు రైలెక్కాలనగా ప్లాట్‌ఫారం మారవలెనని వంగి సూట్‌కేసులు తీసుకోబోతున్నాను. చిత్రంగా పై జేబులోనివే కాకుండా చొక్కా లోపలి జేబులోని కాగితాలు, డబ్బూ అంతా క్రింద పడింది. నా శరీరమంతా వణుకు, చెమటలు పట్టి నేలపైన కూలబడి పోయాను. నా పరిస్థితి చూచి నా కుమార్తె, ఇంత సెంటి మెంటలయితే బ్రతకడం కష్టము. మీరిద్దరూ రావద్దు నేనొక్క దాన్నే పోతానని మొండికేసింది. ఆమెకు నా భాషే అర్దం కావడంలేదు. ఇక చేసేది లేక శ్రీ స్వామి వారికే చెప్పుకొన్నాను. ఆ అమ్మాయి మనసైనా మార్చు, లేకుంటే ముగ్గురము ప్రయాణం చేస్తాము. నీ ఇష్టమొచ్చినట్లు చెయ్ అని చెప్పుకొని బయలు దేరాము. ప్రయాణంలో ఏమీ కాలేదు. కానీ సికింద్రాబాదు నుండి హుబ్లీకి రావలసిన అమ్మాయి ఫోటో అంటించిన అప్లికేషన్ రాలేదు. పదిరోజులు హుబ్లీలో ఉండవలసి వచ్చింది. స్టౌవ్ పెట్టి వంట చేసుకునేందుకు ఏ లాడ్జిలోను అంగీకరించలేదు. వాళ్ళిద్దరూ హోటల్‌లో తిన్నా నేను శ్రీ స్వామి వారి ఆజ్ఞ ననుసరించి నా వంట నేనే చేసుకొని తినాలి. ఇక కాదని రైల్వేస్టేషన్ లోనే మకాం పెట్టి వెయిటింగ్ రూంలో స్నానాలు చేస్తూ వాళ్ళు హోటలు నేను పాలు పండ్లతో కాలం గడుపు చున్నాము.



పది రోజులైనా కాగితం రాలేదు. నా దగ్గర డబ్బంతా అయిపోవచ్చింది. గుట్టుగా రేణిగుంట చేరాలని నిశ్చయించుకుని 11 గంటల రైలు కొరకు చూస్తున్నాము.

ప్రతిరోజు వెయిటింగ్ రూములోనే ఉదయం మిల్క్ బ్రెడ్ తినేది అలవాటు. ఆ రోజు ఆ రూము వెయిటరు మమ్ములను చీవాట్లు పెట్టడంతో బయటకూర్చొని తింటున్నాము. అతని చేత చీవాట్లు తినవలసి వచ్చినందుకు బాధగానే ఉంది. కానీ నిస్సహాయులంగదా! కష్టాలు గూడ అనుగ్రహానికి గుర్తు అనేమాట అక్షరాల నిజమైంది. మేము రొట్టె తింటుండగానే ఒక రైలు వచ్చి ఆగింది. ఆ రైలులో నుండి ఒక తెలిసినతను వచ్చి పలకరించాడు. మా పరిస్థితి విని మమ్ములను నర్సుల హాస్టలులో ఉంచాలని చూచాడు, వీలు కాలేదు. రైల్వే హాస్పటల్‌లో డార్మెటరీలో ఉంచాలని చూచాడు, అదీ వీలు కాలేదు. చివరకు సాంబమూర్తిగారనే రైల్వే టెలిఫోను ఇంజనీరు గారి బంగ్లాలో దించాడు. ఈ సాంబమూర్తి గారి బంగ్లాలో దిగకుంటే మా కాగితం 16 గంటలలో సికింద్రాబాదు నుండి హుబ్లీ వచ్చి యుండదు. సాంబమూర్తి గారు మా విషయం విని సికింద్రాబాద్‌కు ఫోను చేసి కాగితం పంపిన రిజిస్ట్రేషన్ నంబరు చెపితే పోస్టల్ కంప్లెయింట్ ఇస్తానని అడిగాడు. ఆ గుమస్తా పుస్తకంలో మా అమ్మాయి పేరులేదు. ఆ కాగితం కొరకు ఆదుర్దాగా వెతికాడు, దొరికింది. రేపు ఉదయం పది గంటలకు మీకు హుబ్లీకి తెచ్చి కాగితం ఇస్తాను. మా బాస్‌కు చెప్పవద్దని, చెపితే తన ఉద్యోగం పోతుందని బ్రతిమాలినాడు.

అతను చెప్పినట్లే ఉదయం 10 గంటలకు హుబ్లీకి తానే స్వయంగా ఆ కాగితం తెచ్చి ఆఫీసులో ఇచ్చాడు. ఒంటి గంటకు మా పని పూర్తయింది.

రైల్వేస్టేషన్‌లో వెయిటింగ్‌రూంలో వెయిటర్ చీవాట్లు పెట్టకుండా ఉంటే బయటకూర్చోము. అక్కడ కూర్చోకుంటే మేము సాంబమూర్తి గారి దగ్గరకు చేరలేము. నర్సుల హాస్టలులోగానీ, డార్మెటరీలో గాని ఉంటే మా కాగితం సికింద్రాబాదు నుండి రాదు. ఈ అనుభవంతో మా అమ్మాయి నన్ను సెంటిమెంటల్ మనిషి అనడం పూర్తిగా మానేసింది. శ్రీ స్వామి వారి మాట విని ఆ రోజు ప్రయాణం మానుకొని ఉంటే ఆ కాగితం ఆ గుమాస్తా చేతికి తగిలి సకాలంలో చేరి ఉండును. మా అమ్మాయికి పాఠం నేర్పాలి. కష్టాలు అనుగ్రహానికి గుర్తని నాకు ప్రత్యక్ష అనుభవమివ్వాలి. నేను శ్రీ సాంబమూర్తి గారి ఆయాసం మాట విని వారికి విభూతి, అవధూత లీల గ్రంధం ఇచ్చాను. శ్రీ సాంబమూర్తి గారి ఆయాసం కూడా నయం చేసి వారిని కూడా తన భక్త కోటిలో కలుపుకున్న శ్రీ స్వామి వారి భోదనా దక్షత నేమని వర్ణించగలను.

## స్టేట్ బ్యాంకు ఉద్యోగం

నా కుమార్తె D ఫార్మసీ పాసై 3 సంవత్సరాలైనా ఎక్కడా ఉద్యోగం రాలేదు. నేను ప్రైమరీ హెల్తు సెంటర్సులో అందరి చుట్టూ తిరిగినా పని కావడం లేదు. ఒకరోజు నేను నెల్లూరు ట్రంకు రోడ్డులో వస్తుంటే నాతో చదువుకున్న మిత్రుడు కనిపించి ఎందరు పిల్లలు ఏమి చేస్తున్నారు అని మాట్లాడుకోవడంలో స్టేట్ బ్యాంకులో ఉద్యోగాలు వేశారు, ఒక నెల వెనుక పేపర్లు చూడమన్నాడు. చూస్తే ఉంది. కానీ రేపు కాదు మర్నాడు ఆఖరుతేదీ అప్లయి చేసేందుకు. ఇంటికి వస్తే నా కుమర్తె అన్నీ ఇట్లాగే పోగొడతావని నాలుగు చీవాట్లు వేసింది. ఆ అప్లికేషన్‌లో రెండు కాలమ్స్ కష్టమైనవి ఉన్నాయి. (1) ఒక M.B.B.S. డాక్టరు పరీక్ష వాసే కెండిడేట్ ఆరోగ్యంగా ఉన్నాడు అని సర్టిఫికేట్ ఇవ్వాలి. (2) జిల్లా మేజిస్ట్రేట్ ఈ కేండిడేట్ రాజకీయాలలో పాల్గొనడని సర్టిఫికేట్ ఇవ్వాలి.



రాత్రి 8 గంటలకు అమ్మాయిని నెల్లూరుకు తీసుకపోవాలంటే మా అమ్మ తిడుతుంది. ఇంటికి దూరమైన బిడ్డను రాత్రి పూట నెల్లూరు తీసుకుపోతావా? అని రచ్చ మొదలైంది. సరేనని అమ్మాయి లేకుండా నేనే నెల్లూరులో ఒక తెలిసిన డాక్టరు దగ్గరకెళితే దేవుడులా ఆయన ఇంట్లో ఉన్నాడు. ఆయన ఇంట్లో లేకుంటే నా పరిస్థితి ఏమౌనో గదా? కానీ వారు సెలవులో ఉండినందున స్టాంపు ఆఫీసులో ఉందట. సరే ఆ మహానుబావుడే మరొక డాక్టరు దగ్గరకు తీసుక వెళ్ళి సంతకము ముద్ర వేయించారు. తెల్లవారి కలిచేడు వెళ్ళి స్కూలులో సెలవు పెట్టి మెజిస్ట్రేట్ కొరకు గూడూరు వెళ్ళే సరికి 12 గంటలు అయింది. అక్కడ ఈ సర్టిఫికేట్ కొరకు వచ్చినవారు కిటకిటలాడు చున్నారు. అందరూ నాకీరోజు పని కాదన్నారు. నేను బిళ్ళ బంట్రోతును పిలచి "నేను అరగంట కంటే ఎక్కువ సేపు ఉండేందుకు వీలుకాదు, నీ వెంత కావలసినా తీసుకో" అన్నాను. అతడు నా అప్లికేషన్ తీసుకొని లోపలికి వెళ్ళి ఒక్క నిమిషంలో బయట కొచ్చాడు. సంతకం చేయలేదని కంగారు పడ్డాను. సంతకం చేయించి ముద్రవేసి తెచ్చాడు. అందరూ పది ఇస్తారట నేను ఇరవై రూపాయలిచ్చాను. శ్రీ స్వామి వారు సహాయం చేస్తే మనకు ఆ విధమైన తెలివినిస్తాడు. పని చేయిస్తాడు. ఇప్పుడు బ్యాంకులో పని చేస్తుంది.

## రైల్వే ఉద్యోగం వదలి బ్యాంకు ఉద్యోగంలో చేరడం

నా కుమార్తె హుబ్లీ డివిజన్‌లో షోలాపూర్ దగ్గర హుటిగీ అనే గ్రామంలో రైల్వే ఆస్పత్రిలో పనిచేస్తోంది. అప్పుడు స్టేట్ బ్యాంకులో చేరమని అపాయింట్‌మెంట్ ఆర్డరు వచ్చింది. రైల్వే పెద్ద సంస్థ. దానిలో ఉంటే ఇండియా అంతా రైల్వే పాస్‌తో తిరగవచ్చు, బ్యాంకు చిన్న సంస్థ. అని నేను అమ్మాయికి బ్యాంకు ఆర్డరు విషయం చెప్పనే లేదు. ఒకవేళ

చెపితే ఆ ఉద్యోగం వదిలేసి బ్యాంకులో చేరుతుందని నా ఉద్దేశ్యం. ఆ సమయంలో షిరిడీకి పోవాలి అని హృదయంలో ఒకటే ప్రేరణ. ఇక దాన్ని తట్టుకోలేక పోతున్నాను. హుటిగీ మార్గానపోవాలి షిరిడీకి. వెళ్ళేటప్పుడే దిగి అమ్మాయిని చూచిపోవాలని ఆమె ఎంతో కష్టపడి బ్యాంకు టెస్టుకు చదివింది గనుక అపాయింట్‌మెంట్ ఆర్డరు చూపించాలని తీసుకపోయాను. నేను వెళ్ళే సరికి ఆమె సామానంతా సర్ది కట్టలు కట్టి ఉంది. ఏమమ్మా నీకు క్వార్టరు ఇప్పుడు ఇచ్చారా అంటే ఒక పెద్ద కథ చెప్పింది.

డాక్టరు గారి భార్యను షోలాపూర్ లో కాన్పుకు ఆస్పత్రిలో చేర్చారు. డాక్టరుగారిని రమ్మని ఫోను వచ్చింది. డాక్టరుగారు వెళ్ళిపోయే సమయంలో రైలు వెళ్ళిపోతుంది. ఐదు నిమిషాల్లో ఇంకొక ట్రెయినుంది సార్ మీరు స్టేషనుకు పదండి అంటే కూడా వారు షోలాపూర్ ప్రయాణం మానేశారు. డాక్టరుగారు లేకుంటే మా అమ్మాయి ఇంజక్షను వేయాలి. ఆ రాత్రికి ఒక హార్టు కంప్లెయింట్ అతను వస్తే డాక్టరు ఇంజక్షన్ వేశాడు. అతడు చనిపోయాడు. అతనికి సీరియస్‌గా ఉందని వాళ్ళ ఇంట్లో చెప్పమని వాచ్‌మెన్‌ను పంపితే వాడు చనిపోయాడని చెప్పాడు. డాక్టరే చంపి ఉంటాడు అని ఆ లంబాడీ గూడెమంతా కత్తులు, కర్రలు తీసుకొని గోలచేస్తూ వస్తున్నారు. ఆ డాక్టరు గేటులో నిలుచొని అతను చనిపోవాలనా బ్రతకాలనా ఉద్దేశ్యం. మీరిలా రచ్చ చేస్తే అతడు చనిపోవడం ఖాయం. మీరు ప్రశాంతంగా ఉంటే ఇప్పుడు వ్యాను వస్తుంది. దానిలో అతనిని తీసుక వెళ్ళి షోలాపూర్‌లో చేరుస్తాను. నిజంగా అతను బ్రతికే ఉన్నాడని చెప్పాడు, వారు చల్లబడ్డారు. అతనిని వ్యానులో పెట్టి ముక్కులకు ఆక్సిజన్ తగిలించి డాక్టరు, అతని భార్య మరొక వ్యక్తి షోలాపూర్ తీసుక వెళ్ళారు. షోలాపూర్‌లో దిగి ముందు డాక్టరుగారికి జరిగిన సంగతి చెప్పి వీళ్ళ మూతా నన్ను చంపాలని వచ్చారు. మీరు అతనిని ఆస్పత్రిలో



చేర్చుకొని ఒక గంట తర్వాత డెడ్ బాడీ ఇవ్వండి. ఈ లోగా నేను తప్పించుకొని వెళ్ళిపోతానని చెప్పాడు. వాళ్ళలాగే చేశారు. డాక్టరు తప్పించుకొని వెళ్ళిపోయాడు. షోలాపూర్ - హుటిగీ మద్య దూరం ఐదు కిలోమీటర్లే గనుక సైకిళ్ళు, మోటార్ సైకిళ్ళ పై అందరూ షోలాపూర్ వచ్చారు. పేషంట్ చనిపోయాడని చెప్పడంతో జనం రెచ్చిపోయి పెద్ద గోల చేస్తూ హుటిగీ వచ్చి డాక్టరు గారి క్వార్టర్ పెంకులన్నీ పగలగొట్టారు. కిటికీల తలుపులు పగులగొట్టి లోపల కిరోసిన్ పోసి తగలపెట్టారు, తోటంతా ధ్వంసం చేశారు. ఈ విలయ తాండవమంతా పెద్ద రచ్చతో జరుగుతుంది. మా అమ్మాయి క్వార్టరు ఆ ప్రక్కనే. నామీదకెక్కడ వస్తారోనని ఈమె హడలి పోయింది.

ఈ స్టేషన్‌లో ఒక్కక్షణం ఉండకూడదని సామాను కట్టేసి వచ్చేందుకు సిద్ధంగా ఉంది. పై కథంతా విని నేనప్పుడు బ్యాంకు వాళ్ళు పంపిన అపాయింట్‌మెంట్ ఆర్డరు చూపించాను, ఆమె సంతోషానికి అవధులు లేవు. తెల్లవారి ఉదయం పది గంటల లోపల బ్యాంకు డ్యూటీలో చేరాలి. వెంటనే ట్రెయిన్‌లో తిరుపతి వచ్చి మా సామాను ఒకరి వాకిట ముందు పడేసి సరైన సమయానికి డ్యూటీలో చేరింది.

ఆమె సామానుతోటి ఇంటికి రాబోతుంటే సరిగ్గా అప్పుడే నన్ను షిరిడీకని పంపడం - పొయ్యేవాణ్ణి పోక బ్యాంకు ఆర్డరు తీసుకపోవడం - ఆ ఆర్డరు లేక పోయినా కొంత ఇబ్బంది అయ్యేది. ఆనాటి రాత్రి డాక్టరే షోలాపూర్ వెళ్ళి ఉంటే మా అమ్మాయే ఇంజక్షను వేయాలి. వాడు చనిపోతే ఆ కత్తులతో వచ్చిన జనాన్ని చూచి ముందే ఈమె గుండె ఆగి చనిపోయి ఉండేది. డాక్టరు గనుక అంత ప్లానుతో తప్పించుకున్నాడు. శ్రీ స్వామి వారు ఎంత చేస్తారో ఈ సన్ని వేశంలో ఆడుగడుగునా వారి హస్తం పని చేయడం చూస్తాము.

# మా కుమార్తై బ్యాంకు ఉద్యోగం ఇంటర్వ్యూ కాగితాలు పోష్టుమాష్టర్ ఇవ్వకపోవుట

మా కుమార్తై ప్రస్తుతం స్టేట్‌బ్యాంకు లో పనిచేస్తుంది. ఈ ఉద్యోగంలో చేరకముందు బ్యాంకు వారు నిర్వహించే వ్రాత పరీక్షలు వ్రాసి సెలక్టయి ఇంటర్వ్యూకు ఆర్డర్లు వచ్చాయి. రిజిష్టరు పోష్టు కవరు. పోష్టు ప్యూన్ మా వాకిటి ముందు నుండి సైకిల్ మీద పోతూ "మీ అక్క ఉందా?" అని నా కుమారుడిని అడిగాడట. వీడు లేదు అని చెప్పాడట. వీడి భావం ఆ సమయంలో ఇంటిలో లేదు అని. ఆ సమయంలో ఆమె దేవాలయానికి వెళ్ళి ఉంది. ఆమె లేని పక్షంలో ఆమెకు వచ్చే రిజిష్టరు లెటర్లు నాకు ఇవ్వమని ఒక ఆథరైజేషన్ లెటరు కూడా ఈ పోష్టు ప్యూన్‌కు ఇచ్చి ఉన్నాము. కానీ ఇతడా లెటర్ పది రోజుల వరకు ఇవ్వకుండా పోష్టు మాష్టర్ టేబుల్ సొరుగులో పెట్టి పెండ్లికి వెళ్ళిపోయాడు. పదవరోజు రాత్రి ఎనిమిది గంటలకు నెల్లూరు నుండి బస్సులో వస్తున్నాను. అదే బస్సులో నా ముందు సీటులో ఉన్న పోష్టుమాష్టర్ అనేక విషయాలు మాట్లాడుతూ వస్తున్నాము. గొలగమూడి దగ్గరకొచ్చి "మీ అమ్మాయికి రిజిష్టరు లెటరు వచ్చిందే, ఇచ్చాడా మల్లిఖార్జునా?" అన్నాడు. దాని కొరకే ఎదురుచూస్తున్నామని మా ఇంటికి రాకుండా పోష్టుమాష్టర్ ఇంటికి వెళ్ళి చూస్తే - రేపు ఉదయం తొమ్మిది గంటలకు తిరుపతిలో బ్యాంకు ఇంటర్వ్యూ అని చెపుతుంది. ఆ పోష్టుమాష్టరును నాలుగు చీవాట్లు పెట్టి కవరు తీసుకొని ఇంటికి పరుగెత్తాను. నేను వచ్చిన బస్సులోనే నెల్లూరు పోవాలి. ఆ బస్సుపోతే ఇక బస్సులు లేవు. అప్పుడు ఆటోలు లేవు. ఆ రాత్రికి నెల్లూరులో ఉండి వేకువన తిరుపతికి పోవాలని నెల్లూరులో ఎక్కడుండాలని మేమిద్దరు మాట్లాడుకుంటున్నాము. కండక్టరు తన లెక్కలు చూచుకుంటున్నాడు. మా సంభాషణంతా డ్రైవర్ వింటున్నాడు. సార్ రేపు ఆలిండియా హర్తాళ్ - ట్రెయిన్స్ గానీ బస్సులుగానీ ఏవీ



ఉండవు. మీరు రాత్రికే తిరుపతి వెళ్ళిపోండి, ఇంటర్వ్యూ గనుక, అన్నాడు. నిజమే తెల్లవారి హర్తాళ్. అప్పటికప్పుడు తిరుపతికి వెళ్ళి చౌల్ట్రీలో నిద్రచేసి తెల్లవారి ఇంటర్వ్యూకి వెళ్ళాము. అదే ఇంటర్వ్యూలో సెలక్టయి ప్రస్తుతం బ్యాంకులో ఉద్యోగం చేస్తుంది. శ్రీ స్వామి వారు ఆ క్షణంలో పోష్టుమాష్టరును ప్రేరేపించి "మీ అమ్మాయి రిజిష్ట్రేషన్ కవరు తీసుకున్నారా?" అని చెప్పించకుంటే ఇక ఇంటర్వ్యూకు పోయి ఉండము. ఆ తర్వాత బస్సులో నెల్లూరు పోతుంటే రేపు హర్తాళ్ అని డ్రైవర్ చెప్పకుంటే కూడా తిరుపతి పోలేము. మనము వారిని ప్రార్థించని సమయంలో కూడా మనలను ఎలా ఆదుకుంటున్నారో చూడండి. గురుకృప అంటే ఇదే కదా! అది సద్వినియోగం చేసుకోని మందభాగ్యుడను కదా!

# ఒక సంబంధం చూస్తే శ్రీ స్వామి వారు వద్దనడం

మా కుమార్తైకు పెండ్లి సంబందాలు చూస్తూ నెల్లూరులో ఒక సంబంధం చూచాము. అమ్మాయి, అబ్బాయిలు చూచు కోవడం కూడా అయిపోయింది. ఆ రోజు పెళ్ళి కట్నకానుకలు మాట్లాడుకోవాలని పోతున్నాము. వాళ్ళింటికి కొద్ది దూరంలో ఎవరో ఒకతను మోటార్ సైకిల్ క్రింద పడి తలలో గాయమై రక్తం కారుతుంది. గుడ్డకట్టి ఆస్పత్రికి తీసుకపోయారు. మనకీ సీను కనబడిందని అనుమానమే. కానీ టౌన్ కదా. రెండవది మనకేమీ జరగలేదు అని వెళ్ళాము. చాలా చిత్రంగా సాయం కాలం నాలుగు గంటలకు అబ్బాయినాయన నిద్రపోతున్నాడు. మనం వెళ్ళే సమయానికి అలా నిద్రపోవడం ఒక అపశకున మంటారు పెద్దలు. వాళ్ళు వాయిదా వేశారు. మరలా ఇంటికి వచ్చి ఫలానా రోజు వస్తామని జాబు వ్రాసేందుకు నాలుగు మాట్లు ప్రయత్నిస్తే ఆ యాక్సిడెంట్ సీను మనసులో మెదులుతుంది. జాబు వ్రాయకుండా ఆగిపోతున్నాను.

చివరకు నా భార్యకు చెప్పాను. ఆమె వెంటనే ఆ యాక్సిడెంట్ రోజు తనకు జరిగిన అనుభవం చెప్పింది. మేము ఇంటినుండి బయలు దేరివెళ్ళినాక ఆమె దేవుని దగ్గర దీపం పెట్టి నమస్కరిస్తుందట. తన చీర జానెడు పొడవున కాలిందట. ఆ చీర తెచ్చి చూపింది. తాను కాపురానికి వచ్చి ఇరవై ఐదు సంవత్సరాలైనా ఎప్పుడూ తనకు చీర కాలలేదని, ఈ సంబంధం మాని వేయమని ఖండితంగా చెప్పింది. ఆ సంబంధం మానుకున్నాము. ఈ విధంగా శ్రీ స్వామి వారు తన అయిష్టాన్ని తెల్పి మా చేత ఆ సంబంధం విరమింపచేశారు.

## నా కుమార్తె లూనా యాక్సిడెంట్

నా కుమార్తె తిరుపతిలో ఉద్యోగం చేస్తుండేది. తిరుపతి R.T.C. బస్టాండ్ దగ్గర ఆఫీసు. యూనివర్శిటీ ఆవరణం దగ్గర వర్కింగ్ ఉమన్స్ హాస్టల్‌లో నివాసం. బస్సులలో తిరగడం కష్టమని లూనా కొంటానన్నది. (1) లూనా కొనమంటారా (2) సైకిల్ కొనమంటారా అనేది శ్రీ స్వామి వారి దగ్గర చీటీ పెట్టికొనమన్నాను. సైకిల్ అని వచ్చింది. ఒక్క సంవత్సరం తొక్కేసరికి వీపు నొప్పి వచ్చి నేను తొక్కలేకున్నాను లూనా కొంటానన్నది. మరలా చీటీ పెట్టమన్నాను. నేను చీటీ పెట్టను, యాక్సిడెంటయితే శ్రీ స్వామే రక్షిస్తాడు అని చెప్పింది. శ్రీ స్వామే రక్షించాలి అంటున్నావా లేక శ్రీ స్వామే రక్షిస్తాడు అని అంటున్నావా? రక్షించాలి అనేనా లేక రక్షిస్తాడు అనా నీ ఉద్దేశ్యం అన్నాను. రక్షిస్తాడు - రక్షిస్తాడు అని గట్టిగా నొక్కి చెప్పింది. సరే కొనమన్నాను, చీటీ పెట్టకుండానే లూనా కొన్నది. మూడు నెలల తర్వాత వెనుకనుంచి ఒక ఆటో తన లూనా ఫెడల్‌ను గుద్దింది. ఫెడల్ ముందుకు వంగిపోయింది. ఈమెకేమీ దెబ్బతగల్లేదు. స్టార్ట్ ఇమ్మీడిఏట్లీ అని టెలిగ్రామ్ ఇచ్చింది. అనారోగ్యమై ఆస్పత్రిలో ఉందని ఆతురతగా వెళ్ళాను. ఏ ఆస్పత్రిలో ఉందని అడిగేందుకు R.T.C.



దగ్గరున్న వాళ్ళ ఆఫీసుకుపోయాను. ఎదురుగుండా నవ్వుతూ కూర్చొనుంది. ఏమిటమ్మా టెలిగ్రాం ఇచ్చావు అంటే "నీకు వెంకయ్య స్వామిని చూపిస్తా రా" అని తన లూనా ఫెడల్ చూపింది. ఇంతగా ఫెడల్ వంగిపోయినా నాకేమీ దెబ్బతగలలేదు. ఆ సమయంలో నేను నాపాదాన్ని ఫెడల్ బయట ఉంచి ఉన్నట్లయితే బయట ఉన్న భాగం చిత్తయిపోయి ఉండేది. శ్రీ స్వామి వారి రక్షణ వల్లనే నా పాదం ఫెడల్‌కు లోపల ఉంచాను, అని చెపుతుంది. శ్రీ స్వామి వారి రక్షణ ఎలా ఉంటుందో - వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అన్న శ్రీ స్వామి వారి మాట ఎంత యదార్ధమో చూడండి.

## మా కుమార్తెకు పెండ్లి సంబంధం

నా కుమార్తె ఓపన్ యూనివర్శిటీ బి.కాం. పాసయ్యింది. ఆమె స్టేట్ బ్యాంకులో చేస్తోంది. బ్యాంకు ఉద్యోగే కావాలంటుంది. ఇంజనీర్లు, L.I.C. వాళ్ళు, ప్రయివేట్ కంపెనీలలో చేసే వాళ్ళు అనేకులు వచ్చినా ఆమె అంగీకరించలేదు. నేను స్వామి వారి మీద భారం వేసి నిశ్చింతగా ఉన్నాను. ఒకరోజు నా స్నేహితుడు లెటర్ వ్రాశాడు. నెల్లూరు పంజాబ్ నేషనల్ బ్యాంకులో గుమాస్తాగా చేస్తున్న అబ్బాయి పెండ్లికుమారుడు. పెండ్లికుమారుని అన్న, నేను వెళ్ళి తిరుపతిలో మీఅమ్మాయిని చూచాము. మాకు అమ్మాయి నచ్చింది. మీరు వెళ్ళి పంజాబ్ నేషనల్ బ్యాంకులో అబ్బాయిని చూడండి. మీకు నచ్చితే అమ్మాయి అబ్బాయి చూపులకు ఏర్పాటు చేస్తాము అని వ్రాశాడు. నేను వెళ్ళి అబ్బాయిని చూచాను. దివ్యంగా ఉన్నాడు. మనం ఇవ్వగలిగిన కట్నకానుకలకు అంగీకరించాడు. చూపులకు ఏర్పాటు చేశాము, ఉదయం వాళ్ళ అన్న, ఆయన చూచారు. మధ్యాహ్నం పిల్లవాని అక్కగారు వచ్చిచూచారు. అంటుతావులు లేని సమయం వ్రాయించుకపోయారు. గొలగమూడికి బయట నేను పెండ్లి

చేయలేను. గొలగమూడిలో చేయాలంటే బాత్‌రూములు లెట్రిన్‌లు లేవు, అని చెప్పాను. వారే గూడూరులో చేసుకుంటామన్నారు. పదిరోజులలోగా చౌల్‌ట్రీలో ఏ ఆటంకమూ లేకుండా నిక్షేపంగా వివాహం జరిగింది. ప్రస్తుతం ఒక అబ్బాయి. మూడవ క్లాసు చదువుతున్నాడు. నెల్లూరులో సొంత ఇల్లు కట్టుకొని ఉన్నారు. శ్రీ స్వామి వారు కుదిర్చి, నిర్వహించిన పెండ్లి గనుక మనకేవిధంగానూ చీకూచింతాలేదు. అమ్మాయికంటే అల్లుడుగారే మామీద అభిమానంగా ఉంటాడు.

## బస్సు తప్పగొట్టడం

నా కుమార్తె వివాహానికి ఇక రెండు రోజులే ఉన్నాయి. నాతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని కాబోయే అల్లుని అన్న వాళ్ళు రెండు మార్లు వచ్చినా నేను ఇంటిలోలేను. ఇప్పుడు నాక్కాబోయే అల్లుడే వస్తున్నాడు. కానీ ఆ విషయం నాకు తెలియదు. ఆయన మోటార్ బైక్ మీద వస్తున్నాడు. నేను గొలగమూడిలో ప్రహరీ బయట టెంకాయలు కొట్టే చోట బస్సు ఎక్కేందుకు సంచిపట్టుకొని నిలుచొని ఉన్నాను. పది గజాల దూరంలో బస్సు నిలబడి ఉంది. కండక్టరు నన్ను రమ్మని పిలుస్తున్నాడు. నేను కళ్ళు తెరిచే ఉన్నాను, కానీ మనలోకంలో లేను. తిరిగి మనలోకంలోకి వచ్చేసరికి బస్సు చాలా దూరం వెళ్ళిపోయింది. ప్రక్కనే ఉన్న బస్సు పోగొట్టుకున్నందుకు నన్ను నేను నిందించుకుంటూ ఇంటికి వెళ్ళి కుర్చీలో కూర్చోగానే కాబోయే అల్లుడు మోటార్ బైక్ మీద వచ్చి హారన్ కొట్టాడు. అప్పుడు కూడ నేను వారికి దొరకకపోతే పెండ్లి ఆగిపోవడం ఖాయం. ఇది తెలిసే శ్రీ స్వామి వారు నన్ను బస్సు ఎక్కకుండా ఆపేశారు. మోటార్ బైక్ మీద బస్సుకంటే ముందే నెల్లూరు చేరాను. వివాహం సకాలంలో సలక్షణంగా జరిపించారు శ్రీ స్వామి వారు.



ఈ సన్నివేశంలో శ్రీ స్వామి వారిని ఇలాంటి సన్నివేశం కూర్చమని నేను ప్రార్ధించానా? లేనే లేదు. ఆ మహనీయునికి సర్వం తెలుసు గనుక నాకవసరమైంది వారు చేస్తున్నారు. బస్సు తప్పిపోయినప్పుడు బాధగానే ఉంది. కానీ అది కూడా మన మంచికే జరిగింది. ఈ సత్యాన్ని సర్వకాలాలలోను గుర్తుంచు కుంటే ఇక చింతకు తావేలేదు.

## అమ్మాయి పెండ్లి రోజు నిద్రలేపడం

రేపు ఉదయం 6½ - 7½ గంటల మధ్య మా కుమార్తె వివాహం గూడూరులో జరగాలి. మా కుమార్తె వాళ్ళ అమ్మతో సహా అందరూ గూడూరు వెళ్ళారు. నేను రోజూ గొలగమూడిలో నిద్రచేస్తానని మొక్కుబడి. కనుక ముందురోజు గూడూరు వెళ్ళి మరలా నెల్లూరు వచ్చి అక్కడనుండి ఆటో తీసుక వచ్చి ఉదయాన్నే 4 గంటలకు తిరిగి నెల్లూరుపోయి బస్సులో గూడూరు పోవాలని ఆటో తెచ్చుకున్నాను. బాగా ఆకలౌతుంది. ఏమైనా తింటే 4 గంటలకు నిద్ర లేవలేను అని సంశయిస్తూనే ఏదో చేసుకోబోయాను. గిన్నె క్రింద పడింది. కొంచెంసేపు ఆగి ఆకలి భరించలేక రవ్వతో చమురులేని హల్వా చేసి, తిని నిద్ర పోయాను. అలారం మోగినా మెలకువరాలేదు. ఆటో అతను కూడా లేపలేదు. గంట 4.45 నిమిషాలు గొలగమూడిలోని ఒకతను వచ్చి తలుపులు బద్దలు కొట్టేటట్టు తట్టి లేపాడు. మీరు పాలు కావాలన్నారట. తీసుకోండి అని పాలుగిన్నె అందించాడు. గిన్నె తర్వాత ఇస్తానని పాలు నట్టింట పడేసి చొక్కా తగిలించుకొని ఆటోలో వెళ్ళాను.

అసలు పాలు కావాలని నేనెవ్వరికీ చెప్పలేదు. నీకెవరు చెప్పారని అడిగితే ఎవరో చెప్పారని చెపుతాడు. ఆయనే వచ్చి లేపకుంటే 6 గంటల వరకు లేచే ప్రశక్తే లేదు.

సరే నెల్లూరులో ఆటోలో పోతుంటే గూడూరు పొయ్యే ఎక్స్‌ప్రెస్ బస్సు వస్తోంది. నేను ఆటోలోనుండే చెయ్యి ప్రక్కకు చాపి ఆపాను. బస్సు ఆగింది. కండక్టర్ "ఇప్పటికే స్టాండింగ్ రైట్ రైట్" అంటున్నాడు. డ్రైవర్ మాత్రం మేమెక్కినంతవరకు బస్సు కదిలించలేదు. ఆ డ్రైవర్ రూపంలో శ్రీ స్వామి వారే నన్నాదుకున్నారు. ఎంతస్పీడుగా వచ్చాడో తెలియదు. నేను మాత్రం సకాలంలోనే వివాహావేదిక చేరాను. శ్రీ స్వామి వారు ఏమీ తినవద్దని గిన్నె క్రింద దోసినా నేను ఆ మాట లెక్క చేయకుండా తిన్నాను. కానీ ఆ కరుణామయుడు పాలవాని రూపంలో నిద్రలేపి, బస్సు డ్రైవర్ రూపంలో బస్సు ఆపి నన్ను సకాలంలో గమ్యం చేర్చారు. ప్రణామములర్పించడం కంటే నేనేమి చేయగలను.

## స్వామి కృప పబ్లికేషన్స్ రిజిస్ట్రేషన్

1990 సంవత్సరం నుండి నేనే నా సొంత భాద్యతతో అవధూత లీల, అవధూత బోధామృతం, స్వామి సన్నిధి, ఇతర చిన్న పుస్తకాలు ప్రింట్ చేయించి అమ్ముతున్నాను. కోర్టుకేసుల కారణంగా ఆశ్రమం వారు ఆర్థిక ఇబ్బందులలో పడి మూడు సంవత్సరాలు పుస్తకాలే లేవు. నేను అరవై వేల రూపాయలు పెట్టుబడి పెట్టే ఆర్థిక స్థోమత లేకుండా ఉన్నాను. అలాంటప్పుడు ఒక భక్తుడు తన మొక్కుబడి డబ్బు పదివేల రూపాయలు హుండీలో వేయనీయకుండా మూడు మారులు అడ్డు పడ్డారు శ్రీ స్వామి వారు. మూడవసారి శ్రీ స్వామి వారి పటం ముందు కూర్చొని ఈ మొక్కుబడి డబ్బు ఏమి చేయాలి స్వామీ అని చెప్పుకొంటుంటే ఆ పటంలో శ్రీ స్వామి వారి వెనుక నేను కనబడుతున్నానట. ఇక తట్టుకోలేక ఆ పదివేలు నా చేతిలో పెట్టి పుస్తక ప్రింటింగుకు వాడమన్నాడు. మిగిలిన యాభైవేలు సమకూడితే ప్రింట్ చేయిస్తాను ఒక నెలకు కూడా సమకూడకుంటే పదివేలు వాపస్ చేస్తానని తీసుకున్నాను.



చాలా విచిత్రంగా తెల్లవారే ఒక మిత్రుడు వచ్చి నీకెంత కావాలో చెప్పు ఇస్తాను పుస్తకం ప్రింట్ చేయించమని కూర్చున్నాడు. పుస్తకాలు అమ్మితే వారి డబ్బు వాపస్ చేసే కండిషన్‌తో వారి దగ్గర డబ్బు తీసుకొని ప్రింట్ చేయించాను. పుస్తకాలు అమ్మి వారి డబ్బు వారికిచ్చాను. ఇలా 2002 సంవత్సరం వరకు జరిగింది. 2002 సంవత్సరంలో ఈ పుస్తక ప్రింటింగ్‌ను ఒక సంస్థగా రిజిష్టరు చేయాలని తీరని ఆలోచన పెట్టారు శ్రీ స్వామి. ఇక తట్టుకోలేక "శ్రీ స్వామి కృప పబ్లికేషన్ ట్రస్ట్" అని రిజిష్టరు చేయించాను. ఆ తర్వాత తెలిసింది. కోర్టు రిసీవర్లు ఆశ్రమాన్ని పాలిస్తున్నారు. వారు ఈ పుస్తకాలనన్నింటిని స్వాధీనం చేసుకొని వారే ప్రింట్ చేయించాలని తీవ్రంగా ఆలోచిస్తున్నారట. ఒకరోజు నన్ను పిలిచి అడిగారు. అది రిజిష్టర్డు బాడీ, నాదేమీ లేదు. కమిటీ వారిని అడగండి. వారంగీకరిస్తే తీసుకోండి, అని చెప్పాను. అంతటితో వారా ఆలోచన ముగించుకున్నారు. వారికా ఆలోచన కలుగగానే నన్ను ప్రేరేపించి శ్రీ స్వామి వారు "శ్రీ స్వామి కృప పబ్లికేషన్ ట్రస్ట్" ను రిజిష్టరు చేయించడం ఎంత చిత్రమో చూడండి. రిసీవర్లు తీసుకొని ప్రింట్ చేయిస్తే మొదటలాగా మరలా పుస్తక ప్రింటింగే లేకుండాపోతుందని శ్రీ స్వామి వారికి తెలుసు.

## గొలగమూడికి వచ్చిన ఏడు సంవత్సరముల తర్వాత బడికిపోవద్దనడం

గొలగమూడిలో కాపురం, ఉద్యోగం నలభై కిలోమీటర్ల దూరంలోని కలిచేడులో. నిత్యం సైకిలు బస్సుల ప్రయాణం. ఒక్కొక్కరోజు నెల్లూరులో బస్సు తప్పిపోతే స్కూలుకు ఆలస్యముగా హాజరవడం. ఇంతకు ముందులాగ ఈరోజు పరీక్ష పెడితే తెల్లవారి

ఆన్సరు పేపర్లు పిల్లలకివ్వలేకున్నాను. నా కాలమంతా నిత్యం ప్రయాణాల లోనే సరిపోతుంది. నా ఉద్యోగధర్మం సరిగా నిర్వహించలేకున్నానని అంతరాత్మలో తీరని కొరత. ఇదిగాక వర్షాకాలంలో సైకిల్ మీద పోవడం చాలా కష్టం. గొడుగు నిలవదు. పూర్తిగా తడిసి పోతాను. మరొక జత గుడ్డలు బస్సు ఎక్కగానే వేసుకునేందుకు వర్షం పడకుండా జాగ్రత్తగా తీసుకపోయే వాణ్ణి. దోవ సైకిల్‌కు అనుకూలంగా ఉండదు. మట్టి బాట. వెల్లువకొచ్చిన ముండ్లు. సైకిలంతా బురదైపోతుంది. ఒక్కొక్కప్పుడు బస్సు రిపేరై రాకుంటే అదొక బాధ. వీటన్నింటి ద్వారా నా పాపం పరిహరిస్తున్నారని చాలా స్వల్పంగా తెలుస్తుండేది. అయినా తట్టుకోలేక మూడు సంవత్సరాలు వరుసగా వేసవి సెలవులలో "ఒక వారం రోజులు కేవలం ద్రవాహారంతో దీక్ష చేస్తాను, నేనెప్పుడు వాలంటరీ రిటైర్‌మెంటు ఇవ్వాలో చెప్పండి" అని చెప్పుకునేవాడిని. రేపు దీక్ష అనగా ఈ రోజు రాత్రికే ఒక స్వప్న సందేశమిచ్చి ఇప్పుడు కాదు అని చెప్పేవారు. మొదటి సంవత్సరం కల ఇలా ఉంది. నేనొక చోట నిలుచొనియున్నాను. నా ప్రక్కనే ఒక అంబాసిడర్ కారుంది, డ్రైవర్ లేడు. కారులో ఎవరో ఉన్నారు. ఉన్నట్లుండి కారు కదిలిపోతుంది. కారులో ఆయన అరుస్తున్నాడు. నేను వెంటనే డ్రైవరు సీటులో కూర్చొని స్టీరింగు పట్టుకొని కారును నిలిపే ప్రయత్నం చేస్తున్నాను. కానీ కారు ఆగలేదు. చివరకు ఆ కారు ఒక ఎత్తైన కట్ట ఎక్కి దిగింది. కానీ ప్రక్కనున్న మరల కట్ట ఎక్కలేక ఆగిపోయింది. కల మెలకువ వచ్చింది. ఈ స్వప్నం ద్వారా కారు నడపడం నాకు చేతకాలేదు అని అర్థం తెలుస్తుంది. మనస్సును నియమించడమే కారు డ్రైవింగని నా ఆత్మలో బోదించారు, గనుక ఆ సంవత్సరమంతా స్కూలుకు వెళ్ళి మరలా వేసవి సెలవుల్లో మరలా దీక్ష చేస్తున్నానని చెప్పుకున్నాను. రేపు దీక్ష అనగా ఈ రోజు రాత్రి మరలా స్వప్నం.



నేనొక పెద్ద టూరిస్టుల బస్సులో ఉన్నాను. బస్సు నిండా ప్రయాణీకులున్నారు. డ్రైవరు దిగి ఎక్కడికో వెళ్ళాడు. ఉన్న పళంగా బస్సు కదిలిపోతుంది. ప్రయాణీకులంతా హాహాకారాలు చేస్తున్నారు. నేను వెళ్ళి డ్రైవర్ సీటులో కూర్చొని బస్సు నిలిపే ప్రయత్నం చేస్తున్నాను. కానీ నిలవడం లేదు. ఒక చిన్నపిల్లవాడు బస్సుకు ఎదురుగా రోడ్డు మీద వస్తున్నాడు. పిల్లవాడు చచ్చిపోతాడని బస్సులో వాళ్ళంతా అరుస్తున్నారు. ఎట్లాగో ఆ పిల్లవానికి ఏమీ కాకుండా స్టీరింగ్ త్రిప్పి బస్సును తప్పించాను. నాకు కోపం వచ్చి ఒక బ్రేకును గట్టిగా ఎగిరి తొక్కాను. బస్సు నిలబడింది. ఇంతలో డ్రైవర్ వచ్చి బస్సెందుకు కదిలించావు. నిన్ను పోలీస్‌స్టేషన్‌లో పెట్టిస్తానని అరుస్తున్నాడు. ప్రయాణీకు లందరూ డ్రైవరును తిడుతున్నారు. ఆయన పుణ్యాన ప్రమాదం తప్పింది లేకుంటే రోడ్డునొచ్చిన పిల్లవాడు మేము అందరమూ చచ్చేవారమే అంటున్నారు. అప్పుడు నేను "అయిందేదో అయింది, ఈ రాత్రికి ఇక్కడ ఆగి భజన చేసుకొని పోదామని చెప్పాను". మెలకువ వచ్చింది.

మూడవ వేసవి కాలంలో మరలా దీక్ష చేస్తానని చెప్పుకొన్నాను. ముందురాత్రి మరలా స్వప్నం - నేనొక పొడవైన స్కూలు కాంపౌండ్ గోడ ప్రక్కన నడుస్తున్నాను. ఆ గోడకు అవతల ఉన్న రోడ్డులోకి నేను పోవాలి. గేటు దాకా నడవాలంటే చాలా దూరముంది. నా ప్రక్కనే ఆ గోడకు ఒక రెండడుగుల ఎత్తులో మనషి దూరే వీలున్న రంధ్రముంది. గేటు దాక పోవడమెందుకు, ఈ రంధ్రం గుండా అవతలున్న రోడ్డులోకి పోవచ్చని ఆ రంధ్రం దగ్గర గోడపట్టుకొని దాటే ప్రయత్నం చేస్తున్నాను. అది పచ్చిగోడ తప, తప మని మనం దాటే వీలు లేకుండా విరిగిపడిపోయింది. కల మెలకువ వచ్చింది. గేటు గుండా బయటికి పోవడం అంటే ఉద్యోగంలో పూర్తి సర్వీసు చేయడం. అట్లా కాకుండా వాలంటరీ రిటైర్‌మెంటు అంటే ఈ రంధ్రం గుండా బయట పడడమని.

ఈ రంధ్రం ఇంకొంచెం ఎండితే ఎన్ని మారులు దాని గుండా దూరినా పరవాలేదని నా హృదయంలో చెప్పసాగారు. గనుక వాలంటరీ రిటైర్‌మెంట్ ఇంకా కొన్నాళ్ళు ఆగి చేయాలని తెలుపుతున్నట్లు నాకర్థమైంది.

ఇక మీదట శ్రీ స్వామివారిని దీక్ష చేసి అడగరాదని తీర్మానించుకొని బడికి పోతూనే ఉన్నాను. నా మానసిక బాధ శ్రీ భరద్వాజ గారికి చెపితే - నీవు తొందర పడి రాజీనామా చేయవద్దు. నీ ధర్మాన్ని నూటికి నూరు పాళ్ళు చక్కగా చేస్తూ - ముక్కుకు సూటిగా పోతుండు. అవసరమైతే హెడ్మాష్టర్‌ను నీమీద అవసరమైనన్ని కంప్లెయింట్స్ వ్రాయమను. వాటన్నింటికీ అంగీకరించి సంతకం చేస్తానని చెప్పమన్నారు. నేనామాట చెపితే ఆయన అలా వ్రాయలేదు. కానీ ఇద్దరం ఎడమొహం పెడమొఖంగానే ఉంటున్నాము. కాలం గడచి పోతుంది. అందరి దండ యాత్రలూ నామీదకే - ఎదురుగాలి బాగా వస్తుందంటే మన బండి జోరుగా పోతుందని లెక్క అన్న మాష్టారిమాటే నాకు ఆశనిచ్చే ఆశా కిరణమై - సంతోషంగా కాలం గడుపుతూ వచ్చాను. 1989 నవంబరు నెల రానే వచ్చింది.

## వాలంటరీ రిటైర్‌మెంట్:

1989 వ సంవత్సరం నవంబరు నెలలో లోనో లేక అక్టోబరు నెలలోనో తెలియదు ఒకనాటి రాత్రి ఒక స్వప్న మొచ్చింది. అందులో నేను, సెక్రటరీ బుజ్జయ్య గారు పూజారి నాగయ్యగారు సమాధి మందిరం వరండాలో నున్నాము. పోష్టు అతను నాకొక టెలిగ్రాం తెచ్చిఇచ్చాడు. అందులో ఇలా ఉంది "Your request for Voluntary Retirement is Accepted. Your Services are Terminated from Today" అని



ఉంది. నేనది పెద్దగా చదివాను. సెక్రటరీ బుజ్జయ్యగారు నాగయ్యగారితో తెలుగులో చెపుతున్నాడు. "పాపం అయ్యవారికి ఈరోజు నుండి ఉద్యోగం పోయింది" అన్నాడు. వెంటనే నాగయ్య అన్నాడు - దాని తాడు ఉద్యోగం అదిపోతే ఏం? అసలు ఉద్యోగం ఇక్కడ ఉండ్లా. ఈ స్వప్నాన్ని ఆధారంగా వాలంటరీ రిటైర్‌మెంట్ చేయడమా మానడమా అని సందేహమైంది. తెల్లవారి శ్రీ స్వామి వారి సమాధిపై చీట్లు వేశాను. (1) ఈనాటి నుండి వాలంటరీ రిటైర్‌మెంట్ చేయమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. (2) జనవరి 1వ తేది ఇంక్రిమెంటు వచ్చినంత వరకు ఉద్యోగంలో ఉండమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. (3) స్కూల్స్ జిల్లా పరిషత్‌కు వప్పగించేవరకు సర్వీసులో ఉండమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. (4) సర్వీసంతా ఉద్యోగం చేయమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. 1వ చీటీ వచ్చింది. ఇక ఎంతమంది చెప్పినా వినకుండా వాలంటరీ రిటైర్‌మెంట్ చేశాను. పదవ తరగతి పిల్లల కొరకు జనవరి వరకు నిత్యం బడికి వెళ్ళి పాఠాలు పూర్తి చేశాను. రిజిష్టరులో సంతకం మాత్రం చేసేది లేదు. హెడ్మాష్టరు, టీచర్లు ఎందరు బలవంతపెట్టినా వినకుండా రిటైర్ అయ్యాను. రిటైర్ అయ్యాక జీవితంలో ఎన్నడు అనుభవించని తృప్తి, శాంతి, ఆనందం అనుభవిస్తూ శ్రీ స్వామి వారి సమాధికి పూజ చేయగలుగుచున్నాను. నాకే కోరిక లేకపోయినా ఒక్క కోరిక పోలేదు. మంచాన కుంచాన పడి అందరిచేత చీకొట్టించు కోకుండా పోలిరెడ్డి గారిలాగా, రోశిరెడ్డి గారి లాగా తనువు చాలించేటట్లు చేయమని నేను శ్రీ స్వామి వారిని అడగకుండా ఉండలేకున్నాను.

# పాయసం మొక్కు

వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చాను కానీ పెన్షను రావడంలేదు. మూడు నెలలు నెలకు మూడు వందలు చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత అదిగూడలేదు. మూడు సంవత్సరాలు గడచినా ఆ మాటేలేదు. కాగితాలు

ఢిల్లీలో పెండింగ్ అంటారు. ప్రతినెల ఢిల్లీకి వెళ్ళివస్తారు ఆఫీసర్లు. T.A. లు D.A. లు వ్రాయడమే తప్ప మా పని చేయరు. నేనే కాదు నాతో కూడా ఇంకా ముగ్గురి కేసులు పెండింగే. అది మా కర్మో లేక ఈ ఆఫీసర్లు కొత్త పాపం సంపాదిస్తున్నారో తెలియదు. మొదటిది ఇల్లు గడవడం కష్టం. రెండవది లక్షరూపాయలకు ఒక నెలకు అప్పుడు బ్యాంకు వడ్డీ వెయ్యి - సంవత్సరానికి పన్నెండువేలు. మూడు సంవత్సరాలకు ముప్పైఆరువేలు నష్టం. ఉద్యోగం చేసే ఉపాధ్యాయులందరూ మనిషికి 50 రూపాయలు చందా వేసుకొని పదిహేను రోజులలోగా పెన్షను కేసులు తీర్మానం చేయకుంటే పదహారవ రోజునుండి నిరాహార దీక్ష మొదలు పెడతామని మా గ్రామ ఔట్ పోస్టు పోలీసుస్టేషన్ దగ్గర నుండి ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా వరకు అందరికీ టెలిగ్రాము లిచ్చాము. దానితో అందరి పెన్షను వచ్చింది. నాది మాత్రం మరలా ఢిల్లీకి పంపారు. నాకు హడలెత్తిపోయింది. ఇంక తిరిగి మూడు సంవత్సరాలు ఇంతేనా? ఇప్పుడిచ్చినట్లు నా కేసుకు టెలిగ్రాములెవరిస్తారు. నాకు చాల భయమేసింది. రెండు మూడు నెలలు చూచి శ్రీ స్వామి ప్రేరణతో ఒక మొక్కుబడి చెప్పుకున్నాను.

అప్పటివరకు అందరూ మొక్కుబడులు చెప్పుకుంటుంటే వీరంతా శ్రీ స్వామి వారితో వ్యాపారం చేస్తున్నారని హేళన చేసేవాడిని. నా విషయం వచ్చేసరికి ఆ మొక్కుబడి చెప్పడం ఎంత అవసరమో తెలిసింది. నా పెన్షను వస్తే ఒక గంగాళం పాయసం చేయించి పంచుతానని చెప్పుకున్నాను. ప్రొసీజర్ ప్రకారం ఢిల్లీ నుంచి లేబర్ మినిస్ట్రీ వారు మద్రాస్ అకౌంట్స్ ఆఫీసరుకు ఆర్డరు పంపాలి. అక్కడ నుండి మా ఆఫీసుకు, బ్యాంకుకు, నాకు ఆర్డర్లు రావాలి. మొక్కు చెప్పుకోగానే ఈ పద్ధతంతా లేకుండా నేరుగా బ్యాంకుకే ఆర్డరు వచ్చేసింది. నాకు ఆర్డరు రాలేదు గనుక నేను డబ్బు తెచ్చుకునేందుకు బ్యాంకుకు వారం



రోజులు పోలేదు. ఒక రోజు బ్యాంకు మేనేజరు గొలగమూడి వచ్చి నాకు చెప్పినందున డబ్బు తెచ్చుకున్నాను. ఆ విధంగా మొక్కుబడి చెప్పుకోవడం వ్యాపారమనే నా అజ్ఞానపు మాట నుండి నన్ను దూరం చేశారు.

## పెన్షను రానందుకు కారణం నాకు స్ఫురించడం

లక్షరూపాయలు పెన్షనరీ బెనిఫిట్స్ మూడు సంవత్సరాలు రాలేదు. ప్రతినెలా పెన్షను రావడంలేదు. ఆయా ఆఫీసర్లతో కరస్పాండింగ్ చేస్తున్నాను. కానీ మనసు బాధపడడం లేదు. మొదటి కారణం శ్రీ స్వామి వారి కృపవలన ఆ సమయంలో నా కుమార్తె బ్యాంకులో ఉద్యోగం చేస్తుంది. ఆమెకు పెండ్లి కాలేదు. గనుక ప్రతినెలా వద్దన్నా వినకుండా కొంత తెచ్చి ఇంట్లో ఇచ్చివెళ్ళేది. రెండవ కారణం - నేను అన్యాయంగా గవర్నమెంటు దగ్గర తీసుకున్న డబ్బంతా ఈ రూపంలో వసూలు చేస్తున్నారనుకునేవాణ్ణి. అన్యాయంగా గవర్నమెంటు దగ్గర తీసుకోవడమేమిటి? మమ్ములను మా ప్రక్క గ్రామమైన పొదలకూరుకు పదవక్లాసుకు - పరీక్షలకు సూపర్‌విజన్ డ్యూటీ వేస్తారు. ఎవ్వరమూ పొదలకూరులో రాత్రికి ఉండేది లేదు. రెండున్నర రూపాయిచార్జీతో హాయిగా ఇంటికి వచ్చేస్తాము. టి.ఏ. బిల్లు మాత్రం అక్కడే పొదలకూరులో ఉన్నట్లు - రోజుకు పదహారు నుండి ఇరవై రూపాయల వరకు డి.ఏ. వ్రాస్తాము. అట్లా ఒక్కొక్కసారి ఇరవై రోజులు కూడా పరీక్షలు జరుగుతాయి. ఇదంతా అక్రమ సంపాదనే. అట్లాగే స్పాట్ వేల్యుఏషన్ అని పోతాము. ఒక్కొక్క రోజు రోజంతా కలసి ఒక గంటే పని ఉంటుంది. పేపరులో ఏమీ వ్రాయరు. అలాంటప్పుడు కూడా పేపరు కింతని మనకు ఇస్తారు. ఎన్ని స్పాట్ వాల్యుఏషన్స్ నెల్లూరులో జరిగినా ఒక్కపైసా ఖర్చులేదు. ఐదు కిలోమీటర్లలోని మామగారింటికి పోతాను. టి.ఏ.,

డి.ఏ. బిల్లు మాత్రం వేల రూపాయలలో ఉంటుంది. ఈ విధంగా వచ్చిన అక్రమ సంపాదనంతా ఈ రూపంలో లాగేస్తున్నారని సంతోషించాను.

## కోనేరు దాటిపోతే నీవు గాడిదతో సమానం

నీ అన్నం నీవు తినమని శ్రీ స్వామివారు చెపితే నేను మొగమాటపడి వాళ్ళ బియ్యంతో నేనే వండుకుని తిన్నాను. అన్నం తినేటప్పుడు ఆయాసం వచ్చించి. ఒక నెలరోజులుగా ఎడతెగని ఆయాసం, చలి, దగ్గు. ఆహారం, నిద్రలేదు. మందులన్నీ విఫలమైనాయి. 1983 వ సంవత్సరంలో డాక్టర్ల సలహాపై మద్రాసు వెళ్ళి పరీక్షలు చేయించుకొని రావలెనని - ముందుగా శ్రీ స్వామి వారి సమాధి దర్శించిపోవాలని గొలగమూడికి వచ్చేందుకు బస్సెక్కినది మొదలు గతనెల రోజులుగా బాధించిన ఆయాసం పూర్తిగా లేకుండాపోయింది. గొలగమూడిలో మూడు రోజులుంటే ఆరోగ్యంగా ఉన్నాను. నా సామానులు సంచులకు సర్దగానే మరలా ఆయాసం మొదలైంది. ఈ క్షణంలో ఆయాసం లేకుండా పోతే ఉద్యోగం చేసి సాయంకాలానికి గొలగమూడికి వస్తానని చెప్పుకోగానే మరలా ఆయాసం లేదు. ఆయాసం తగ్గి హాయిగా కూర్చొని ఉన్నాను. ప్రక్కనున్న వెంకమ్మ అనే భక్తురాలికి వీపున మూట మోసుకొని పోతున్న గాడిద, కోనేటిమీదుగా పోతున్నట్లు దృశ్యం కనబడుతుందట. దాని అర్థమేమిటో చెప్పమంటుంది. మనలోని తెలివి తక్కువతనాన్ని గాడిదగా పోలుస్తుంటారు. గనుక మనలో ఎవరిదో తెలివితక్కువ తనాన్ని తరిమేస్తున్నారు స్వామి, అన్నాను. ఆ గాడిద వీపున ఉండే మూటేమిటి? అని ఆమె అడుగుతుంది. ఆ గాడిదను నేనేనని దాని వీపున ఉండే మూట నా సంచులలోని సామానని, సాయంకాలానికి ఎటూ నేను గొలగమూడి వస్తాను గనుక సంచులలో



సామాను తీసుకపోవడం వేస్టని వెంటనే ఆమెకు ఏమీ సమాధానం చెప్పకుండానే నా సంచులలోని సామాను తీసి ఎక్కడున్న దాన్ని అక్కడ పెట్టి ఆ సంచులలో ఒకటి ఆశ్రమం వారిది గనుక అది వారికి ఇచ్చేశాను. అంతేగానీ మా గ్రామం పోయి ఉద్యోగం చేసిరావడం అనేది గాడిదలాంటి నా ప్రవర్తన అని నా పాపమే నా నెత్తిన ఉండే మూటలాంటిదని దానిని గాడిద పైనున్న మూటని ఆమెకు చూపిస్తున్నారని నేను తెలుసుకోలేక పోయాను.

1989 వ సంవత్సరంలో నేను వాలంటరీ రాజీనామా చేసినాక కూడా పనులమీద వెళ్ళి తిరిగి సాయంకాలానికి గొలగమూడి వస్తున్నాను. ఒకరోజు పగలు 11 గంటలకు పూజకు పోవలసిఉంటే పోకుండా ఇంట్లో 12 గంటల వరకు మాట్లాడుతున్నాను. గంట తెలియలేదు. మందిరంలో పూజ చేసేందుకు పోవాలని గుర్తే లేదు. మందిరంలో పూజ తర్వాత గంట కొడితే అది విని మన లోకంలోకి వచ్చాను. అదిరి పోయాను. గంటచూస్తే పన్నెండయింది. ఇది 1993వ సంవత్సరం రిటైరైనాక పది సంవత్సరముల తర్వాత నాకు స్పష్టంగా ఇలా తోస్తుంది ఆ భయానక సందర్భమును గురించి. 1983 వ సంవత్సరం మూట వీపున మోసుకొని కోనేటి మీదుగా పోతున్న ఆ గాడిదను నేనే అని శ్రీ స్వామి వారు చెప్పారు. కానీ నేను దాన్ని పట్టించుకోలేదు. ఇక మీదట మాత్రం ఈ గాడిదలాంటి ప్రవర్తన మానాలి. కోనేటి మీదుగా పోతే గాడిదను గనుక ఇక కోనేరు దారి పోకూడదని నిర్ణయించుకున్నాను. ఆ విధంగా గాడిదలాగ కోనేరు గాటి పోతుండబట్టే ఈ రోజు పూజ చేసేందుకు పోకుండా ఇంట్లోకూర్చున్నాను. కోనేరు దాటి పోతే నీవు గాడిదతో సమానమని శ్రీ స్వామి వారు చెపుతున్నా నేను గత పది సంవత్సరముల నుండి తెలుసుకోలేదు. ఈనాటి నుండి ఇక దాటి పోకూడదని నా ఆత్మలో బోధించసాగారు. అంతటితో గొలగమూడి

వదలిపోవడం మానేశాను. సర్వసమర్థుడవైన సద్గురు రాయా, నీకివే నా సాష్టాంగ దండ ప్రణామములు.

## అన్నగారి అంత్యక్రియలు

"కోనేరు దాటిపోతే గాడిదతో సమానం" అని శ్రీ స్వామి వారు ఆదేశించడంతో ఎక్కడికీ పోకుండా గొలగమూడిలోనే ఉన్నాను. సంవత్సరానికి ఒక రోజు నవంబరు నెలలో నెల్లూరు బ్యాంకుకు వెళ్ళి లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చి వస్తున్నాను. ఒక నవంబరులో లైఫ్ సర్టిఫికెట్ కొరకు నెల్లూరు పోవాలని అన్నం సంచిలో పెట్టుకొని బయలు దేరి గేటు తీయబోయాను. సంచి యొక్క ఒక నాడ తెగిపోయి అన్నం బాక్సులోని మజ్జిగ, కొంత అన్నం క్రింద పడ్డాయి. అన్నం క్రింద పోవడంతో ప్రయాణం మానేసి ఇంట్లో కూర్చున్నాను. కూర్చున్న పదినిమిషాలలో మా అన్నగారు చనిపోయారని మనిషి వచ్చాడు. నేను నెల్లూరు పోయి ఉంటే ఈ వార్త నాకు అంది యుండదు. చివరిసారి మా అన్నగారిని చూచే భాగ్యం ఉండేది కాదు. బంధువులందరూ నన్ను మరోలాగ మాట్లాడేవారు. సర్వజ్ఞుడైన శ్రీ స్వామి వారు అది తప్పించేందుకే నన్ను నెల్లూరు పోకుండా ఆపారు. ఆయన అంత్యక్రియలకు హాజరై వచ్చాను.

నవంబరులో ఒకసారి గ్రామందాటి వెళ్ళాను. గనుక ఇక లైఫ్ సర్టిఫికేట్ కొరకు నెల్లూరు పోయే వీలులేదు. స్టేట్‌బ్యాంకులో పనిచేసే నా కుమార్తె మా అన్నగారు పోయినందుకు విచారింపుకు చెముడుగుంటకు పోకుండా గొలగమూడిలో ఉన్న నా దగ్గరకు వచ్చింది. నా లైఫ్ సర్టిఫికేట్ గురించి విని - ఆ సర్టిఫికేట్ మీద నా సంతకం చేయించుకొని తనకు తెలిసిన వారి ద్వారా బ్యాంకుకు పంపింది. ఏ ఇబ్బంది లేకుండా పెన్షను



వస్తుంది. కావలసిన ఏర్పాట్లన్నీ నేనడగకుండా శ్రీ స్వామి వారే చేస్తున్నారు. కానీ వారు కోరినట్లు నా మనస్సు నిరంతరం వారి ధ్యాసలో నిలుపలేకున్నాను. అది కూడా వారి కృపవల్లనే జరగాలని ఈలోగా సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవలు హృదయ పూర్వకంగా చేయడమే నా విధి అని నమ్ముతున్నాను.

## మిద్దె ఇల్లు కట్టడం

నా కుమారునికి లెక్కలు రావు. నీ తర్వాత ఆ పిల్ల వానిని ఆశ్రమం లోపల ఉండనివ్వరు. నీవుండగానే బయట చిన్న ఇల్లు కట్టిపెట్టమని ఆత్మీయులేగాక నా భార్య కూడా చెప్పసాగింది. తారురోడ్డు పక్కనుండే స్థలం కొనాలని శ్రీ స్వామి వారి దగ్గర చీట్లు పెడితే కొనమని వచ్చింది. కానీ ఆ స్థలము గల ఆమె రోడ్డు ప్రక్కన తానుంచుకొని మిగిలిన సగం ఇస్తానన్నది. శ్రీ స్వామి దగ్గర చీట్లు పెట్టాము గనుక ఊర్లో అంకణం వందరూపాయలుంటే ఈ స్థలం అంకణం ధర ఐదు వందలు పెట్టి కొన్నాను. ఇల్లు కట్టేందుకు డబ్బు లేదు.

ఒకప్పుడు శ్రీ భరద్వాజ మాష్టరు గారు వెయ్యి రూపాయలకు విద్యానగర్‌లో కొనిచ్చిన స్థలం యాభైవేలకు అమ్ముడుపోయింది. ఆ డబ్బు పెట్టి చిన్న రెండంకణముల ఇల్లు వేస్తే వచ్చిన యాత్రికులకైనా ఉపయోగపడుతుందని ప్రయత్నించాను. వచ్చిన వాస్తుశాస్త్రజ్ఞుడు ఇంటికి మొత్తం ప్లాను వ్రాసిస్తాను. నీ యిష్టమొచ్చినంత కట్టుకోమని వ్రాసి యిచ్చాడు. మా మామగారు - ఆ ప్లాను ప్రకారం ఇంటికి ఫౌండేషన్ వేసి పెట్టు నీకు డబ్బు కావాలంటే వడ్డీ లేకుండా ఇస్తానని బలవంతం చేయసాగాడు. శ్రీ స్వామి వారి కృప చెప్పనలవికానిది. ఇంటి ఫౌండేషన్ ఆరు అంగుళాల లోతు కూడా తెగలేనంతటి కఠినశిల పడింది.

ప్లింత్ బీమ్ వేసి ఇల్లు కట్టమని తెలిసినవారు చెప్పడంతో ఫౌండేషన్ల ఖర్చేలేకుండా పోయింది. ఇంటి నిర్మాణాని కయ్యే ఖర్చులో 1/4 వంతు తగ్గిపోయింది. ఫౌండేషన్ మొత్తం ఒకే బండ ఉండడం శ్రీ స్వామి వారి దయగాక మరేమిటి. అదే సమయంలో ఎప్పుడో యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా లో కట్టిన డబ్బు మెచ్యూరై యాభైవేలు చేతికి వచ్చింది. విద్యానగర్ స్థలం డబ్బుతో కలసి లక్షరూపాయలు సమకూడింది.

అనంత కరుణామయుడైన శ్రీ స్వామి వారు నయా పైసా ఖర్చు లేకుండా బేలుదారి మేస్త్రిని తీసుకవచ్చారు. నేను మొదట మాట్లాడుకున్న బేలుదార్లు కొన్ని కారణాల వలన రాకుండా మానేశారు. ఎవరిని పెట్టుకోవలెనబ్బా అని ఎటూ తేల్చుకోలేక మరలా శ్రీ స్వామి వారి వద్ద చీట్లు వేశాను. (1) మొదట మాట్లాడుకున్న బేలుదార్లనే ఎప్పుడైనా తీసుకవచ్చి చేయించాలి (2) శ్రీ స్వామి వారు పంపిన మనిషి వస్తాడు (3) మరొక వ్యక్తిని మనం చూచుకోవాలి. వీటిలో రెండవ చీటి వచ్చింది. ఈ విషయం విన్న ప్రతివాడు నవ్వడమే. ఎవరిని నీవు స్వామి పంపించిన వాడని తెలుసుకుంటావు. ఇలాంటి చీటి ఎట్లా పెట్టావు. అని అందరూ హేళన చేస్తున్నారు. నా విద్యార్థి నారాయణతో ఇలా చెప్పాను "రేపు ఉదయం ఏడు గంటలకు చేతిలో బేలుదారి తాడు పట్టుకొని ఎవరొస్తే వారే శ్రీ స్వామి వారు పంపిన మనిషని నమ్ముతాను" అని అన్నాను.

తెల్లవారి సరిగ్గా ఏడు గంటలకు బేలుదారి త్రాడుపట్టుకొని పరంధామయ్య వచ్చాడు. ఈ పరంధామయ్య నా విద్యార్థే. బేలుదారి పని చేస్తాడు. నేనే అతనిని శ్రీ స్వామి వారి దగ్గర కంటేపల్లి నుండి భిక్షాన్నం తెచ్చే పనిలో పెట్టాను. ఈయన అది మానేసి నాకు పనిచేస్తానంటే నేను వద్దనే వద్దన్నాను. ఈయన శ్రీ స్వామి వారి దగ్గర మూడు చీట్లు పెట్టాడట. (1) సుబ్బరామయ్య గారికి పని చేయడం



(2) కంటేపల్లి భిక్షాన్నానికి పోవడం (3) గొలగమూడి వదలి వెళ్ళిపోవడం. మొదటి చీటి వచ్చిందట. గనుక ఉదయాన్నే నాదగ్గరకొచ్చాడు. ఒక్క నయాపైసా డబ్బు తీసుకోకుండా అన్నం మాత్రం మా ఇంట్లో తింటు ఇల్లంతా పూర్తిగా కట్టిపోయాడు. శ్రీ స్వామి వారు ఎప్పుడు ఏమి చేస్తారోమనకు తెలియదు. సత్యం, ధర్మం తప్పకుండా సద్గురుసేవ చేయడమే మన ధ్యేయంగా పెట్టుకుంటే సర్వం వారే నడుపుతారు. ఇది నా అనుభవం.

పూర్వమున్న రేకులిల్లు వదలి ఈ క్రొత్త మిద్దెలోకి కాపురం మార్చాము. ఏదైనా సమస్య వస్తే రేకులింటికే పోవాలని తలచాను. కానీ ఏ సమస్య లేదు. పరిశుద్ధమైన మంచినీరు గల బావి. చుట్టు ప్రక్కల అందరికీ ఇదే ఆధారము. వచ్చిన యాత్రికులకూ ఇదే. ప్రక్కనే సాయి మాష్టర్ నిలయం కట్టించాను. ఈ బిల్డింగ్ నిర్మాణములో నేను ఒక ఆటబొమ్మను మాత్రమే. అంతా చేసింది శ్రీ స్వామి వారే. నాలుగు లక్షలు వ్యయంతో ఈ సాయిమాష్టర్ నిలయం కట్టించే శక్తి నాకు లేనే లేదు. ఆ కరుణామయుని దివ్య శక్తే దాన్ని పూర్తి చేసింది.

నీవు నిశ్చలంగా కూర్చో, అవసరమైనదంతా నేనే చేస్తాను, అన్న మాట ఇలాగే సత్యమైంది. నిశ్చలంగా కూర్చోమంటే నిష్క్రియంగా ఉండడం కాదు. అనవసరమైన ఆలోచనమాని, మానసిక టెన్షన్ మాని ఆ మహనీయుని స్మరించడం. మనం చేయవలసిన పనులు టెన్షన్ లేకుండా చేయడం.

శ్రీమతి గుజ్జం కోటేశ్వరమ్మ దగ్గర ఉత్తరం వైపు ప్లాటు ముప్పై అంకణాలు నేను, దక్షిణంవైపు ప్లాటు కోట గ్రామస్తుడు విజయభాస్కర్ ఒకేసారి కొన్నాము. కొన్నాక ఐదు సంవత్సరముల వరకూ ఇద్దరమూ

కట్టుబడి చేయలేదు. మేము అంకణం ఐదు వందల రూపాయలకు కొన్నాము. అంకణం వెయ్యి రూపాయలకైతే అమ్ముతాను అంటాడు విజయభాస్కర్. ఎవ్వరూ కొనలేదు. ఉత్తరం వైపు ఉన్న నా ప్లాటులో శంకుస్థాపన చేయాలని ముందురోజు గుంట త్రవ్వుతుంటే పది అడుగులలోతు వరకు గట్టి తగల్లేదు. ఆ స్థలంలో పూర్వం సుల్తాన్ బావి యనేది ఉండేదని, అక్కడ ఇల్లు కట్టడం కష్టమని అందరూ చెప్పడంతో త్రవ్వేపని ఆపేశాను. దైవఘటనగా తెల్లవారి మనం శంకుస్థాపన చేయవలసిన టైంకు విజయభాస్కర్ నుండి లెటర్ వచ్చింది. అందులోని సారాంశం - "కొన్నరేటుకే అమ్మేస్తాను" అని వ్రాశాడు. వెంటనే వెళ్ళి కొనేశాను. క్రొత్తగా కొన్న విజయభాస్కర్ ప్లాట్లులో ఫౌండేషన్ త్రవ్వాలంటే వీలే కాలేదు. ప్లాటంతా ఒకటే బండ. నీవు చాలా అదృష్టవంతుడివి. ఫౌండేషన్ లేకుండా ప్లింత్ బీమ్ వేసి ఇల్లు కట్టు. ఖర్చు 1/4 వంతు తగ్గిపోతుంది అన్నారు. అలాగే చేశాను. ప్లాటంతా ఒకే బండగా ఉండడం శ్రీ స్వామి వారి దయ మాత్రమేనని, నా ఘాఢమైన విశ్వాసం. అందువల్లే బిల్డింగ్ ఖర్చులో 1/4 వంతు ఖర్చు మిగిలిపోవడం శ్రీ స్వామి వారి దయగాక మరేముంది.

## సాయి మాష్టర్ నిలయం కట్టించడం

శ్రీ భరద్వాజ మాష్టరు గారు శరీరంతో ఉండగా గొలగమూడిలో తనకొకప్లాటు తీసిపెట్టమని భవిష్యత్తులో అకామిడేషన్ చాలా కష్టమని చెప్పేవారు. ప్లాటు కోసం నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఒకచోట కొనాలని ముందుగా డబ్బిస్తే మూడు సంవత్సరాల తర్వాత ఆ డబ్బు వాపస్ చేశారు. మరొకచోట అంకణం ఐదువందల రూపాయల చొప్పున కొన్నాను. కానీ పునాదులు తవ్వాలంటే ఐదు అడుగులు తవ్వినా గట్టిచిక్కలేదు. దాన్ని వదిలేశాను. దాని ప్రక్క ప్లాటులో కట్టే ప్రయత్నం



చేస్తే ఇల్లు కట్టే ఎనిమిదంకణములూ ఒకే బండ ఉంది, ఆరంగుళాలు కూడా పునాదులు తెగలేదు. ప్లింత్ బీమ్ వేసి ఇల్లు కట్టుకున్నాను. కనీసం పదివేల రూపాయల వరకు పునాదులకు ఖర్చు పెట్టవలసిన మొత్తం శ్రీ స్వామి వారు తప్పించారు.

మా మామగారికి కేన్సరు వచ్చి మద్రాస్ అడయార్ ఆస్పత్రిలో చేరి ముప్పై వేల రూపాయలు ఖర్చు మూడు నెలలు ఆస్పత్రిలో ఉండి బాగు చేయించుకొని వచ్చారు. సామాన్యంగా ఇకమీదట రాదు. వస్తే ఆస్పత్రికి రావద్దు. ఎంత ఖర్చు పెట్టినా మరణం తధ్యం అని చెప్పారు. ఒక సంవత్సరానికి అదే కాలు బొటనవేలు దాని ప్రక్క వేలుకు మధ్య వచ్చింది. ఇక ఆస్పత్రికి పోయినా నేను బ్రతకనని - పెండ్లికాని ఇద్దరమ్మాయిల కొరకు ఉంచిన డబ్బు ఆస్పత్రిలో ఖర్చు పెట్టి చనిపోతే వాళ్ళు అనాధలవు తారని ఆయన ఆస్పత్రికి పోకుండా ప్రతి శనివారం గొలగమూడికి వచ్చి శ్రీ స్వామి వారికి కన్నీటితో విన్నవించు కునేవాడు. ఒక వారానికి కేన్సరు లేకుండాపోతే ఒక కిలో సుండలు సమర్పిస్తానని మొక్కుకున్నాడు. ఎంత చిత్రమో, ఈ వారం చెప్పుకుంటే మరసటి శనివారానికి ఆ కాన్సరు గడ్డ మాయమైంది. కనీసం విభూతి కూడా పూయలేదు. ఒక్క పైసామందు వాడలేదు. అది మొదలు ఆయనకు గొలగమూడిలో భక్తులకొరకు ఒకరూము కట్టించాలనే కోరిక మొదలైంది. కాని వారి భార్య అంగీకరించేది కాదు. షడన్‌గా ఆమె చనిపోయింది. పునాదులు లోతుగా త్రవ్వాలని వదిలేసిన స్థలం అట్లాగే ఉంది. నీవు రూము కట్టేటట్లయితే నేను స్థలం ఫ్రీగా ఇస్తాను కట్టమన్నాను. ఆయన శంకుస్థాపన చేయాలని రెండుమార్లు ప్రయత్నిస్తే జరుగలేదు. మూడవ సారి నన్నే చేయమన్నారు. నేనొక వాస్తు తెలిసినతనిని తీసుకవస్తే - సుబ్బరామయ్య ఈ స్థలంలో మొత్తం ఎంత వరకు కట్టుబడి చేయవచ్చునో అంత ప్లాను గీచి ఇస్తాను. అందులో మీ శక్తి వరకు

క్రమంగా కట్టుకోండి. నేను అమేషా రావాలంటే కుదరదని చెప్పి స్థలం మొత్తం బావితో సహా కాగితం పై ప్లాను గీచి భూమి పై ముగ్గు పోసి వెళ్ళాడు. నేను ఈశాన్యవైపున శంకుస్థాపన చేశాను. మరుసటిరోజు మా మామగారు వచ్చి భూమిపై సున్నం పోసినదాన్ని చూచి, ఇంత పెద్దదాన్ని నేను కట్టించగలనా అని బాధపడ్డాడు. నీవు కట్టగలిగిన దాన్ని నైరుతీ మూలనుండి కట్టు మిగిలినది భవిష్యత్తులో శ్రీ మాష్టరుగారు కట్టిస్తారు అని చెప్పాను.

నలభై యాభై వేలు ఖర్చు పెట్టదలచిన ఆయన మనసు ఎలా మార్చారో శ్రీ స్వామి వారు, నా చేతికి ఒక లక్ష ముప్పైవేలు ఇచ్చి ప్లానంతా కట్టించు డబ్బంతా నేనే ఇస్తానన్నాడు. కట్టుబడి సగానికి వచ్చింది, ఈ విషయం మిగతా అల్లుళ్ళకు తెలిసింది. ఆయనకు మగపిల్లలు లేరు. వారు అడ్డం కొట్టడంతో ఇక నేను డబ్బు ఇవ్వలేనన్నాడు. డబ్బులేక స్లాబు వేశాక ఆరు నెలలు బీడు పెట్టాము. ఎవ్వరేమన్నా అప్పుచేసి కట్టేదిలేదు. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్నారు. ఎండకు వానకు మేకలు, గాడిదలు తలదాచుకుంటాయి. అవి కూడా శ్రీ స్వామి వారి రూపాలేననుకొనేవాణ్ణి. ఒక్కపైసా అప్పు చేయకుండా భక్తుల సహకారంతో పనంతా పూర్తిచేయించారు. శ్రీ స్వామి వారి సర్వ సమర్థత్వం నిరూపించారు. నేనొక్కరిని కూడా ఒక్క పైసా ఇమ్మని అడుగలేదు. అంతా వారి దయే.

## శ్రీ సాయి మాష్టర్ నిలయంలో అధర్మపరులను నాకు చూపడం

**ఒక వ్యభిచారతను:** ఒక వ్యక్తి యొక్క నడవడి మంచిది కాదు గనుక సాయి మాష్టర్ నిలయంలో నుండి తరిమేయమని చాలామంది



చెపుతున్నా నా మనసు అంగీకరించలేదు. అతని కష్టాలకొద్దీ ఏదో శ్రీ స్వామి వారి నీడన బ్రతకాలని వస్తే అతనిని మనం తరిమేయడం మంచిది కాదని ఉపేక్షించాను. ఒకరోజు మసక చీకటి, నేనొక కూలివాని లాగ వేషంతో ఇటుకలు ఎత్తుతున్నాను. అతను నన్ను గమనించలేదు. ముందు ఒక ఇరవై సంవత్సరాల అమ్మాయి ఆ తర్వాత ఈ వ్యక్తి సాయి మాష్టర్ నిలయంలోకి పోతున్నారు. మరుక్షణంలో ఇతను ఆమెను ఇక్కడ వదిలేసి వెళ్ళిపోయాడు. అందరు చెప్పే కంప్లెయింట్స్‌ను బట్టి నాకు బాగా అనుమానం వచ్చి ఆమెను నా భార్య దగ్గరకు తీసుక వెళ్ళి నీవెవరు, ఇక్కడకెందుకొచ్చావు. నిన్నిక్కడకు తీసుకవచ్చినాయనతో నీకేమిటి సంబంధం అని ప్రశ్నిస్తే - తనది ఫలానా గ్రామమని, స్వామి దగ్గర కొచ్చానని, రాత్రికి పడుకునేందుకు స్థలం చూపించమని అడిగితే అతను ఇక్కడకు తీసుకవచ్చాడని చెప్పింది. నీవు పెండ్లిగాని పిల్లవు, ఇంతదూరం వంటరిగా వచ్చావు. ఇక్కడ నీకు స్థలం చూపించాలంటే ముసలి ముతక వ్యక్తులుగాకుండా ఇరవైఐదేళ్ళ కుర్రాడే దొరికాడా? ఈ ప్రక్క కొస్తే నీ కొప్పు కోసేస్తా జాగ్రత్త. వెంటనే వెళ్ళిపో అని కేకలేశాను. ఇక కనిపించింది కాదు. అతని అల్మరా ఖాళీ చేయించి తరిమేశాను. అతడామెను తీసుకరావడం నా కంట్లోనే పడేటట్టు చేసింది శ్రీ స్వామి వారేనని నా నమ్మకం.

మరొకతను పర్మినెంటుగా సాయి మాష్టర్ నిలయంలో ఉంటున్నాడు. ఇతను అందరి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నా డని అందరూ చెపుతున్నా నేను ఉపేక్షిస్తున్నాను. ఒకరోజు ముగ్గురు తాగుబోతులు ఫుల్‌గా త్రాగి వళ్ళు తెలియని స్థితిలో వారి సంచులు ఈ వ్యక్తి మోసుకొచ్చాడు. అప్పుడు టైం రాత్రి పదిన్నర గంటలు. ఈ త్రాగుబోతులు చొక్కాలు విప్పేసి క్రింద పడి దొర్లుతున్నారు. మూలుగు తున్నారు. చెడ్డవాసన. ఆడవాళ్ళంతా అదరిపోయి లేచి

కూర్చున్నారు. వాళ్ళలో ఒకామె ఈ విషయం నా భార్యకు చెప్పింది. అప్పటికే నేను నిద్ర పోతున్నాను. తెల్లవారి ఆరుగంటలకు నేను ఉదయహారతికి సాయి మాష్టర్ నిలయంలోకి పోతుంటే ఈ విషయం నా భార్య నాకు చెప్పింది. నేను వెళ్ళేసరికి ఆ త్రాగుబోతులు ముందు పోతున్నారు. ఈ వ్యక్తి వాళ్ళ సంచులు మోసుకొని వాళ్ళ వెనుక పోతున్నాడు. ఈ గౌరవనీయమైన వ్యక్తి ఏమిటి, ఆ త్రాగుబోతుల సంచులు మోయడమేమిటి? అందరూ ఇతను డబ్బు గుంజుతున్నాడనే మాట నాకు చెపుతున్నారు. అది నిజమేనని రూఢి అయింది. వెంటనే అతనిని ఖాళీ చేయించి తరిమేశాను.

ఇదే విధంగా మరి ఇద్దరు వ్యక్తులు ఇక్కడ ఉండ తగరని ఎందరు చెప్పినా నేను పట్టించుకోవడం లేదు. సరిగ్గా ఆ వ్యక్తులు బాతాఖానీ చేస్తూ ఉండేటప్పుడే నా కంట్లో పడాలా! ఒకటి రెండు వార్నింగులిచ్చాను. వాళ్ళు తమ ప్రవర్తన మార్చుకోలేకపోయారు. వాళ్ళనూ తరిమేశాను.

మరొకతను ఏమి మాట్లాడేదీ తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు అని సాయి మాష్టర్ నిలయంలో హారుతు చేస్తూ తాళాలిస్తుండే ఉద్యోగి చెపుతూనే ఉన్నాడు, నేను ఉపేక్షిస్తూనే ఉన్నాను. ఒక రోజు వాళ్ళిద్దరూ ఘర్షణ పడుతున్నారు. అలాంటి సమయలలో నేనచ్చటికి పోయే అలవాటు లేదు. ఈ క్షణంలో అరుచుకుంటారు మరలా ఒకటైపోతారు. అలాంటిది కరెక్టుగా నేను వెళ్ళే సమయంలో "నీవు అడక్కదొబ్బుతూ వచ్చావురా" అని అవతల వ్యక్తి సాయి మాష్టర్ నిలయం ఉద్యోగిని అనడం స్వయంగా నా చెవులతో విన్నాను. వెంటనే ఆ వ్యక్తిని సాయి మాష్టర్ నిలయం నుండి తరిమేశాను. అంతే కాకుండా ఎప్పుడూ ఇక్కడికి రావద్దని చెప్పాను. ఈ విధంగా సర్వప్రేరణాధికుడైన శ్రీ స్వామి వారు నా సర్వ భాధ్యతలు వారే వహించి నడిపిస్తున్నారు. పై మూడు



సన్నివేశాలేగాక లెక్కలేనన్ని సన్నివేశాలలో ఆదుకుంటున్నారు. నేను వారి చేతిలో తెడ్డులాంటి వాడను అనే భావం చెదిరి పోకుండా వారి సేవ చేసే భాగ్యమిమ్మని వారిని ప్రార్థిసున్నాను.

## శ్రీ సాయి మాష్టర్ నిలయం ముందున్న స్థలం కొనిపించడం

శ్రీ సాయి మాష్టర్ నిలయానికి ఉత్తరాన ఉండే స్థలం అమ్ముతున్నారు. ఆ వ్యక్తి అప్పులున్నాడు. చివరిదశలో ఉన్నాడు. అప్పులలో చనిపోకూడదని అ స్థలం అమ్మి అప్పులు తీర్చాలని అతని ఉద్దేశ్యం. కానీ దానిని కొనేందుకు ఎవ్వరూ ముందుకు రాలేదు. నన్ను కొనమని అనేక మందిచేత చెప్పిస్తున్నాడు. నా దగ్గర డబ్బులేదు. అప్పు తెచ్చికొనడం ఇష్టంలేదు. డబ్బు లేకుంటే నేనిస్తాను కొనమంటాడు ఒక ఆసామి. ఒక్క నెలరోజుల తర్వాత కాస్త మెత్తబడ్డాను. అంకణం రెండు వేల రూపాయలకిస్తే కొంటానన్నాను. చివరకు రెండు వేల రెండు వందల రూపాయలకు కొనేశాను. డబ్బు లేదు గనుక మా తల్లి గారికి వాళ్ళ అమ్మగారు ఇచ్చిన బంగారు దండ ఎనిమిది సవర్లది అమ్మి మిగిలిన డబ్బు ఎట్లానో సమకూర్చి పెట్టారు శ్రీ సాయి మాష్టర్‌గారు. ఆ స్థలం కొనకుంటే ఈనాడు వచ్చే యాత్రికుల సంఖ్యకు - మురుకినీరు పోయే ఏర్పాటు లేక చాలా ఇబ్బంది పడవలసి వచ్చేది. ఇప్పుడు ఆ స్థలం ఉంది గనుక అరటి చెట్లు వేసి వాటికి ఆ మురికి నీరు పారిస్తున్నాము గనుక ఎన్ని నీళ్ళు పోసినా ఇబ్బంది లేకుండా ఉంది. శ్రీ స్వామి వారికి ఈ ఇబ్బంది తెలిసే నా చేత ఆ స్థలం కొనేటట్లు చేశారు. ఈ విషయంలో ఆ మహనీయునకు శతకోటి వందనాలు. ఆ స్థలం లేకుంటే సాయి మాష్టర్ నిలయం కట్టిగూడ నిష్ప్రయోజనమై ఉండేది.

# శ్రీ సాయి మాస్టర్ నిలయం పై మిద్దెకు యుగందర్‌ను డబ్బుడుగుట

2003 వ సంవత్సరంలో శ్రీ సాయి మాస్టర్ నిలయం పైన అంతస్తు వేస్తున్నాను. అర్వై వేల రూపాయలు కావాలి. బ్యాంకులో అప్పుతేవాలని మా అల్లుణ్ణి అడిగి P.N.B. లో ఇప్పిస్తానంటే కాగితాలన్నీ నా భార్య సంతకాలతో రెడీచేశాను. రేపో ఎల్లుండో నెల్లూరు వెళ్ళి లోన్ తేవాలి. శ్రీ స్వామి వారి మందిరం పూజారీ ప్రక్కన మెయిన్ గేటులో లడ్లు అమ్మే అంగడిలో మా అన్న కుమారుడు యుగందర్ ఉన్నాడు. వాడు ఇల్లు కట్టాలనే ప్రయత్నములో ఉన్నాడు గనుక వాణ్ణి డబ్బు అడిగినా ప్రయోజనముండదని అడగదలచలేదు. 11 గంటల పూజకు మందిరంలోకి పోతూ యుగందర్ డబ్బులుంటే అర్వై వేలు ఇస్తే నీకు రెండు నెలలలో ఇస్తాను అని తమాషాకు అడిగాను. అతని జేబులో అర్వై వేలరూపాయలు ఉన్నాయి. అవి బ్యాంకులో S.B. అకౌంట్‌లో వేసి పెట్టాలని పోబోతున్నాడు. నిజంగా కావాలా? బ్యాంకులో వేయాలని పోతున్నాను. కావాలంటే తీసుకో. మీ ఇంట్లో ఇవ్వమంటావా అన్నాడు. ఇంటిలో ఇచ్చేశాడు.

అతను నా దగ్గర వడ్డీ లేకుండా అనేక సార్లు తీసుకున్నాడు. ఇప్పుడు మనం వడ్డీ ఇవ్వనక్కరలేదు. రెండు నెలలకు పోష్టాఫీసులో నా బాండ్లు మెచ్యూర్ కాగానే అతనికి ఇచ్చేస్తాను. గనుక బ్యాంకులో వడ్డీ కట్టే ప్రశక్తే లేదు. సర్వసాక్షియైన శ్రీ స్వామి వారికి నా అవసరం తెలుసు. అతని దగ్గర డబ్బు ఉందని తెలుసు. నేనడిగితే ఇస్తాడని తెలుసు. తమాషాగా నా చేత అడిగించి డబ్బు ఇప్పించి వడ్డీలు కట్టే పని లేకుండా చేశారు. స్మృతి రహిత ప్రసన్నులంటే ఇదే కదా! ఆ వ్యక్తి అప్పు ఇచ్చేటట్లు



చేయమని మనం శ్రీ స్వామి వారిని ప్రార్థించకపోయినా మనకవసరమైంది వారే సమకూరుస్తున్నారు.

# ఆరాధన పనులు కావని భయపడుతుంటే తిరుత్తణి నుండి మనిషిని తీసుకవచ్చుట

2003 వ సంవత్సరం ఆగష్టు 24 వతేది ఆరాధన. అప్పుడే సాయి మాష్టర్ నిలయం పై మిద్దె వేస్తున్నాము. లెక్కలేనన్ని పనులు ఉన్నాయి. వచ్చినవాళ్ళు స్నానాలు చేసి శ్రీ స్వామి వారి మందిరానికి పోయేవారే గాని ఒక్క పనికి సహకరించరు. నేను ఇంతకు ముందులాగా ఏ పని చేయలేను. K. ప్రసాద్ గారు - తిరుత్తణి - మంచి కష్టజీవియైన రైతు. ఏదో కంపెనీలో పనిచేస్తూ మనసు బాగలేక కట్టు బట్టలతో శ్రీ స్వామి వారి దగ్గరకు వచ్చేశారు. జేబులో చిల్లి గవ్వలేదు. స్వామి వారి సంస్థానమునకు పోతే టైం అయిపోయిందని అన్నం పెట్టలేదు. బ్రహ్మం గారి మఠంలోకి వచ్చి కూర్చున్నారు. వారికి ఎంత ఆకలిగా ఉందో పాపం అక్కడ ఉన్న ఒకామెను కొంచెం అన్నం పెట్టించమని అడిగారు. అయ్యో! మాదీవూరు కాదే నాయనా అన్నది. ప్రక్కనుండే మహా తల్లి పది రూపాయలిచ్చి బజారుకు వెళ్ళి ఏమైనా తిని రమ్మన్నది. వారు తిని వచ్చాక నాతో పరిచయమైంది. శ్రీ సాయి మాష్టర్ నిలయంలో పడుకోమన్నాను. అలా పరిచయమైన K.ప్రసాద్ గారు నేను చెప్ప కుండానే ఎన్నెన్ని పనులు చేశారో చెప్పలేను. బావికి గిలక వేయాలి. మరొకరైతే నన్ను ఉండి చూస్తుండమంటారు. ప్రసాద్ గారు కావలసిన పనిముట్లు ఇచ్చేస్తే ఇక మనం ఉండకుండానే గిలక వేశేశారు. అంతకు ముందే కుళాయి లైను వేసి రోడ్డంతా గుంటలు మిట్టలుగా ఉంది. మనం చెప్పకుండానే శుభ్రంగా చదును చేశారు. ఇంటిచుట్టూ పిచ్చి మొక్కలు

బలిసిపోయాయి. రెండు రోజులలో అద్దంలాగా చేశాడు. ఎదురు మిద్దె వేణుగోపాల్ గారిది. దాని శుభ్రం చేయించి వచ్చిన భక్తులకు వసతికి యోగ్యం చేశాడు. శ్రీసాయి మాష్టర్ నిలయంలో అన్నదానం జరుగుతుంది. వంట చేసే చోట, వడ్డన జరిగేచోట ఎంత సహాయం చేశారో. హృదయపూర్వకంగా సేవా భావంతో సేవచేసే వ్యక్తిని శ్రీ స్వామి వారు సమయానికి తీసుక రావడం ఎంత చిత్రమో చూడండి. మనం శ్రీ స్వామి వారికి సంపూర్ణ శరణాగతి చేస్తే వారి లీలలు బాగా అర్థమౌతాయి.

## 2003 ఆరాధనకు శ్రీ సాయి మాష్టర్ నిలయంలో అన్నదానం

2002 వ సంవత్సరం వరకు ప్రతి సంవత్సరము ఆరాధనకు నెల్లూరు జయమ్మ, జయచంద్రారెడ్డిగారు శ్రీ సాయి మాష్టర్ నిలయంలో అన్నదానము చేస్తుండేవారు. 2003 వ సంవత్సరములో వారు భరద్వాజ ఆశ్రమము అని ఒక బిల్డింగ్ కట్టి అక్కడ అన్న సంతర్పణ చేయ నిర్ణయించుకున్నారు. శ్రీ సాయిమాష్టర్ నిలయంలో అన్న సంతర్పణ చేయాలంటే నాకు శక్తి లేదు. ఆర్థిక వసతి కాదు. చేసే మనుషులు కావాలి. వారి తోటి తిరుగుతూ కార్యం నిర్వర్తించాలి. నేను చేయలేనని తీర్మానించుకొని అన్న సంతర్పణ మానేశాను. పరమ కరుణానిధి యైన శ్రీ స్వామి వారు ఖమ్మం జిల్లా, దమ్మపేట గ్రామములో పసుమర్తి నాగమణి గారికి ప్రేరణ పెట్టి రప్పించారు. ఆమె గొలగమూడి వచ్చేటప్పుడు బియ్యం సామాను, పాత్ర సామాను తనతో కూడా తెచ్చుకున్నది. ఉదయం టిఫిను, మధ్యాహ్నం రాత్రికి భోజనాలు ఎంతో చక్కగా చేశారు. అలా మూడు రోజులు అన్న సంతర్పణ జరిగింది.



అదే సమయంలో సాయి మాష్టర్ నిలయం పై అంతస్తు ప్రారంభోత్సవం చేశాము. శ్రీ మాష్టరు గారు, శ్రీ సాయి, శ్రీ స్వామి వారిని చిత్ర పటాల రూపంలో ఆసీనులజేసి టెంకాయ కొట్టి భజన చేయడమే ప్రారంభోత్సవము. కరపత్రాలు, ఆహ్వానాలు ఏమీ లేవు. ఆ మహనీయులు వచ్చి ఆసీనులయ్యాక ఇక వేరే ప్రారంభోత్సవాలెందుకు. ఆ విధంగా శ్రీ స్వామి వారే అన్న సంతర్పణ లేదనుకుంటే ఒక్కమాట కూడా నా వైపు నుండి లేకుండానే అన్న సంతర్పణ చేయించారు.

## శ్రీ బ్రహ్మం గారి మఠం పునరుద్ధరణ, సత్సంగాలు - స్వప్నాలు

ఏ పనైనా భగవంతుడు మనచేత చేయిస్తాడు. మనం చేశాము అనుకోవడం అజ్ఞానము మరియు అహంకారానికి గుర్తు. గత పదిహేను సంవత్సరములుగా నేను గొలగమూడిలో కాపురముంటున్నా శ్రీ బ్రహ్మం గారి మఠముండే ప్రాంతానికి ఎప్పుడూ పోలేదు. ఒక రోజొక కూలి మనిషి కావలసియుండి మఠం దగ్గరకు వెళ్ళాను. ఆ మనిషి లేడు. ఎక్కడికి పోయాడా అని నాలుగు వైపులా చూస్తుంటే పడిపోయిన పూరిల్లు ఆ ఇంటి ముందు ఎర్రగా ఉన్న మందార పూవ్వుగల తులసి చెట్టు నన్నాకర్షించింది. నేనా తులసి చెట్టు దగ్గరకుపోయాను. పడిపోయిన పూరింటి లోపల శ్రీ బ్రహ్మంగారి విగ్రహం కాషాయరంగు గుడ్డలతో దేదీప్యమానంగా విరాజిల్లుతున్నాడు. పడిపోయిన ఇంటి కప్పు ఆ విగ్రహం తలపైన ఒక్క అంగుళంలో నిలచిపోయి ఉంది. ఆ తాటి దబ్బలు ఒక్క అంగుళం క్రిందికి జారితే విగ్రహం తలకు ముప్పు వాటిల్లేదే. అలా జరుగలేదంటే అది శ్రీ బ్రహ్మంగారి మహిమేనను కున్నాను. గ్రామంలోని మందిరాలు బీడుపెట్టడం ఆ గ్రామానికి

అనర్ధమని శాస్త్రాలు చెపుతాయి. ఒక వెయ్యిరూపాయలు ఖర్చు పెట్టయినా ఈ పూరింటిని మరలా నిలబెడితే మంచిదని తలచాను. ఒక రైతునడిగి ఏడు మోపుల తాటాకు వాళ్ళచేలో కొట్టించి అది మఠానికి చేర్చేందుకు పదిహేను రోజులు పట్టింది. బండి దొరికితే ఎద్దులు దొరకవు. ఇవి రెండు దొరికితే మనిషి దొరకడు. ఒక్క సంవత్సరం మనం కప్పేందుకే ఇంత కష్టమైతే ఇక ప్రతిసారి కప్పుకోవడం ఎంత కష్టమౌతుంది. గనుక సిమెంటు రేకులు వేయించాలని మూడు రేకులు తెప్పించాను. అప్పటికే ఒక నెల గడచిపోయింది.

అదే సమయంలో శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడి వస్తుంటే వారా స్థలంలో పాదం పెడితే పని త్వరగా అవుతుందని వారినాస్థలము చూడమని ఆహ్వానించాను. శ్రీ బ్రహ్మం గారు వారి గురువుగారట. వారు వెంటనే అంగీకరించి వచ్చారు. రేకులే వేయవద్దు. స్లాబు వేయి అన్నారు. డబ్బులేదు స్వామి అంటే ఇంటికొక పూవు దేవునికొక మాల అన్నారు. డబ్బు అదే వస్తుంది. ఆరు కమ్ములు పది బస్తాల సిమెంటు అయితే చాలు, అన్నారు. బావిలో నీరులేక పని ఆగిపోయింది. శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడిలో బ్రహ్మంగారి మఠం కడుతున్నారు. చూచిపొమ్మని ఒక భక్తుని పంపారు. వారికి నా దగ్గర డబ్బు లేని సంగతి, శ్రీ దర్గాస్వామి వారి ఆదేశము అన్నీ చెప్పాను. సిమెంటు, కమ్మి నేనిస్తాను. మిగిలినవి మీరు చూడండి అని మూడవనాడు 60 కమ్ములు ముప్ఫైబస్తాల సిమెంటు పంపారు. చాలకుంటే ఇంకా ఇస్తానన్నారు. ఆ ప్రక్కనే మా అన్న కుమారుడు మిద్దె కడుతూ నా మిద్దెకు స్లాబు పోసేరోజు మఠం కూడా స్లాబుపోయాలని 300 అడుగుల దూరం రబ్బరు పైపులు జాయింటు చేసి నీళ్ళు సప్లయి చేసి స్లాబు పోయించాడు. మిగిలిన పనులు పూర్తయ్యాయి.



శ్రీ దర్గాస్వామి వారే ప్రారంభం చేశారు. నిత్యపూజ నైవేద్యానికి కొంత ధనం బ్యాంకులో వేయమని సలహా చెప్పి ప్రారంభోత్సవంనాడే షుమారు పాతికవేలు విరాళాలుగా వారే స్వీకరించారు. ప్రస్తుతం ఎనభై వేలు బ్యాంకులో వేశాము. మూడు సంవత్సరములలో అది లక్షకు పైన అవుతుంది.

మఠం పని పూర్తికావాలని మొదటినుండి ఒకరిద్దరితోనైనా పారాయణ సత్‌సంగము చేసేవాణ్ణి. పని పూర్తయ్యాక నాకు శ్రద్ధ తగ్గి అప్పుడప్పుడూ మఠానికి రాకుండా మానేసేవాణ్ణి. నిత్యం సాయంత్రం 4 గంటలు - 5 గంటలు మధ్య మఠంలో సత్‌సంగం జరిగేది. ఒకసారి వరుసగా మూడురోజులు ఒకే స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నన్నెక్కడికో ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆ స్కూలులో విధ్యార్ధులే హాజరు కావడం లేదు. శ్రీ వెంకయ్య స్వామిని గూర్చి కొంచెం సేపు చెపుతాను రండి అని మిగిలిన టీచర్లును కూర్చో బెట్టుకొని సత్సంగం జరిపినట్లు మూడు రోజులు ఒకే స్వప్నం రావడంతో - శ్రీ స్వామి వారు నన్ను మఠంలోనే సత్‌సంగం చేయమని ఆదేశిస్తున్నారని నిత్యం 4 - 5 గంటల మధ్య మఠంలోనే సత్‌సంగం చేస్తున్నాను. స్వప్నాలు ఇవ్వడమేగాక వాటి అర్ధం ఇది అని గుర్తించి నాచేత ఆచరింపచేస్తున్నారు.

## పడి నా చెయ్యి విరిగింది.
## ఏ వైద్యం లేకుండా శ్రీ స్వామి వారే సరి చేశారు

2002 సంవత్సరంలో గోడఎక్కి బేలుదారి పని చేస్తుంటే నన్ను దారం పట్టుకోమన్నాడు. నేనూ వెదురుపేళ్ళ తడిక మీద కూర్చొని దారం పట్టుకొని యున్నాను. కాలి క్రింద ఉండే వెదురు పెండె విరిగి క్రింద

పడ్డాను. కుడి చేతి మణికట్టు విరిగిందో బెణికిందో తెలియదు గానీ మోచేతి నుండి మొత్తం వాచిపోయి వేళ్ళు కదలించలేనంతగా వాచిపోయి చెయ్యి కదలిస్తే విపరీతమైన నొప్పి. దిండు పైన దిండు వేసుకొని చెయ్యిదాన్నిపైన పెట్టుకొని పడుకున్నాను. ఎంతసేపు కదలకుండా ఉండగలము. సున్నం వేయడంలాంటి చిన్న చిన్న వైద్యాలు చేస్తున్నాను. తగ్గడం లేదు. అందరూ నెల్లూరు వెళ్ళి ఫోటో తీయిస్తే విరిగిందా, బెణికిందా తెలుస్తుందంటారు. గొలగమూడి కోనేరు దాట కూడదని శ్రీ స్వామి వారి ఆజ్ఞ. గత ఆరు సంవత్సరాల నుండి అలాగే ఉన్నాను. ఇప్పుడు ఈ నొప్పికి బాధపడి నెల్లూరు పోతే శ్రీ స్వామి వారి ఆజ్ఞను ఉల్లంగించినట్లవుతుంది. నెల్లూరుపోతానే నొప్పి పోతుందా? వారు పోగొట్టాలంటే ఊరకే పోగొట్టగలరు అని నెల్లూరు పోవడం మానేశాను. చెయ్యి బాగవకుంటే అదే శ్రీ స్వామి వారి ఆజ్ఞ అని సంతోషంగా ఉండడమే మంచిదని తలచాను. మా ప్రక్కింటివారు బ్యాంకుకు వెళ్ళి మీ మామగారికి ఎలా ఉందన్నారు మా అల్లుడుగారితో. మా మామగారి కేమైందని అడిగి తెలుసుకొని వెంటనే గొలగమూడి వచ్చి కారు తీసుక వస్తాను, నెల్లూరుకెళ్ళి ఫోటో తీయించుక వస్తామంటాడు. నేను రానని మొండికేశాను. చేసేదిలేక వెళ్ళిపోయాడు. కుమార్తె వచ్చినా అదే పాట.

ఆ కరుణామయుని దయవల్ల ఒక నెలలో ఏ బాధ లేకుండా ఏ పిండికట్లు కట్టకుండా పైసా ఖర్చు కాకుండా చెయ్యి మామూలైంది. ఇప్పుడు వ్రాతపనేకాక గడ్డపార, పార లాంటి వాటితో కూడా పని చేస్తున్నాను. కాలిలోని ఎముక ముక్కలు విరిగి బయటికొచ్చినప్పుడే ఏ కట్టులేకుండానే బాగుచేసిన స్వామికి ఈ చెయ్యిని బాగు పర్చడమొక లెక్కా. నేను నెల్లూరు పోతానో లేదో చూడాలని ఈ చిన్న సన్నివేశం కల్పించారు, ఆ కరుణా మయుడు. "వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది" అన్నారు గదా శ్రీ స్వామి వారు.



# హ్యూమానిటేరియన్ మిషన్ నుండి విరమింపజేయడం

శ్రీ స్వామి వారి ఆశ్రమ కమిటీ పేరు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి హ్యూమానిటేరియన్ మిషన్. ఇందులో నేనుకూడా కమిటీ సభ్యుడను. కమిటీలో పార్టీలు ఏ నిర్ణయం చేయాలన్నా మంచిగానీ, చెడుగానీ ఆయా పార్టీల బలం ప్రధానంగానీ శ్రీ స్వామి వారి నిర్ణయం ప్రధానం కాకుండా వచ్చింది. దేన్నికైనా రహస్య ఓటింగు పెట్టమంటే అంగీకరించరు. చేతులు ఎత్తాలంటారు. ఈ తలకాయ నొప్పివలన రాజీనామా చేయాలని మూడు మార్లు చీట్లువేస్తే వద్దని వచ్చింది. ప్రస్తుతం కమిటీ మీటింగే పెట్టకుండా మూడు సంవత్సరాలనుండి కొన్ని లక్షలు ఖర్చుపెడుతున్నారు. ఇదంతా చూసిన ఒక స్వామి భక్తుడు కోర్టులో కేసు వేశాడు. అతని మొదటి అభియోగం మూడు సంవత్సరాలనుండి కమిటీ మీటింగే లేకుండా లక్షలు ఖర్చు పెడుతున్నారు. రెండవ అభియోగం వచ్చిన భక్తులకు బాత్‌రూంలు, లెట్రిన్స్ లేకుండా ఒక బిందెడు కోనేటి నీళ్ళు 1 రూపాయికి అమ్ముకుంటున్నారు. కమిటీ మీటింగు లేదనేందుకు ఆధారమేమిటని అడిగారు. నన్ను కమిటీ మీటింగుకు పిలచి మూడు సంవత్సరములైంది అని నేను వ్రాసి ఇచ్చాను. ఆ కాగితం అతడు కోర్టులో దాఖలు చేశాడు. ఈలోగా గత మూడు సంవత్సరాలు మీటింగులు జరుగుతున్నాయని రిసల్యూషన్స్ వ్రాసి నన్ను చేవ్రాలు పెట్టమన్నారు. నేను పెట్టలేదు. అంతటితో హ్యూమానిటేరియన్ మిషన్‌కు నాకు సంబంధం తెగిపోయింది. నేను రాజీనామా చేయకుండానే కమిటీనుండి తొలగింపచేశారు శ్రీ స్వామి వారు. త్రికాలవేత్తయైన శ్రీ స్వామి వారికి జరుగబోయే కోర్టు కేసు తెలిసే నన్ను కమిటిలో ఉంచి మీటింగులు జరగడం లేదని నా కాగితం ద్వారా కోర్టులో రూఢీ చేయించారు.

## నా చేతిలోని టవల్‌ను ప్రసాదం పొట్లమనుకోవడం

మందిరంలో పూజ చేయడానికి పోయేటప్పుడు చిన్న టవల్ మడిచి చేత పట్టుకొని పోతుంటాను. మందిరం నుండి ఏమీ తీసుకపోడని కొందరంటే మరి కొందరు అదేమీలేదు నిత్యం ప్రసాదం తీసుకపోతాడని మరికొందరనుకొంటారు. ఒక రోజు నేను రోడ్డున పోతుంటే ఒక స్నేహితుడు "మాకు కొంచెం ప్రసాదం పెట్టకూడదా" అన్నాడు. రేపు తెచ్చి పెడతాలే అంటూ పోతూఉన్నాను. ఇప్పుడా చేతిలో ఉండేది కొంచెం పెడితే పోలా అన్నాడు. నేను పలక్కుండా వచ్చేసి ఉంటే వాళ్ళ అనుమానం దృఢపడి ఉండేదే. కానీ సర్వసాక్షియైన శ్రీ స్వామి వారు నన్ను వెంటనే వెనక్కు త్రిప్పి అక్కడున్న వారి దగ్గరకు వెళ్ళి ఆ టవల్ వారి చేతిలో పెట్టాను. వాళ్ళా మడత విప్పి చూచి ఓస్ ఇంతేనా ప్రసాదమనుకున్నాము అని నవ్వి సరిపెట్టారు. ఆ సమయంలో నేను వెళ్ళి ఆ టవల్ వాళ్ళ చేతిలో పెట్టకుంటే నిత్యం ప్రసాదం పొట్లాలు తీసుకపోతుంటాడు అనే మాట నిజమేనని వారు నమ్మి అది ఆనోట ఆనోట వ్యాపించకుండా చేశారు శ్రీ స్వామి వారు. అదే స్మృతిరహితప్రసన్నాయ నమ: అంటే.

## చిన్నతప్పయినా తప్పే అనే బోధను రెండవసారి శిక్ష ద్వారా తెలుపడం

ఆ రోజుల్లో రాత్రి రెండుగంటలకు మందిరంలోకి వస్తే తిరిగి ఉదయం 8 గంటల పైన ఇంటికి పోయేవాణ్ణి. అభిషేకం, అలంకరణ, పూజ, తీర్థప్రసాదాల వినియోగం, టెంకాయలు (భక్తులు తెచ్చినవి) కొట్టడం, పుస్తకాలు అమ్మడం అన్ని పనులు ఒక్కడనే చూసుకొనేది.



ఒకరోజు చాలా ఆకలిగా ఉంది, పిల్లలు ఆడుకునే గోలీకాయంత పప్పుపొంగలి తిన్నాను. అది నిజానికి నా ఆకలి తీర్చలేదు కదా. ఆ సమయంలో అలా తినడం ఒక చాపల్యం అనే గుర్తే రాలేదు. అది మొదలుకొని నేను చాలా హీనాతి హీనంగా తయారయ్యాను. స్కూలులో పాఠం చెప్పాలనే బుద్దే పుట్టదు. రేపు రేపంటూ జరిపేస్తున్నాను. ఇంటికి వస్తే ప్రతి నిత్యం శ్రీ స్వామి వారికి వచ్చే మనియార్డరు కూపన్లకు రసీదు వ్రాసి ఆ రసీదు కవరులో పెట్టి కవరు పై అడ్రసు వ్రాసి అందులో ప్రసాదం, దారం, విభూతి పెట్టి కవరు అంటించాలి. ఫలాన వారికి ప్రసాదం పంపామని డిస్పాచ్ రిజిష్టరులో వ్రాయాలి. అన్నీ కూపన్లకు ఇలా వ్రాసే సరికి రాత్రి పన్నెండు గంటలయ్యేది. ఒక్కరోజు కూడా పెండింగ్ పెట్టేదిలేదు. పొంగలి తిన్నాక పదిహేను రోజులు ఈ పనంతా చేయకుండా M.O. కూపన్ల కట్టలన్నీ పేరిపోతున్నాయి. నా సోమరితనం తెలుస్తూనే ఉంది. కానీ సరిగా పనిచేయలేకపోతున్నాను. పొంగలి తినడమే ఈ మార్పుకు కారణమని తెలుస్తున్నా బయటపడలేకున్నాను. పొంగలిలో నూనె, ఉప్పు, కారం ఉంటాయి. గనుక అట్లా తినడం శ్రీ స్వామి వారి ఆజ్ఞకు వ్యతిరేకంగా తప్పుచేశానని తెలుస్తూనే ఉన్నది. కానీ బయట పడలేకున్నాను. శ్రీ స్వామివారే నాయందు దయతలచి - నా సోమరితనానికి పొంగలి తినడమే కారణమైతే ఇర్వై నాలుగు గంటలు నిరాహారిగా ఉంటాను. ఇంట్లో కాకుండా అనాధవలె శ్రీ స్వామి వారి ఆవరణంలో ఉంటానని అలా చేసి మరురోజు, స్నానం చేసి భోం చేసిన వెంటనే ఆ శక్తి ఎలా వచ్చిందో అన్ని రోజులు M.O. కూపన్లన్నీ వ్రాసేశాను. స్కూలులో పాఠాలన్నీ నాలుగురోజుల్లో పూర్తిచేశాను. చిన్న తప్పయినా తప్పే అనే మాట మరొకసారి బోధించి నన్ను సరైన మార్గంలో పెట్టిన దయామయుడు శ్రీ స్వామి వారు.

# రెండు కాళ్ళు ఒకేచోట కాల్చి పాఠం చెప్పారు

శ్రీ స్వామి వారి మందిరంలో పనిచేసే ఒకరు చేలో వేరుశెనగ పైరు వేసినందున రెండునెలలు వరుసగా మందిరంలో పనిచేసేందుకు రాలేదు. నాగయ్యగారికి ఆరోగ్యం సరిలేక రావడం లేదు. నిత్యం నేనొక్కడినే అన్నీ పనులూ చూచుకోవాలి. నిత్యం అగ్ని గుండం సరిచేయడం పెద్దపని. గుండంలోకి దిగి విభూది ప్రక్కకు దోసి కట్టెలు వేసి మంట వచ్చేటట్లు చేయాలి. ఈ పనంతా చేసే సరికి వళ్ళంతా చెమటలు కారిపోతాయి. రాత్రి ఒంటిగంట కొచ్చి ఈ పని చేసి బావి దగ్గర స్నానం చేసి మందిరంలో పని చూడాలి. అభిషేకము, అలంకరణ, పూజ తీర్థప్రసాదాల వినియోగము అన్నీ ఒక్కడినే చేసేవాణ్ణి. శ్రీ స్వామి వారు మనకు ఆరోగ్యమిచ్చినారు గనుక వారి సేవ ఎంతైనా చేయాలి అని చేసేవాడిని. మందిరంలో పనిచేసే అతను వేరుశెనగ మాసూలు అయి ఇంటికి వచ్చాడు. కానీ సమయానికి వచ్చి గుండం పనిచేయడు. ఎప్పుడో పూజ మధ్యలో వచ్చి వింజామర వీచేవాడు. పదిహేను రోజులు గడచినా అతను వచ్చి గుండం పని సకాలంలో చేయడు, నేను అడగను. ఒక రోజు గుండంలో దిగి పనిచేస్తుంటే రెండు అరికాళ్ళు ఒకే చోట కాలాయి. ఇదేమి స్వామి ఇట్లాచేశారు అని అప్రయత్నంగా అనుకుంటే వెంటనే శ్రీ స్వామి వారు పలికారు "నీవే వాళ్ళకు నేర్పించేది" అన్నారు. అది మొదలుకొని ఒక పుస్తకం పెట్టి ఎవరు ఎన్ని గంటలకు డ్యూటీలోకి వచ్చి ఎన్నిగంటలు డ్యూటీలో ఉన్నారు అని వ్రాయసాగాను. మరునాటి నుండి ఆ వ్యక్తి, సకాలంలో వచ్చి తనపని తాను చేయమొదలు పెట్టాడు. సర్వసాక్షియైన శ్రీ స్వామి వారు మనం తప్పు చేస్తున్నా మనలను సరైన మార్గంలో పెట్టి నడిపిస్తారు.



# నా భార్య కాలు నొప్పి - పసరు పూయడం

నా భార్యకు కాలులో ఎక్కడనో నొప్పి ఉందని నాకు తెలుస్తుంది. ఆమెకామాట చెపితే అదేమీలేదంటుంది. ఇట్లాగే, రెండు నెలలు గడిచాయి. ఆ రోజు గోడ పట్టుకొని కూడా లేవలేని స్థితికొచ్చి ఏడుస్తుంది. నెల్లూరు వెళ్ళి డాక్టరుకు చూపించి రమ్మాన్నాను. మా అన్న కుమారుణ్ణి తోడు పంపాలని తీసుకవచ్చేలోపల డబ్బులు తీసుకోబోతే క్రింద పడిందట. ఈ రోజు పోను రేపు నెల్లూరు పోతానన్నది. ప్రతిరోజు రాత్రి ఎనిమిది గంటలకు శ్రీ స్వామి వారి మందిరానికి పోవడం ఆమెకు అలవాటు. ఆ రోజు ఆ కొద్ది దూరం నడవలేక కన్నీళ్ళతో పోయింది. అక్కడ కూర్చొని "స్వామీ నన్ను మావూరిలో ఉండే వారిని ఈ ఊరికి తీసుకవచ్చారు, మీ మందిరానికి కూడా రాకుండా చేయడానికా? ఉంచితే ఆరోగ్యంగా ఉంచు లేకుంటే చంపేసేయ్" అని ఏడ్చింది.

నాటి రాత్రికి స్వప్నంలో శ్రీ స్వామి వారు కనిపించి ఆమెకు మోకాలిపైన ఏదో ఆకు పసరు పూశారు. ఎంతచిత్రమో, తెల్లవారి నుండి అంతటి బాధ ఎలాపోయిందో పోయింది. ఏడుపులు కూడా రెండు రకాలు ఉంటాయి. ఆమె ఎంత హృదయపూర్వకంగా ఏడ్చిందో కానీ శ్రీ స్వామి వారి కృప వెంటనే పొందింది. వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అన్న శ్రీ స్వామి వారి మాట అక్షరాల నిజమని నిరూపించారు.

# పరదూషణకు పనిష్మెంట్

ప్రతి రాత్రి మూడు గంటలకు శ్రీ స్వామి వారికి అభిషేకం చేయాలి. మేము రాత్రి రెండు గంటలకు నిద్రలేచి స్నానం చేసి రెండు

ముక్కాలు గంటలకు మందిరానికిపోవాలి. ఏ కారణం చేతనైనా పోకుంటే మందిరం నుండి పిలుపు వస్తుంది. మనిషి వచ్చి పిలుస్తాడు. అట్లా మనిషి వస్తే నేను చాలా అవమానంగా భావిస్తాను.

ఈ ప్రపంచమంతా ఒక నాటకరంగమని ప్రతి జీవి పూర్వ కర్మానుసారం అలా ఆడించబడుతారని ఋణాను బంధమే ఆ ప్రవర్తనకు కారణమని జరిగే నాటకాన్ని కేవలం ప్రేక్షకుల్లాగ చూస్తుంటే ఋణాను బంధాలు తీరిపోతాయి లేకుంటే భవిష్యత్ యొక్క ఫిల్మును మనకు మనమే సిద్దం చేసుకుంటాము. ఈ జ్ఞానం ఆచరణలో ఉంటే భవిష్యత్ ఫిల్మ్ తయారుకాదు. అలా కాకుంటే జనన మరణ చక్రంలో పడడం ఖాయం. నేను వ్రాయవచ్చు ఎదుటి వారికి చెప్పవచ్చు కానీ ఆచరణే చాలా గొప్పది. ఆచరించగలిగేది ఇక ఎన్ని జన్మలకో.

ఒక వ్యక్తి ఒక తప్పు చేశాడు. దాని వల్ల మనకేమీ అపకారంగానీ నష్టంకానీ లేదు. అది తెలిసిన వెంటనే ఆ వ్యక్తిని నోటికొచ్చినట్లు తిట్టాను. ఆ వ్యక్తిముందు కాదు. ఆ వ్యక్తి లేనప్పుడు ఇతరులముందు దూషించాను. ఆనాటి రాత్రికే రెండు గంటలకు నిద్రలేవలేదు. మందిరం నుండి మనిషి వచ్చి పిలిచాడు. ఏమి స్వామీ ఈ శిక్ష అని బాధ పడుతుంటే - నిన్నటి నీ ప్రవర్తనకిది శిక్ష అన్నారు. నిన్న నేను చేసిన తప్పు నాకు చేసిన మరుక్షణం నుండి బాధగానే ఉంది. ఇకమీదటైనా పరదూషణ చేయకుండా జీవించేటట్లు చేయమని శ్రీ స్వామి వారిని కన్నీటితో ప్రార్థిస్తున్నాను. ఈ విధంగా వెంటనే మన తప్పు మనకు తెల్పి శిక్షించడమే సద్గురుని గొప్పతనం.



# చాపల్యములు నసించనిదే వెయ్యి జన్మలు తపస్సు చేసినా నీవు ఉన్నచోటే ఉంటావు

2004 వ సంవత్సరములో చాలా లేత బీన్సుకాయలు వచ్చాయి. రోజూ నేను వేసుకొనే దానికంటే రెండింతలు దబ్బలు వేసుకున్నాను. భోజనం పూర్తిచేసి వస్తూ వస్తూ మా వాళ్ళ కొరకు ఉడికించి ఉంచిన దబ్బలు కొన్ని నోట్లో వేసుకొని నమలుతూ వచ్చాను. అంతటితో ఆగక అట్లాగే మరి రెండుమార్లు తిన్నాను. ఆనాటి నుండి నాలుగు రోజులు వరుసగా విపరీతమైన ఆయాసం. పూజ చేసేందుకు మందిరానికి గానీ, శ్రీ బ్రహ్మం గారి మఠానికి సత్‌సంగానికి కానీ పోలేకపోయాను. ఇంతమంచి ఎండల రోజులలో ఇంతపెద్ద ఆయాసం ఎందుకొచ్చిందో అర్దం కావడం లేదు. నాలుగవరోజు అర్ధరాత్రి బాధకు తట్టుకోలేక మంచం వదలి వాలు కుర్చీలో కూర్చున్నాను. ప్రక్కనే ఉన్న పుస్తకాలలో నుండి ఒక పుస్తకాన్ని తీసి తెరిచాను. ఎడమ ప్రక్క మొదటి లైనులో "చాపల్యములు నసించనిదే వెయ్యి జన్మలు తప్పస్సు చేసినా నీవున్న చోటే ఉంటావు" అని ఉంది. వెంటనే నా ఆయాసానికి కారణం చాపల్యానికి దాసుడనై బీన్సు దబ్బలు తినడమేనని రూఢిగా అర్ధమయింది. చెంపలేసుకొని అట్టి చాపల్యాలనుండి దయచేసి దూరం చేయమని - వారి మాయను నాపైనుండి ఉపసంహరించమని శ్రీ స్వామి వారిని హృదయ పూర్వకంగా ప్రార్ధించాను. ఆయాసం తగ్గింది. పై తప్పుకు శిక్షగా పదిహేను రోజులు ద్రవాహారం మాత్రమే తీసుకొని బాగా బలహీనమయ్యాను. ఒకరోజు పూజానంతరం కర్పూర హారతి ఇవ్వలేక మరొకరిచేత ఇప్పించాను. మందిరంలోనే ఒక అరగంట పడుకొని తిన్నగా ఇల్లు చేరాను. ఇంత జరిగినా ఈ చాపల్యాలు నన్ను వదలడం లేదు. ఇవి శ్రీ స్వామి వారి దయవల్ల పోవలసిందే కానీ నా ప్రయత్నం

చాలదని నా భావం. ఎట్లాగయినా శ్రీ స్వామి వారు నన్ను గట్టుకు చేరుస్తారని మాత్రం గట్టి విశ్వాసముంది.

## కొన్ని దుష్ట సంస్కారాలను తొలగించడం

ఇరవై ఏడు సంవత్సరముల క్రిందట చమురు లేకుండా కాల్చమని స్వప్నాదేశమిచ్చారు. చమురు పదార్ధాలు నా శరీరానికి గిట్టవని తింటే వెంటనే ఆయాసం వస్తుందని తెలుసుకొని క్రమంగా మానేశాను. మరొకరోజు ఉప్పు, కారం, పులుపు తినవద్దని ఆదేశించారు. అదీక్రమంగా పూర్తిగా ఆచరించు చున్నానని గర్వమేగానీ వెంట్రుక వాసి తేడాలేకుండా ఆచరించ లేకున్నాను. ప్రసాదమనే పేరుతో తినడం, చెనగబేడంత ఉప్మా తినడం ఇలాంటి తప్పులనేకం చేస్తూ ఆయాసంతో బాధపడుతూ ఇది నా చిన్న తప్పులవలనే ఆయాసం వచ్చింది అని తెలుస్తుంది గానీ ఆ జంతు సంస్కారాలు నన్ను వదలలేదు. 2003 వ సంవత్సరంలో ఒకరోజు నిష్కారణంగా చాలా తీవ్రంగా ఆయాసానికి గురియైయ్యాను. అరమాత్ర వేసుకొని ఆయాసం తగ్గించుకొనే నేను - రాత్రి ఒంటి గంట సమయంలో శ్రీ స్వామి వారి మందిరంలో పూజ చేసేందుకు ఎవరినైనా లేపాలి గదా, ఈ ఆయాసం తగ్గితే నేనే వెళ్ళవచ్చని అరగంటకొక మాత్ర చొప్పున మూడు మాత్రలు మ్రింగినా తగ్గలేదు. నా కుమారుణ్ణి పంపి మరొకరిని మందిరంలో పూజ చేయమని చెప్పాను. రాత్రంతా తీవ్రంగా ఆయాసంతో బాధపడ్డాను. తెల్లవారి పది గంటలకు డాక్టరు వచ్చి డెకామెతాజోన్ అనే ఇంజక్షన్ చేశాడు. ఆ ఇంజక్షను మందు రక్తానికి తగలగానే ఆయాసం తగ్గాలి. కానీ రెండు గంటలసేపు ఏ మార్పూ లేదు. మరణం ఖాయమని శేషించిన ప్రారబ్ధం ఈ విధంగా ఖర్చు చేయిస్తున్నారని తలచాను. కానీ మధ్యాహ్నం పన్నెండు గంటలకు కొద్దిగా తగ్గింది. దుప్పటి పూర్తిగా కప్పుకొని పడుకొని - నా తప్పేమిటో



చెప్పకుండా మరలా ఆయాసం పెట్టావేమయ్యా - కారణం చెప్పమని మనసులోనే అనేక విధాల నిష్టూరాలాడుతున్నాను. నేను చేసే తప్పులన్నీ సినిమా రీల్‌లో లాగా నా మనో నేత్రానికి కనిపిస్తున్నాయి. "అయితే నేను తప్పు చేస్తుంటే నీవేమి చేస్తున్నావు" అన్నాను. "కఠోర నియమపాలన లేదు" అని వినిపించింది. వెంటనే శ్రీ స్వామి వారు కఠోర నియమపాలన జేసి ప్రాణాలను కూడా లెక్క చేయని రెండు సన్నివేశాలు గుర్తొచ్చాయి. ఎప్పుడు గంజి త్రాగినా రేఖలో త్రాగేది శ్రీ స్వామి వారి నియమం. రాజ పద్మాపురం - మద్రాసు రాష్ట్రం - బొగ్గుతో నడిచే పాసింజర్ రైలులో పోయే శ్రీ స్వామి వారి బృందం రేఖ తెచ్చేందుకు మరచిపోయారు. రేఖ లేదు కాబట్టి మూడు రోజులు గంజే త్రాగలేదట. సేవకులంతా తృప్తిగా భోంచేస్తున్నారు. సేవకులకే బాధవేసి ఒక స్టేషన్‌లో దిగేసి ఎక్కడో కత్తి సంపాదించి తాటాకుకొట్టి రేఖ చేసి ఇస్తే త్రాగారు. ఏ పరిస్థితులలోను శ్రీ స్వామి వారు ఎవరింటిలోకి పోరు. బయటనే పశువుల కొట్టాలలోను చెట్ల క్రింద ఉంటారు. ఉన్నఫళంగా పెద్ద వర్షం కుండపోతగా కురుస్తోంది. సేవకులంతా సామానుతో సహా ప్రక్కనున్న పెమ్మసాని మస్తానయ్య గారింట్లోకి వెళ్ళారు. శ్రీ స్వామి వారు అంతలావు వర్షంలో తడిసారు. వళ్ళంతా బురద కొట్టుకున్నది. గడగడ వణికి పోతున్నారు. వారు మనిషి గడపలో కూర్చొని కాళ్ళు బయట పెట్టమంటారు శిష్యులు. కానీ శ్రీ స్వామి వారు ససేమీరా అంగీకరించలేదు. ప్రాణం పోయినా సరే నియమం తప్పకూడదనే వారి పట్టుదలను తన ఆచరణ ద్వారా చూపించారు. అలాంటి కఠోర నియమపాలన లేకుంటే నీకు ఆయాసం తప్పదని బోధించారు. నాటినుండి అనేక దుష్టసంస్కారాలు నాలో దూరమయ్యాయి. కానీ మాయకు లోబడిన నేను ఈ దుష్ట సంస్కారాలు పూర్తిగా వదలలేకున్నాను. అందుకే మాయను ఉపసంహ రించమని శ్రీ స్వామి వారికి కన్నీటితో విన్నవిస్తుంటాను. నా ప్రార్ధన లేకయే నీ పాదములు చెంత కీడ్చి నను దౌర్భాగ్యుని చేయుట ధర్మమా ధర్మమూర్తి అని ప్రార్ధిస్తుంటాను.

# నియమపాలన - స్వప్నాలు

పరమ కారుణ్యామూర్తియైన శ్రీ స్వామి వారు నన్నుద్ధరించాలని ఎంతో శ్రమపడుతున్నారు. నేటికి కూడా వారు సమాధి చెందినప్పటికీ అనుక్షణమూ ఏమరుపాటు లేకుండా నా విషయంలో శ్రద్ధ వహించి యున్నారు. బలహీనతల పుట్టనైన నేనే వారి ఆజ్ఞలను, కఠోర నియమపాలనలను పాటించ లేకున్నాను. 2003 వ సంవత్సరములో వరుసగా మూడు రోజులు ఒకే విధమైన స్వాప్నాలను అనుగ్రహించారు. నేను పనిచేసే స్కూలులో లేబరేటరీలోని పెంకులు తొలగించి కప్పుపైన ఒకరు కూర్చొని యున్నారు. మరియొకరు టేబుల్ మీద నిలుచొని విలువైన పరికరాలన్నీ కప్పుపైనున్న మనిషికి ఆ రంధ్రము గుండా అందిస్తున్నాడు. నేనక్కడే ఉండి ఆ అందించే అతనితో తగవులాడు చున్నాను. అతడేమీ మాట్లాడకుండా తన పని చేస్తున్నాడు. మరురోజు మరొక స్వప్నం, నేను పూరింట్లో కాపురమున్నాను. ఆ ఇంటి కప్పుకు రంధ్రం చేసి ఇంటిపై నొకరు కూర్చొని ఇంటి లోపలనుండి మరొక వ్యక్తి విలువగల వస్తువులన్నీ కప్పు రంధ్రము గుండా పైనున్న వ్యక్తికి అందిస్తున్నాడు. ఇదేమి పని? ఇలా చేస్తున్నారేమిటి? అని అరుస్తున్నా అతడేమీ మాట్లాడకుండా అందిస్తున్నాడు. మూడవరోజు కూడా ఇలాంటి స్వప్నమే. నేను అజాగ్రత్తగా ఉంటే నా సర్వమూ దొంగల పాలవుతుందని తెలుసు కున్నాను. కానీ ఇది భౌతిక సంపదనుకున్నానే గానీ ఆధ్యాత్మిక సంపదని తెలుసుకోలేకపోయాను. కొన్ని నెలల తర్వాత నాలోని బలహీనతలే ఈ దొంగలని తెలుస్తుంది. కానీ ఆ బలహీనతలను వదలలేకుండా ఉన్నాను. వారికి కన్నీటితో విన్నవిస్తామంటే ఒక్కబొట్టయినా కన్నీరు రాదు. నా హృదయ మంతా పాప పంకిలమై పాపముతో కరుడుకట్టి యున్నది గదా! ఎన్ని జన్మలనుండి ఈ పాపపురాసులలో మునిగి యున్నానో? ఈ పాపములనుండి



శ్రీ స్వామి వారే నన్నుద్ధరించవలెను కానీ వీటినుండి బయట పడడం నా తరమా ప్రభూ. నాలోని లోపాలను జాగ్రత్తగా గుర్తించి తొలగించుకునే హృదయపూర్వక ప్రయత్నం చేసేందుకు శక్తిని ప్రసాదించు తండ్రి.

# చాపల్యం నసింపజేయడం

2004 ఏప్రిల్ 29 వ తేది శ్రీ బ్రహ్మంగారి ఆరాధన ఏప్రిల్ 12 వ తేది శ్రీ మాష్టారి ఆరాధన. విజిటర్స్ వత్తిడి ఎంత తిన్నా ఏమి చేయడంలేదు. ఒకరోజు గట్టిపెరుగు పెసరపప్పు - మునక్కాయలూ తినేశాను. తినినంతసేపూ భయంగానే తిన్నాను. కానీ ఏమీ చేయలేదు. పని అంతగా ఉంది. అతిగా తినడం బాగా అలవాటైంది. పనికూడా విపరీతంగానే చేస్తున్నాను. ఏప్రిల్ 20 వ తేది మునక్కాయలు పాలు చక్కెర యర్రగడ్డలు అతిగానే తిన్నాను. మా వాళ్ళకు చేసిన చుక్కాకు కూడా రుచిగా ఉందని రెండు గరిటలు తిన్నాను. మొన్న పెరుగు తింటే ఏమీ చేయలేదుగదా. ఈ రోజూ అంతేననుకున్నాను. చుక్కాకు పెసరపప్పు ఎప్పుడూ తింటాను ఏమీ చేయదు. ఈ రోజు రాత్రి నిద్ర పట్టలేదు. ఆయాసంగా ఉంది. వెంటనే బెటాస్మా మాత్ర వేసుకున్నాను. ఆయాసం పోయింది. కానీ నిద్ర రాలేదు. రాత్రి 1 గంటనుండి వ్రాత పని చేశాను. పూజకు వెళ్ళాను. అప్పటి దాకా బాగానే ఉండి అప్పటికప్పుడు వళ్ళు తిరుగుతుంది. అసలు ఎంతో హీనాతి హీనంగా పూజ చేస్తున్నాను. ఒక వైపు బీన్సుకాయలు తినడం - ప్రాయశ్చిత్తంగా ద్రవాహారం తీసుకోవడం - పూజ చేయలేక కర్పూరహారతి మరొకరి చేత చేయించడం గుర్తొస్తున్నాయి. వెంటనే అలాంటి పరిస్థితి రాకముందే పూజ ముగించాను. ఎంత మానసిక బాధో చెప్పలేను. చాపల్యము వలన శ్రీ స్వామి వారి పూజ చేసేందుకు అనర్హుడ నౌతున్నాను అని బాధ. దానితో బుద్ధి బాగా వచ్చి - పని చేయకూడదు. పని కొరకు తినకూడదు.

యుక్తాహార విహారమే. ఇక మీదట పని చేస్తే తింటాను తింటే శ్రీ స్వామి వారు నన్ను పూజ చేయనివ్వరని బోధ జరిగింది. మరుపే మరణం అన్నారు. ఈ విషయం ఎల్లప్పుడూ గుర్తుండేటట్లు చేయి తండ్రీ. మరలా జిహ్వాచాపల్యముచే అతిగా తిని అతిగా పనిచేసే దౌర్భాగ్యపు అలవాట్లనుండి శాశ్వతంగా కాపాడమని వేడుకుంటున్నాను. నన్ను అతిధుల లిస్టులో తోయకుము ప్రభూ నను నీ ఆత్మీయుగా ఉండుటకు నీ ఆజ్ఞలను నీకు ప్రీతి పూర్వకముగా ఆచరించు యోగ్యతనిమ్ము తండ్రీ. నీ పంచశీల సూత్రాలను నా చేత ఆచరింపజేయి ప్రభూ. నీ సన్నిధి ప్రభావము వలన నా మనోవాక్కాయములన్ శుద్ధి చేయుము ప్రభూ. మరుపే మరణమన్నారు గదా. ఈ అనుభవం మరచి తిరుగ కొన్నాళ్ళకు అతి తిండి తినే దౌర్భాగ్యపు సంస్కారాల నుండి శాశ్వతంగా విముక్తి చేయి ప్రభూ.

## నీవు నిశ్చలంగా కూర్చో అవసరమైనదంతా నే చేస్తాను

శ్రీ బ్రహ్మాం గారి మఠం (గొలగమూడి) బావిలో వేసవిలో నీళ్ళుండవు. మఠంలో చెట్లెండిపోతున్నాయి. మఠం చూసే సరోజనమ్మ అనేక మార్లు నాకీ విషయం చెప్పింది కానీ నేనేమి చేయలేని స్థితి. ఆర్థికంగా వీలయ్యే పనికాదు. చీరాలలో ఒక భక్తునికి ఒక కల వచ్చిందట. వారొక చిన్న పూరింటిలో పూజ చేస్తున్నట్లు ప్రక్కన నేనున్నట్లు. ఎవరో వచ్చి వారి సామానంతా బయట పారేస్తుంటే, ఆ పూజ చేసే ఆయన "నేను బోరు వేయిస్తానంటున్నాను గదా. నా సామానెందుకు బయట వేయడం" అంటున్నాడట, నేనేమీ మాట్లాడక చూస్తున్నానట. ఏమిటా ఈ స్వప్నం అని అనుకున్నాడు. ఆ తర్వాత ఆయన గొలగమూడి వచ్చి మఠంలో ఒక రాత్రి పడుకున్నాడు. రాత్రి 2 గంటల



సమయంలో సరోజనమ్మ నీళ్ళు తెచ్చి చెట్లకు పోసుకుంటున్నది. ఇదేమిటమ్మా రాత్రి 2 గంటల సమయంలో నీళ్ళు తెస్తున్నావు అని ఆ నిద్రపోయే చీరాలాయన మేల్కొని ఆమెనడిగితే ఆమె "నాయనా బావిలో నీళ్ళు లేవు తెల్లవారితే అందరూ వచ్చి బావిమీద పడుతారు" ఈ సమయంలోనే రెండు బిందెలు దొరుకుతాయి అని చెప్పిందట. వెంటనే ఆయనకు పూర్వం తన స్వప్నం గుర్తుకొచ్చి ఓహో! ఇదే కాబోలు నేను బోరువేయిస్తానని స్వప్నంలో అనడం అని నిర్ణయించుకొని పన్నెండు వేల రూపాయలు తెచ్చి నా చేతిలో పెట్టి మీరు తప్పక మఠంలో బోరు వేయించండి. నేను డబ్బిచ్చినట్లు ఎవ్వరికీ చెప్పవద్దు. బోరు వేయించేందుకు ఇంకా డబ్బవసరమైనా నేనే ఇస్తానన్నాడు. మే నెలలో బోరు వేయించాలని తలచాను. ఈలోగా బోరుకు శంకుస్థాపన చేశాము. ఒక భక్తురాలు మూడువేల రూపాయలు నా చేతిలో పెట్టి బోరుకు ఖర్చు పెట్టండి. నా పేరు ఎవ్వరికీ చెప్పవద్దన్నది. ఆ మహనీయుడే సర్వకార్యాలూ చేస్తుంటే మన ప్రమేయమేమీ లేదు. వారి చేతిలోని తెడ్డు వలె ఉంటే ముందుకు పోతాము. ఏ మాత్రం నేను చేస్తున్నాననే భావం వస్తే అహంకరించినట్లే - అప్పుడు సాధనలో ముందుకుపోవడం పోయి మన పతనం ఆరంభమవుతుందన్నమాట. నమో సద్గురురాయా, నమస్కారములు.

అవసరమైనదంతా నే చేస్తానన్నారు కానీ నీవు కోరినదల్లా చేస్తాననడం లేదు. మనకేది అవసరమో అది మనకంటే ఆ సర్వజ్ఞమూర్తికే బాగా తెలుసుగదా! మన అవసరాలేవో గుర్తించి మనం అడగకుండానే వారు చేస్తారన్నమాట.

రెండు సంవత్సరాల నుండి నా దగ్గర ఎంత విలువగల పుస్తకాలు నిలువ ఉన్నాయి అనేది లెక్క చూడాలని తపన కానీ నా వల్ల

కావడంలేదు. నా దగ్గర పదహారు రకాల పుస్తకాలున్నాయి. ఈ కట్టలన్నీ దింపి - వాటి కుట్లు విప్పి ఎంచి మరలా కుట్టి నెట్టు వేయాలి. మనిషి ఉంటే నాకు తీరదు. నాకు తీరితే మనిషి దొరకడు. 2004 వ సంవత్సరం మార్చి ఆఖరుకు లెక్క తప్పక చూడాలనుకున్నాను. వీలే కాలేదు. ఏప్రిల్ నెల ఇరవై రోజులు జరిగింది. ఏమీ చేయలేకున్నాను. ఒక రోజు బెంగుళూరులో M.Tech చదివే కుర్రవానికి స్వప్నంలో నేను కనిపించి - నీతో నాకు పని ఉంది. ఒక వారం వచ్చి నా దగ్గరుండు అని చెపుతున్నానట. తెల్లవారి ఆ పిల్లవాడు గొలగమూడి వచ్చి విషయం చెప్పాడు. అసలు చదువుకునే విద్యార్ధిని చదువుపోగొట్టుకొని రమ్మనడం ధర్మంకాదని ఆ పిల్లవానికి నేను లెటరు కూడా వ్రాయను. సరే ఇప్పుడు శ్రీ స్వామి వారే నా అవసరం గుర్తించి నారూపంలో స్వప్న దర్శనమిచ్చి ఆ పిల్లవాడిని పిలిపించారు. ఆ పిల్లవాడు ఒక్కడుగా ఏమీ చేయలేడు. పుస్తకాల కట్టలు దించి విప్పి లెక్క పెట్టి తిరుగకుట్టి నెట్టు వేయాలంటే మరొక మనిషి ఉండాలి. నా దగ్గరుండే సంగీత కళాశాల విద్యార్ధి వెంకటేశ్వర్లు గారి మేడం శెలవు పెట్టిందని కాలేజీకి పోవడంలేదు. ఇద్దరూ కలసి పుస్తకాల లెక్కింపు పూర్తి చేసి రిజిష్టరు వ్రాశారు. అంతేగాక శ్రీ బ్రహ్మం గారి మఠంలోని ఆరాధనకు భిక్షా కార్యక్రమం ఈ సంవత్సరం ఆగకుండా కొంత గ్రామం తిరిగారు. కరపత్రములలో ప్రకటించినట్లు 17, 18, 19 తేదిలు అయిపోయాయి. ఇక భిక్ష చేయలేము అనుకున్నాను. నాటి రాత్రికే దమ్మపేట నుండి జయమ్మగారు వచ్చి మిగిలిన గ్రామంలో భిక్ష నేను చేస్తాను అని తనతోటి స్త్రీలతో ఆ పని ఆమె ముగించింది. ఇందులో నా ప్రయత్నమేమీ లేదు. అంతా శ్రీ స్వామి వారు చేస్తుంటే నేను చేస్తున్నాను అని ఆత్మలోనైనా తలవడం ఎంతటి అహంకారమో గదా. అలాంటి భావాలు రానీయక నన్ను పరిశుద్దుని చేయమని శ్రీ స్వామిని ప్రార్ధిస్తున్నాను.



# చమురు లేకుండా కాల్చు

నేను విపరీతంగా ఆయాసంతో బాధ పడే రోజులవి. నూనెతో తయారైన పదార్ధాలు తినడం ఆయాసంతో బాధపడడం. కానీ నూనె పదార్ధాలు తినినందున ఆయాసం వస్తుందని అప్పుడు నాకు తెలియదు. ఎంతో బాధ పడుతూ ఎన్నెన్నో మందులు తింటున్నాను. శ్రీ స్వామి వారి సన్నిధికి వెళ్ళి వస్తున్నాను. కానీ నా ఆయాసం గురుంచి వారికేనాడూ విన్నవించలేదు. ఒకరాత్రి నా స్వప్నంలో నేను చెట్టు పైన ఎక్కి ఒక పెద్ద డబ్బాతో ఆ కొమ్మల పైన ఏదో చల్లుతున్నాను. ఆ చెట్టుకు పదిబారల దూరంలో శ్రీ స్వామి వారు అగ్నిగుండం ముందు కూర్చొని - "చమురు లేకుండా కాల్చు" అని పెద్దగా నా వైపు చూపిస్తూ అరుస్తున్నారు. మెలకువ వచ్చింది, తెల్లవారి ఈ కలకు అర్ధమేమని శ్రీ స్వామి వారినడిగితే మౌనం వహించారు. వారి సేవకులు నిదానంగా మీకే అర్ధమవు తుందన్నారు. వారు చెప్పినట్లే జరిగింది. నూనె పదార్ధాలు తిన్నందుననే ఆయాస మొస్తుందనే గుర్తింపు మొదలైంది. నూనె ఎంత తగ్గిస్తే అంత ఆయాసం తగ్గుతూ వచ్చింది.

మరొక రోజు శ్రీ సాయి స్వప్నంలో కనిపించి ఉప్పు కారం తినకుండా ఉండాగలవా? అని కోపంగా అడుగుతున్నారు. నేను వారిని కౌగలించుకున్నాను. తెల్లవారికి ఉప్పు, కారమా లేక ఉప్పు, పులుపా అనేది గుర్తురాక శ్రీ భరద్వాజ మాష్టరు గారిని అడిగితే మూడు వదిలేస్తే ముదనష్టం పోతుందన్నారు. అన్ని రకాల వైద్య శాస్త్రజ్ఞులను అడిగి అవి తినకుంటే మన శరీరానికి ఏమీ బాధ ఉండదంటేనే మానమన్నారు. అందరు వైద్యులు - అలా వదల గలిగితే జబ్బే ఉండదన్నారు. అది మొదలుకొని మూడూ - ఉప్పు, పులుపు, కారం వదిలేశాను. పూర్వ సంస్కారాల వలన ఎప్పుడైనా స్వల్పంగా తినేది. ప్రసాదాల పేరుతో తినేది.

ఇది కూడా శ్రీ స్వామి వారు కఠోర నియమపాలన ఉండాలని బోధించడంతో 99 పాళ్ళు మానాను. మన కఠోర నియమపాలన ఎడల శ్రీ స్వామి వారు సంతృప్తి చెందాలి. అప్పుడు మనం వారి ఆత్మీయుల లెక్కలోకి వస్తాము లేకుంటే అతిథుల లిస్టులోనే ఉంటాము.

## శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీకి బానిసకాబోయిన నన్ను ఆ బానిస బ్రతుకు నుండి రక్షించిన స్వామి.

ఒకప్పుడు ఆశ్రమాన్ని ఎండోమెంట్ వాళ్ళు తీసుకుంటున్నారని రాత్రికి రాత్రి కొత్త రికార్డు తయారుచేస్తున్నారు. సేవకులందరూ కొన్ని సంవత్సరాలనుండి అక్విటన్సు రిజిష్టరులో ఒక్కరూపాయి రెవెన్యూ స్టాంపుపై సంతకాలు చేస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుండి అలా జరుగుతూ వారంతా శ్రీ స్వామి వారి సేవలో ఉన్నట్లు, ఎండోమెంట్ వాళ్ళు, వాళ్ళను ఉద్యోగము నుండి తీసేసేందుకు వీలులేదని ఆ అక్విటెన్సు రిజిష్టరే ఆధారమౌతుంది. అప్పుడు నేను వెళ్ళి ఆశ్రమ సెక్రటరీగారిని నాపేరు కూడా వ్రాయండి. ప్రతినెల ఒక రూపాయి జీతం తీసుకున్నట్లు సంతకాలు పెట్టించుకోండి అని అడిగితే సరేనన్నారు. కానీ తెల్లవారి రిజిష్టరులో నా పేరు లేదు. సంతకాలు చేసేందుకు నన్ను పిలవలేదు. నేను వెళ్ళి సెక్రటరీగారిని అడిగితే మీరు 1983 సంవత్సరమునుండి స్వామి సేవలో ఉన్నారని నేను కోర్టుకైనా వచ్చి చెపుతావో అన్నారు. కానీ అందరివలె నాపేరు కూడా వ్రాయించలేదు.

ఎవరినీ చేతులు కట్టుకొని బ్రతిమిలాడే అలవాటు నాకు మొదటినుండి లేదు. అక్కడనుండి వచ్చేశాను, కానీ సెక్రటరీగారి మీద, ఆయన సలహాదారులపై మాత్రం కోపంగానే ఉంది. అనేకమందికి



ఈ విషయం కడుపుమంటతో చెపుతున్నాను కూడా. ఎందుకంటే ఎండోమెంటు వాళ్ళు వచ్చి నన్ను పూజారిగా తీసేస్తే నేనే ముందు కోర్టుకు పోతే అప్పుడు సెక్రటరీగారు వచ్చి సాక్ష్యం చెపుతారట. నేను కోర్టుకు పొయ్యేది లేదు. ఆయన సాక్ష్యం చెప్పేది లేదు. కొన్ని కారణాలుగా కమిటీ కోర్టుకు వెళ్ళి కోర్టు రిసీవర్ల పరిపాలన వచ్చింది.

అప్పుడు తెలిసింది. నేను నెలకు ఒక్క రూపాయి తీసుకున్నట్లు రిజిష్టరుకెక్కకపోవడం ఎంతమేలైనది తెలిసింది. వారి రిజిష్టరులో నేను ఎక్కి ఉంటే వారు చెప్పిన ఆజ్ఞలో ఉండాలి. నాకు స్వేచ్ఛ లేదు. ఈ నాటికి పూజారిగానే ఉన్నాను. శ్రీ స్వామి వారి సేవ అని స్వేచ్ఛ లేకుండా జీవించడం ఎంత ఘోరమైన విషయమో నేడు 2005 వ సంవత్సరంలో తెలిసింది. కోర్టు పాలకులకు స్వామి చరిత్ర తెలియదు. ధర్మ సూక్ష్మం అంతకంటే తెలియదు. ఆనాడు నా పేరు రిజిష్టరుకెక్కి ఉంటే వారి చెప్పు చేతుల్లో నడువవలసి ఉండేదే.

ఆ కరుణామయుడు నా ప్రార్థన లేకయే నా పేరు రిజిష్టరు నుండి తొలగించి ఆదుకున్నారు. శ్రీ భరద్వాజ గారు I.A.S. పాసయినాక వాళ్ళ అన్నగారితో చెపుతాడట "నీలాగ నేను బంగారు సంకెళ్ళు వేసుకోలేను, మాట పట్టుదలకు చదివాను. I.A.S. అంటే మాటలు కాదు సత్తా ఉంటే చూపమన్నావుగా" అందుకే చదివి పాసయ్యాను. ట్రయినింగుకు రమ్మన్నారు. నేను ఆ బంగారు సంకెళ్ళు వేసుకోలేనన్నారు. అలాంటి బంగారు సంకెళ్ళ బారి నుండి నన్ను రక్షించారు శ్రీ స్వామివారు.

రిజిష్టరులో ఉండి వారికి బానిసగా అవడం ఎలానో ఇక్కడ వ్రాయలేను. నన్ను ప్రత్యక్షంగా అడిగితే చెప్పగలను. రిజిష్టరులో నా పేరు వ్రాయని వారిపై అజ్ఞానం వల్ల కసిగానే ఉండేది. అంతయూ మన మేలునకే అనేది ఇప్పుడు అర్థమైంది. శ్రీ స్వామి వారి కరుణ అంటే ఎలా ఉంటుందో చూడండి.

# శ్రీ స్వామి వారి నిర్ణయము కొరకు
# నాల్గవ చీటీ పెట్టించుట

2005 వ సంవత్సరములో బోరు వేయించాలని రెండు చోట్ల గుర్తులు పెట్టుకున్నాము. ఖమ్మం జిల్లా దమ్మపేట భక్తునకు శ్రీ స్వామి స్వప్న దర్శనమిచ్చి ప్రస్తుతం ఉండే బావిని పదడుగులు త్రవ్వితే ఊరంతటికీ సరిపడే నీరున్నాయని చెప్పారు. వారి మాటలు నమ్మలేక నేను దీక్ష చేస్తాను స్వామి, దమ్మపేట భక్తునకు చెప్పినమాట నాకే చెప్పండి. సంతోషంగా చేయిస్తానని పన్నెండు గంటలసేపు ఉదయం ఏడు గంటలనుండి రాత్రి ఏడు గంటలవరకు మూడు గ్లాసుల నీరు, మూడు స్పూనుల ఉప్మారవ్వ, మూడు స్పూనుల చక్కెరతో చేసిన జావ ఒక సారి ఒక గ్లాసు చొప్పున మూడు మార్లు త్రాగుతాను. మధ్యలో కేవలం మంచినీరే త్రాగుతాను స్వామీ అని చెప్పుకున్నాను. దీక్షకు కూర్చోకముందే ఒక దివ్య స్వప్నం వచ్చింది. ఒక మిత్రుడు కలలో కన్పించి "సుబ్బరామయ్యా ఉప్పు లార్జి స్కేలులో కొన్నాము, ఉప్పు కొటారులో అన్నాడు. నేను వెంటనే నాకు కూడా ఎక్కువగానే కొనండి. ఇదిగో అడ్వాన్సు అంటూ జేబులో చేయి పెడుతుంటే ఆ మిత్రుడు - అడ్వాన్సు అవసరం లేదు, ఒకేసారి కొనెయ్యడమే అన్నాడు. నేను ప్రక్కకు చూచాను. పది అడుగుల శ్రీ విష్ణుమూర్తి గారు శేషపాన్పు మీద పవళించిన మౌల్డింగ్, ఆ మౌల్డింగ్‌నకు పూలమాల వలె ఒక దండవేసి రంగు పూసియున్నారు. ఆ దండంతా పెద్ద అక్షరాలతో రంగులు వేసి ఉన్నారు. శ్రమతో సేవ అని దండ ఒక వైపు, రెండవ వైపు సేవతో కైవల్యం అని వ్రాసి ఉన్నారు, మెలుకువ వచ్చింది. అ స్వప్న వృత్తాంతమంతా వ్రాసిపెట్టుకున్నాను. పన్నెండు గంటల దీక్షలో నాకేమి చెప్పలేదు. రాత్రికి చెపుతారని ఎదురుచూచాను, చెప్పలేదు. ఇక సమాధి మీద చీట్లు పెట్టడమొక్కటే మార్గమని తలచాను.



మేము గుర్తులు పెట్టుకున్న రెండు ప్రదేశాలలో బోరు వేయించేందుకు రెండు చీట్లు, దమ్మపేట భక్తునకు ఇచ్చిన స్వప్నాదేశం ప్రకారం బావిని పది అడుగులలోతు దించడం అని ఒక చీటి, మొత్తం మూడు చీట్లు పెట్టాను. సమాధి మీద చీట్లుంచి ఒక గంట ప్రదక్షిణలు చేసి తీసుకుంటానని మందిరం బయట అగ్నిగుండం వరకు వచ్చాక మరొక ఆలోచన మెరిసింది. ఈ మూడు చీట్లు మన ఆలోచనలేగదా. శ్రీ స్వామి వారి నిర్ణయము కోరిందేమున్నది, అని ఈ మూడు కాదు శ్రీ స్వామి వారి నిర్ణయం మరొకటి అని వ్రాసి మరొక నాలుగవ చీటి పెట్టాను. చివరకు మరొకరి ద్వారా చీటీలు తీయిస్తే ఈ మూడు కాదు అనే చీటీనే వచ్చింది.

మనం తొందరపడి బుద్ధి పనిచేయకున్నాగాని శ్రీ స్వామి వారు మనలను సరైన మార్గాన నడుపుతున్నారు చూడండి. బావంతా పదడుగులు త్రవ్వేకంటే, పదడుగులు కాకుంటే ఇరవై అడుగులలోతు బోరు రెండు మూడు చోట్ల వేయించాలనుకున్నాము. ఆ మహనీయుని నమ్మితే మనలను ఎలా సరైన మార్గాన నడుపుతారో చూడండి.

# మోటారును విప్పే దొంగను తరమడం

బావికి మోటారు పెట్టి నీరు తోడుకునే వాళ్ళము. మోటారుకు షెడ్డు లేదు, బయటే ఉంది. ఒకరోజు ఒక దొంగ వచ్చి రెంచీలు పెట్టి విప్పుతున్నాడు. అప్పుడు సమయం రాత్రి రెండు గంటలు లేక ఒంటి గంట ఉంటుంది.

ఒక గదిలో ఒక బేలుదారి పిల్లవాడు పడుకునేవాడు. చలిరోజులని బాధపడుతుంటే ఎవరో ఒకాయనను తెచ్చి రూములో పడుకోబెట్టాడు. అప్పుడు రాత్రి 12 గంటలు. ఆ వచ్చినతను మంచినీళ్ళు కావాలన్నాడు. నేను మోటారు వేస్తాను పైపు దగ్గర తాగమని మోటారు వేసి నీరు త్రాగాక ఆపేశాడు. ఆ క్రొత్తమనిషికి నిద్ర పట్టక శ్రీ స్వామి వారి చరిత్ర చదువుకొంటున్నాడు. నిశ్శబ్దంగా ఉండే ఆ సమయంలో అతనికి రెంచీల శబ్దం వినిపించి ఆలకించాడు. మరలా మరలా శబ్దం రావటంతో బేలుదారిని లేపాడు. ఈ బేలుదారి పెద్దగా అరచి నన్ను లేపాడు. మోటారు ఉండేచోట చీకటి. లాంతరు వెలిగించి తీసుకొని నేను వెళ్ళేసరికి ఆ దొంగ ఆ ప్రక్కనున్న మొండి గోడ వెనుక దాక్కున్నాడు. నేను మోటారు దగ్గర చూచి అనుమానం కొద్దీ నేను మొండిగోడ అవతల చూడాలని వెయ్యేసరికి లాంతరు వెలుతురు చూచి దొంగ పరుగెత్తడంలో తట్టుకొని పడి లేచి నా కళ్ళముందే పరుగెత్తాడు.

శ్రీ స్వామి వారు ఆ క్రొత్త మనిషినే తీసుకరాకుంటే ఆ మోటారు అపహరించబడేది. ఆ వచ్చిన క్రొత్త మనిషికి నిద్ర పట్టకుండా చేసి రెంచీల శబ్దం విని బేలుదారిని లేపాడు. అతను మోటారు వేసి నీళ్ళు త్రాగకుంటే అతను రెంచీల శబ్దం పట్టించుకోడు. రెంచీల శబ్దం వింటూనే మోటారు విప్పుతున్నారని అతనికి అనుమానం వచ్చి బేలుదారిని లేపేటట్లు చేశారు. వీటిలో ఏది జరుగకున్నా మోటారు దొంగలెత్తుకపోయే వారే గదా. మనం ఏమారియున్న సమయాన మన ప్రార్దనలేకుండానే శ్రీ స్వామి వారు ఎలా మనలను కాపాడుతారో చూడండి.



అనంత కరుణతో మీరొసంగిన కృపయంతయున్
అడవిగాచిన వెన్నెలజేసితిన్
బూడిదబోసిన పన్నీరు జేసితిన్
నేడు ననుగాచి బ్రోవకయున్న దిక్కెవ్వరో దయానిదే

నీ అంకిత భక్తులెందరికో అరిషడ్వర్గంబుల్ ప్రోదోలినావే
పోలిరెడ్డిని బ్రోచినావు రోశిరెడ్డిని రక్షించినావు
తులసమ్మ, ఎక్కెమ్మ, నరసమ్మలన్ గాచి రక్షించినావు

వారి కఠోర నియమపాలనయున్
సేవానిరతియున్, ప్రభు భక్తియున్
ఇసుమంత నా కనుగ్రహించి బ్రోవవేవరదా

నిర్దనత్వము లేకుండుటే నా నేరమైన
నను నిర్దనున్ చేసి బ్రోవుమా ప్రభో

కోరను నిను బోగభాగ్యముల్
సిరిసంపదల్ కోరను
అణిమాది అష్టసిద్దులన్ కోరను
మీ దివ్య కరావలంబనమొసంగి
ఈ మాయన్ దాటించుమా దయానిదే
ఈ అహంకారమత్తగజంబును ప్రోదోలుమయ్యా
ఈ చాపల్యంబులు పరిహరించుమా ప్రభో
ఈషణ త్రయంబునే వదలలేను
అరిషడ్వర్గంబులు అష్టమదంబులు వీడలేను
నిరంతరము నా బాధల్ చూచి ఆనందించుట ధర్మమా ధర్మమూర్తే

కాలమంతయున్ వ్యర్థము చేసితిన్ కాటికి కాళ్ళు చాపితిన్
నేడో రేపో మీ సన్నిధి వీడుట తధ్యమే గదా
నేడు నను బ్రోచి కావకయున్న దిక్కెవ్వరో దయానిధే.

నా ప్రార్థన లేకయే మీ పాదముల చెంత కీడ్చి
నను ధౌర్భాగ్యుని చేయుట ధర్మమా ధర్మమూర్తే

ఇట్టి దుర్గుణ రాసిని ఏల సృజించితివో ఈ భువిన్
సృజించితివేపో నా ప్రార్థన లేకయే
మీ పాదముల చెంత కేల ఈడ్చితిఓ ప్రభో

సర్వము తెలియునటుంచు గర్వమే గానీ
ఆచరణ శూన్యుండనైతినో ప్రభూ

మీ దివ్య కరావలంబన మొసంగి
మీకు ప్రీతి పూర్వకంబుగా నడుచుకొను భాగ్యం భీయ్యవే వరదా

ఈ వాచా శూరత్వము మాన్పి క్రియా శూరత్వ
మిసుమంత అనుగ్రహించుమా ప్రభో

కామాంధుడనై కన్ను గానక నేటికిన్
చేయరాని దుష్కృత్యముల్ చేయుచునుంటినయ్యా
ఈ కామాంధ తన్ పరిహరించుమా ప్రభో

ఆశబోయిన సర్వము బోవునంటిరే
ఈ ఆశను వదలించ నా తరమా ప్రభో



# పుణ్యం

<u>నన్ను శ్రీ స్వామి వారి పాదముల పై పడవేసింది పూజ్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు మాత్రమే</u> - శ్రీ మాష్టారి దర్శనం నాకు పూర్వ పుణ్యం వలననే కలిగింది.

పూజ్యపాదులు, పూజ్య గురు దేవులైన శ్రీ భరద్వాజ మాష్టరు గారి వద్దకు నన్ను నెట్టుకపోయినది నా పుణ్యమేనని నా గట్టి నమ్మకము. శ్రీ భరద్వాజ మాష్టరుగారు నాకు తెలిసి 1972 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరము కలిచేడులో జరిగే గీతాజ్ఞాన యజ్ఞాలలో ఉపన్యసించుటకు వస్తున్నారని కరపత్రములలో తెలుస్తున్నా, నేనా ఉపన్యాసములకే వెళ్ళే వాణ్ణి కాదు. కామాంధుడనైన నాకు ప్రపంచములో మంచి ఏ విధంగా కనబడుతుంది? కాని 1975వ సంవత్సరమునకు నా పుణ్యం పెరిగి శ్రీ T.V. శేషగిరిరావు అనే మా స్కూలు టీచరు నన్ను బలవంతంగా ఆ మీటింగులకు తీసుకువెళ్ళి శ్రీ మాష్టారు గారిని దర్శించే భాగ్యము కల్గించారు. నాటినుండి నా జీవిత విధానమే సంపూర్ణంగా మారిపోయింది. షుమారు ఎనిమిది నెలలపాటు నన్ను శ్రీ వెంకయ్య స్వామి వారిని దర్శించమని ప్రతివారము నేను వారి దర్శనమునకు వెళ్ళిన ప్రతి దఫా చెపుతూనే ఉన్నా, నేను వెళ్ళి శ్రీ స్వామి వారికి పాదనమస్కారము చేయలేదు. తలుపూరులోను కలిచేడులోను వారిని చూస్తుంటాను. కానీ వారి ఎడల పూజ్యభావమే లేదు. ఎనిమిది నెలల తర్వాత శ్రీ స్వామి వారు భూమి మీద నడిచే దేవుడని వారిని దర్శించకుంటే నా వద్దకు రావద్దని శ్రీ మాష్టారు చెప్పడంతో హడలెత్తి ఖిన్నుడనయ్యాను. ఆ దయామయుడే శ్రీ స్వామి వారు దేవుడైనది కానిది తెలుసుకునే మార్గం చెప్పి అలా వారిని పరీక్షించి చూడమంటే విధి లేక వారిని పరీక్షించాలనే వెళ్ళాను గానీ వారి పాదాలకు శాశ్వతంగా

అంకితమవ్వాలని పోలేదు, పోయినది మొదలు తేనెలో పడ్డ ఈగవలె వారికి దాసుడనై నా గత జీవితాన్నే బలిచేశాను. ఈ విధంగా నన్ను శ్రీ స్వామి వారి చెంతకు చేర్చింది నా పుణ్యమేనని నా నమ్మకము.

## తెలియక చేసిన పుణ్య కార్యాలు:

నాకు నాలుగు సంవత్సరముల వయస్సులో చుట్టు ప్రక్కల ఐదు కిలోమీటర్ల దూరములో ఎక్కడా పాఠశాల లేని ఒక అడవిలో ఇరవై ఇండ్లు గల చిన్న పల్లెటూరులో కాపురం ఉన్నాము. ఆ గ్రామం పేరు కందల పేట. ఉదయగిరి తాలూకా మర్రిపాటి నుండి సత్య సంధుడు ఆత్మాభిమానియైన మా తండ్రి ఆ చిన్న గ్రామానికి కాపురం మారాడు. ఎందుకైనది ఇక్కడ అప్రస్తుతం. అక్కడ బ్రతకలేకనే గదా. ఈ గ్రామంలో నాకు పాఠశాల లేక ఎప్పుడూ యానాది పిల్లలతో సహవాసం. వారి మాటలు వారి పనులే పట్టుపడ్డాయి. అంతటి దుష్ట పరిస్థితులలో కూడా మా తల్లిగారి పై ఎంతో ప్రేమ. చిన్న పిల్లవాడినైనా వంట చెరకు తెచ్చి చిన్న చిన్న కట్టలు కట్టి వర్షాకాలానికి భద్రపరిచేవాడిని. చదువు లేక చెడిపోతున్నానని అక్కడనుండి పాఠశాల ఉండే చెముడుగుంటకు కాపురం మారాము.

జన్మ సంస్కారములు ఎంత బలంగా మనమీద పని చేస్తాయో చెప్పలేను. మా మామగారి పెండ్లికి పోతే మా అన్నగారు ఆటలలో ఏదో పేచీ వచ్చి పిల్లలతో కొట్లాడుతున్నాడు. నేను ఆటలో లేను బయట ఉండి అంటున్నాను "మన ఊరు గాదు మన పల్లె గాదు ఊరకుండారా వెంకటరమణా" అని. అది మా బంధువొకరు విని చాలా సంవత్సరాలు ఆ మాట నన్నని నవ్వుకొనేవారు, చూడవయ్యా వీళ్ళిద్దరికీ ఎంత తేడానో అనేవారు. ఏమో ఏ జన్మ సంస్కారమో అది నన్నొదలలేదు.



చెముడుగుంటలో పాఠశాలలో చేరేసరికి నాకు ఎనిమిది తొమ్మిది సంవత్సరాలుంటాయి. ఒకరోజు మా పంతులమ్మ పాఠం చెపుతూ "భద్రాచలంలో రామదాసు అన్ని కష్టాలు దేవుని కొరకు పడ్డాడు. ఈ దౌర్భాగ్యపు గ్రామంలో ఉండే దేవాలయాలు బీడు పెట్టారు" అని చెప్పుక పోయింది. ఆమెను నేను ఒంటరిగా కలసి బీడు పెట్టడమంటే ఏమిటని అడిగాను. దేవునికి దీపారాధన నైవేద్యం లేకుండా దేవాలయం శుభ్రంగా ఉంచుకోకపోవడమని చెప్పారు.

అప్పుడు నాకు పది సంవత్సరముల వయస్సు ఉంటుంది. నా స్నేహితులను పోగుచేసుకొని నిత్యం గరడ గుమ్మం తీసుకొని శ్రీ రామ జయరామ జయ జయ రామ అనే సంకీర్తనతో గ్రామములోని అన్ని ఇండ్లు తిరిగి నూనె దండేవారము. గరడ గుమ్మం నిండిపోతే సీసాలో పోయించుకునేది. అది ఒక పిచ్చికాలము 55 సంవత్సరాల క్రిందటన్నమాట. అప్పుడు నూనెధర 1 కిలో 1 రూ 50 పై ఉండేది. ఆదివారం వీదంతా నీరు పారి వెల్లవలైపోయే వరకు లెక్కలేనన్ని బిందెలు నీళ్ళు చేది పోసి రాముని విగ్రహానికి అభిషేకం చేసేవాళ్ళము. త్రోవనపోయేవాళ్ళు రోడ్డంతా బురదయింది ఇకచాలని కొందరంటే పోయనియ్యరా ఆరిపోద్ది. వాళ్ళకుండే జ్ఞానం మనకు లేదు అని కొందరనేది. తలా పిడికెడు బియ్యం తెస్తే నేను మా అంగడిలో బెల్లం దొంగతనంగా తీసుకపోయి, ఒకరింట్లో గిన్నెతెచ్చి బెల్లం పొంగలిచేసి నైవేద్యం పెట్టే వాళ్ళము.

మమ్ములచూచి ఒక పోటీ భక్తమండలి తయారైంది. మహలక్ష్మమ్మ మాను అనే వేపమాను అరుగు ఉండేది. వాళ్ళక్కడ ప్రతి శుక్రవారం భజన మొదలు పెట్టారు. ప్రసాదాలు పెడతారని మేము కూడా అక్కడకి వెళ్ళేవారము.

ఇంకొక దేవాలయం చింతాళమ్మ గుడి అని గ్రామ దేవత. అక్కడ గుడికి తాళాలు వేస్తారు. బయట మండపంలో కొయ్యశిలలు మూడు నాటి ఉంటారు. ఒక్కొక్క ఆదివారం అక్కడ ఆ శిలలకు అభిషేకం చేసి పొంగలి నివేదించేవాళ్ళము.

ఇదంతా మనకేదో వస్తుందని, పుణ్యమని మాకు తెలియదు. అదొక పిచ్చి ఉత్సాహము. పొంగలి తినవచ్చనే కోరిక మాత్రమే ఉండేది.

ఈ వయసులో మా ఇంట్లో మా మేనత్త ఒకామె బాల్య వితంతువు ఉండేవారు. ఆమె పాటలు పాడుతూ శ్రీ కృష్ణుని బాల్య లీలలన్నీ చెప్పేది. అందువలన వారిపై తెలియని అభిమానం కల్గింది. ఆ రోజులలో టవల్స్ దుప్పట్లపైన కృష్ణుని బొమ్మ అంటించి ఉండేవి. టవల్స్ పైన వచ్చే శ్రీ కృష్ణుని బొమ్మలు తీసి ఇంట్లో అట్టలకు అంటించి తగిలించేవాణ్ణి. పుస్తకాలనిండా ఆ బొమ్మలు దాచేవాణ్ణి.

నెల్లూరులో నేరుగా ఏడవతరగతి చదివేందుకు మా మేనమామ గారింట్లో ఉన్నాను. నేను, ఒక మామ ఇంటి వరండాలో పడుకునే వాళ్ళము. నిద్ర లేస్తూనే చూచేందుకుగాను గోడకు శ్రీ కృష్ణుని బొమ్మకరిపించేవాణ్ణి. మా మామ సినిమా పోష్టరు తెచ్చి దానిపై పెద్దదిగా ఏదో సినీనటి బొమ్మ అంటించేది. నేను ఆ బొమ్మ పైన ఒక మూల శ్రీ కృష్ణుని బొమ్మ అంటించేవాణ్ణి. నిద్రలేస్తూనే శ్రీ కృష్ణుని మొగం చూచి చల్లగా కాపాడు స్వామీ అని నమస్కరించేది. అంతకుమించి శ్రీ కృష్ణుని గూర్చి కూడా ఏమీ తెలియదు.

అక్కడనుండి కాలేజీ చదువుకెళ్ళాక నిద్రలేస్తూనే శ్రీ కృష్ణునికి నమస్కరించడం పోయింది. పుస్తకాల ప్రపంచమే. ఆరు గంటలకు



ఉదయం సాయంత్రం ప్రేయర్ హాలుకు పోవాలి. పోకుంటే ఫైన్ ఉంటుంది. కొందరు ఫైన్ కట్టమంటే కట్టేస్తారుగానీ నిత్యం ప్రేయరు హాలుకేరారు. నేను మాత్రం రెగ్యులర్‌గా వెళ్ళేవాడిని. ఒకరోజు జువాలజీ ప్రాక్టికల్స్‌కు పోతున్నాను. ఒక టూరిస్టు బస్సు మా హాస్టలుముందు ఆగింది. అందులోనుండి ఒకామె పాస్ కొరకు అక్కడున్న వేపమాను ప్రక్కకు వెళ్ళింది. ఒక ముల్లు ఒక అంగుళం లోతు కాలిలో దిగి విరిగి విల విల లాడుతుంది. గుడ్డలోనే పాస్ పోయింది. అందరూ గుంపుకూడారు. అక్కడ ఆస్పత్రి ఎక్కడుందో వారికి తెలియదు. అదే సమయంలో నేనక్కడికి పోయాను. నా చేతిలో డిసెక్షన్ బాక్సు ఉంది. నా వయసు పదిహేడు సంవత్సరాలు. వైట్ డ్రస్, టక్ చేసి ఉన్నాను. ఏది నన్ను చూడనీయండి అని ఆ జనంలో దూరి ఆమె కాలు చూచాను. డిసెక్షన్ బాక్సులోని ఫోర్‌సెప్స్‌తో దానిని పెరకవచ్చని కాలు కదిలించకుండా ఒకరిని పట్టుకోమని శ్రీ కృష్ణుని తలచుకొని ఒకే పట్టులో ముల్లు లాగేశాను. ఇదంతా జరిగే లోపల అరగంట అయిపోయింది. ఇక పది నిమిషాలు నడిస్తేనే కాలేజీకి పోగలను. అక్కడ లెక్చరర్ చెండశాసనుడు. గనుక ఆరోజు ప్రాక్టికల్ పోయింది. ఆమె బాధ చూచాక నా ప్రాక్టికల్ మాటే మరచిపోయాను. అదెందుకోగానీ చిన్ననాటి నుండి బాధలోనున్న వారిని చూస్తే నన్ను నేను మరచిపోతాను. చేతనయిన సహాయం చేయాలని ఉబలాటముండేది.

సెలవలు వస్తే ఊరిలో ఆటలే ఆటలు. అన్నం నీళ్ళు ఉండవు. ఒకరోజు నిర్మానుష్యంగా ఉన్న ఇంటి ఆవరణంలో గంగాల సుబ్బమ్మ అనే ఆమె అరుస్తూ ఏడుస్తుంది. మేమంతా ఆ ఆవరణంలో దాక్కునేందుకు దూరాము. ఆమె ఏడుపు చాలించి ఎవరది, ఎవరది అని అరుస్తుంది. అక్కడుంటే దొంగపడ్డవాడొచ్చి కనుక్కుంటాడని అందరూ వెళ్ళిపోయారు. నేనొక్కడనే అక్కడొకచోట దాక్కొని ఉన్నాను. మరలా ఆ ముసలామె

నోకండాలు అరుపులు మొదలయినాయి. ఆ ఇంట్లో ఎవ్వరూ లేరు. ఆమె ఒక్కటే ఉంది. చల్లగా అక్కడనుండి ఇంటికి వచ్చి ఆమె ఎందుకట్లా ఏడుస్తుందని మా అమ్మను అడిగాను. అక్కడికెందుకు పోయావురా? ఆమె వంటి జిలతో రాత్రింబవళ్ళు ఒకటే అరుపులు. అవి వినలేకనే వాళ్ళా ఇల్లు వదిలేశారు. ఆమెకంత అన్నం అక్కడ పడేసి చెంబుతో నీళ్ళు పెట్టి గంప బోర్లించి పోతారు, అని చెప్పింది.

ఇంట్లో అన్నం తిని నేరుగా మరలా ఆమె దగ్గరకెళ్ళి పలకరించాను. నీవెవరు అని అడిగింది. నేను ఫలానా అంగడి శేషమ్మ కొడుకునని చెప్పగానే ఆమె నాయనా నాగతి ఇట్లా అయింది అని తన వంటిమీద దద్దుర్లు గీరి గీరి ఏర్పడ్డ గాయాలు చూపి ఏడ్చింది. నేను నెల్లూరు అస్పత్రిలో చేరుస్తాను, వస్తావా అన్నాను. వస్తాను నాయనా అన్నది. రేపు ఉదయాన్నే పోదాము రెడీగా ఉండమని చెప్పి వెళ్ళిపోయాను.

ఆ రోజు మా అమ్మకు పచ్చి అబద్దం చెప్పాను. నేను ఐస్‌ఫ్రూట్ కొనుక్కోవాలి. పావలా ఇవ్వమని మొండికేశాను. ఐస్ ఒక్క అణానే కదా అంటుందామె. నేను పాల ఐస్ తినాలని మొండికేసి పావలా తీసుకున్నాను. అప్పుడు నెల్లూరుకు బస్ చార్జి పావలా. ఆమెకా పావలా ఇచ్చి నీవు బస్సెక్కి బస్టాండులో ఉండు నేను సైకిల్ మీద వచ్చి కలుస్తానని ముందురోజే చెప్పాను. ఆమె ఆ పావలా తన పొగాకు కొనుక్కునేందుకుంటుందని వేకువన లేచి నడచి నెల్లూరు పోతుంది. సైకిల్ మీద పొయ్యే నాకు కనిపించింది. ఇద్దరము బస్టాండులో కలసుకొని గవర్నమెంటు ఆస్పత్రికి వెళ్ళాము. నాకు O.P. టిక్కెట్టు తీసుకోవాలని కూడా తెలియదు. అక్కడొక నర్సుకు ఆమె పరిస్థితి చెప్పి ఎక్కడ చూపించాలని అడిగాను. ఆమె ఆ రూము చూపింది. అక్కడ నిలుచొని



ఉంటే ఒక పుణ్యాత్ముడు O.P. టిక్కెట్లు తెచ్చావా అన్నాడు. అదేమిటంటే వివరాలు చెప్పి తెమ్మన్నాడు. ఆమెను క్యూలో పెట్టి తెచ్చాను. డాక్టరు వచ్చి ఆమెను చూచి ఈమె ఇక్కడ పదిరోజులు ఉంటే బాగవుతుంది. మేమే అన్నం పెడుతామని చెప్పారు. ఆమె అంగీకరించింది. పది రోజులలో శుభ్రంగా మాన్పుకొని చెముడుగుంట వచ్చింది. కనపడ్డ వాళ్ళకంతా నా సంగతి చెపుతుంది. మా అమ్మకు తెలిసి "వేలెడంత లేవు నీకు ఊళ్ళో పెత్తనమంతా కావాలా? అని నాలుగు చీవాట్లేసింది".

అప్పుడలా చేస్తే పుణ్యమొస్తుందనే విషయమే నాకు తెలియదు. ఆమె బాధలో ఉంది గనుక స్పందించి చేతనైన సహాయం చేయడమే. ఇది జన్మ సంస్కారమేగానీ ఈ జన్మలో నాకెవ్వరూ నేర్పింది కాదు.

చెముడుగుంటలో బయ్యా వెంకయ్య వాళ్ళిల్లు మంటలంటుకొని కాలుతుంది. ఎంతోమంది గోలచేస్తూ ఆడ మగా చూస్తున్నారు, కానీ ఒక్కరూ ఆర్పే ప్రయత్నం చేయడంలేదు. నాకప్పుడు పన్నెండు లేక పదమూడుగేండ్లు వయస్సు. నేను పోతూనే ఒక ప్రహరీ గోడ ఎక్కి నా స్నేహితులిచ్చే కుడితి నీరు చల్లసాగాను. అప్పుడు ఆడ మగా అందరూ తలా కాస్త వాళ్ళ ఇండ్లలో నీళ్ళు తెచ్చి ఇచ్చారు. కొన్ని తాటాకులు పెరికేశాను. మంటలు ఆరిపోయాయి. ఎవ్వరి ఇండ్లకు మంట వ్యాపించలేదు. ఈ విషయం మా అమ్మకు తెలిసి నానా చీవాట్లు పెట్టింది. పెద్ద పెద్ద వాళ్ళుంటే వేలెడు లేని పిల్ల కుంకవు నీవా మంటలార్పేది. కాలు జారి మంటలో పడితే ఇంకేమైనా ఉందా? అన్నది. అందుకు నేను చెప్పాను గాలికి ఒక తాటాకు మంట మన పూరింటి మీద పడితే అప్పుడేమౌతుంది, అన్నాను.

అలాగెన్నో సన్నివేశాల్లో స్పందించాను. ఎందుకలా చేస్తానో నాకే తెలియదు. నా పదహారేళ్ళ వయసులో ఒక 5 సంవత్సరాల పిల్లవాడు ఎక్కడ సంపాదించాడో ప్రమాదమైనప్పుడు రైలు బండి ఆపేందుకు పట్టాల మీద పెట్టే ఒక ప్రేలుడు పదార్థం గల చిన్న కాటుక భరిణంత డబ్బా తెచ్చి దాన్ని ఒక పచ్చడి నూరే రాయితో కొట్టాడు. ఆ డబ్బా ప్రేలి ఆ రాయి పైకెగిరి పిల్లవాని నుదుటికి తగిలి చర్మం పగిలి రక్తం కారుతుంది. పిల్లవాడు పెద్ద పెట్టున ఏడుస్తున్నాడు. చాలామంది కూడారు గానీ ఒక్కరికీ ఏమి చేయాలో తోచలేదు. నేనాత్రోవన మా అమ్మమ్మను ప్రక్క గ్రామానికి తీసుకపోతూ ఈ గోల చూచి అక్కడికి వెళ్ళాను. వెంటనే నా చేతి గుడ్డ తీసి గాయంపై కట్టు కట్టి బిడ్డనెత్తుకొని ఒక ఫర్లాంగు నడిచి బస్సు రోడ్డులోకి వెళ్ళాను, నెల్లూరు తీసుకపోవాలని. దైవవశాత్తు బస్సులో ఆ పిల్లవాని తండ్రి దిగాడు. ఆయనే ఆ బిడ్డను నెల్లూరు తీసుకపోయాడు. ఆ పిల్లవాని తండ్రి అసాధ్యుడని అందరూ ఆ బిడ్డను తాకనుగూడా వెనుకాడారు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. ఆ బిడ్డను తాకడమే లేదు. ఆ నిమిషంలో నాకు ఆ బిడ్డ తండ్రి విషయమే పట్టలేదు. ఎత్తుకొని వెళ్ళడమే. నా దగ్గర బస్సు చార్జీ కూడా లేదు. డాక్టరు ఫీజు లేదు. ఇవన్నీ ఆ సమయంలో నాకు తోచలేదు.

ఇలాంటివెన్నో జరిగాయి కానీ ఇవన్నీ పుణ్యకార్యాలని ఆ బాధపడేవారిలో దేవుడున్నాడని నాకు అప్పుడు తెలియనే తెలియదు. ఒకప్పుడు చైనా వార్ జరుగుతుంది. ఎందరో సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు అంగవికలులైనట్లు పంచాయితీ రేడియో చెపుతుంది. దేశ రక్షణ నిధికి సహాయమర్థిస్తున్నారు. నేను B.Sc. చదువుతున్నాను. మా గ్రామంలోని బడి పిల్లలను తీసుకొని ఊరి మీదకు వెళ్ళాను. ఎవ్వరూ ఒక్క పైసా ఇవ్వరు. ఎందుకు నవ్వులపాలవుతావన్నారు కొందరు పెద్దలు. దైవమే తోడు. సాయంకాలమునకు 96 రూపాయలు వసూలైంది.



పోస్టల్ ఆర్డరు తీసుకొనేందుకు పోతే ఆ పోస్టుమాస్టరు ఆ నాలుగు రూపాయలు తానే వేసి పోస్టల్ ఆర్డరు ఇచ్చాడు. ఎవరెవరు ఎంత ఇచ్చింది, ఆ పోస్టుమాస్టరు గారి ప్రహారీగోడపైన బొగ్గుతో వ్రాశాను. అలా వ్రాయకుంటే ఎన్నో వందలు దండి తినేసి ఉంటాడనే అపోహ వస్తుందని తోచింది. ఇది పుణ్యకార్యమని నాకు తెలియనే తెలియదు. క్షతగాత్రులకు సహాయం చేయడమే నా ధ్యేయం.

చిన్నగా ఉద్యోగంలో చేరాను. మైపాడు ఎక్స్‌కర్షనుకు అందరు టీచర్లూ ఒక పిల్లవానికి ముప్పై రూపాయలు లెక్కవేశారు. నేను పది రూపాయలకు తీసుకపోతానన్నాను. హెడ్మాష్టరు లెక్క చెప్పమన్నాడు. రాను పోను బస్సు చార్జీలు పిల్లలందరికీ అర చార్జీలు పోను ఇంకా మనిషికి రెండు రూపాయలు మిగులుతాయి. మధ్యాహ్నం హోటలుకు పోకుండా నేనే అన్నం చేయించి పెడతానన్నాను. ముప్పై నుండి పదిరూపాయల కొచ్చేసరికి షుమారు ఎనభైమంది ఎక్స్‌కర్షనుకు వచ్చారు. ఆ చిన్నారు లెంతగా సంతోషించారో సముద్రం చూచి. మా హాస్టలులో అన్నం సాంబారు చేయించి తక్కరు బాబా హాస్టలులో వడ్డించాను. అన్నం చాలకుంటే తక్కరు బాబా హాస్టలు వాళ్ళే పెట్టారు. డబ్బులిస్తానంటే తీసుకోలేదు. మనం సహృదయంతో చేస్తుంటే భగవంతుడెప్పుడూ తోడుంటాడు.

కలిచేడులో ఒకసారి శ్రీ విద్యానందగిరిస్వామి వారి ఉపన్యాసం విని భగవద్గీత కొని చదివాను. ఒక్కటి కూడా బోధపడలేదు. కర్మయోగము, కర్మ సన్యాసయోగము, జ్ఞానయోగము - జ్ఞాన విజ్ఞానయోగమంటారు. అసలే తిక్క తిక్కగా ఉందనుకున్నాను. కానీ భగవద్గీతలోని శ్రీ కృష్ణునిబొమ్మ నన్ను చాలా బాగా ఆకట్టుకొన్నది. నిత్యం నాతల దగ్గరే భగవద్గీత ఉంచుకొని పడుకొని నిద్రలేస్తూనే ఏదీ

చూడకుండా ముందు శ్రీ కృష్ణుని బొమ్మ చూచి ఆ బొమ్మ క్రింద ఉండే - కృష్ణానంద ముకుంద మురారే అనే శ్లోకం చదివి నమస్కరిస్తూ - పెద్ద శ్రీ కృష్ణునిపటం ఇంట్లో పెట్టి దండం పెట్టే వాణ్ణి, ఏమని - "తెలిసీ తెలియని తప్పులన్నీ క్షమించి చల్లగా రక్షించు స్వామీ" ఇది మా అమ్మ నేర్పిన ప్రార్థన. దీనికి నేనొక క్రొత్త లైను తగిలించాను. "నన్నెందుకు పుట్టించావో ఆ పని నెరవేర్చేటట్లు చేయి తండ్రీ" అని నమస్కరించేదే గానీ - ఎందుకు పుట్టింది ఆనాడు తెలియనే తెలియదు. ఇలా కొన్ని సంవత్సరములు చేయగానే పుణ్యం పెరిగి ఒకరోజు శ్రీ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర దొరికింది. అంతవరకు ఒక్క అక్షరం కూడా రామకృష్ణ పరమహంసను గూర్చి నాకు తెలియదు. వివేకానందుని గురువని మాత్రం తెలుసు. పుస్తకం తెరువగానే ఎక్కడో ఒక చోట తెరుచుకుంది.

శ్రీ రామకృష్ణ పరమహంస వారికి కడుపునొప్పిగా ఉంటే ఆస్పత్రికి వెళ్ళాడు. అప్పటికి డాక్టరు వెళ్ళిపోయాడు. కాంపౌండరుకు చెపితే ఏదో పొడి పొట్లమిచ్చి మ్రింగమన్నాడు. రామకృష్ణులు పొట్లం తీసుకొని వెనుకకు తిరగగానే వారి కండ్లు కనపడలేదు. ఇంతలోనే నాకు కంటి చూపు పోయిందేమిటి అని నిలబడి ఆలోచించాడు. డాక్టరుగారి అనుమతి లేకుండా కాంపౌండర్ దగ్గర మందు తీసుకున్నందుకే ఇలా అయిందని తోచింది. ఈలోగా కాంపౌండర్ వెళ్ళిపోయాడు. ఇదిగోనయ్యా నీ మందు నాకొద్దని వెంటిలేటర్ గుండా మందు పొట్లాము ఆస్పత్రి లోపల పారవేయగానే వారికి చూపు వచ్చింది. దానితో తన్మయమయ్యాను.

ఆవిధంగా పరమాత్మ నాచేత శ్రీ రామకృష్ణ పరమహంసగారి జీవిత చరిత్ర మొత్తం చదివించారు. ఒకచోట శ్రీ రామకృష్ణుల వారంటారు "భార్య బిడ్డలు ఇల్లు, వాకిలి కొరకు కడవలు కడవలు కన్నీరు



కారుస్తారే భగవంతుని కొరకు ఒక్క కన్నీటి బొట్టు కార్చారా?" "మూడు రోజులైనా ఏకాంతంగా గడిపి భగవంతుని కన్నీటితో ప్రార్థించు, పలుకుతాడు" అని అంటారు. ఈమాట చదువగానే మా ఇంటికి ఎదురుగా హైస్కూలు ఆటస్థలంలోనున్న ఓపన్ ఎయిర్ థియేటర్లో కూర్చొని రాత్రిపూట ఎంతోసేపు ఏడ్చి ప్రార్థించాను. అసలప్పుడు కన్నీళ్ళు ఎలా వచ్చాయి అనేదే ఆశ్చర్యం.

శ్రీ రామకృష్ణ పరమహంస గారి కడుపునొప్పి మందు పొట్లం చదివాక నాలో గొప్పమార్పు కలిగింది. మన తప్పునకు వెంటనే శిక్ష విధిస్తాడు అనే నమ్మకం కలిగింది.

స్కూలులో ఒక కిటికీ రెక్క బందులు ఊడి క్రింద పడిపోయింది. ఆటల టీచర్ రూము అది. ఆ కిటికీ రెక్క చెదలు పడుతుంది గనుక దాన్ని మా ఇంటికి పిల్లలచేత పంపాను. ఇప్పుడు దాన్ని తిరిగి స్కూలుకు చేర్చాలి. లేకుంటే నాకు రామకృష్ణ పరమహంసకు లాగా కళ్ళు పోతాయనే భయం పట్టుకుంది. తిరిగి ఆ చెక్కను స్కూలుకు తీసుకపోతుంటే ఎవరైనా చూస్తే అనే భయం మొదలైంది. ఒక రాత్రి కరెంటు పోయినపుడు చీకటిలో ఆ చెక్కను తీసుకవెళ్ళి ఆ రూములో పారేశాను.

మా ప్రక్కింటివారితో తగవు వచ్చింది. కాగితంపై సంతకం చేసి ఒక సంవత్సరం తర్వాత నేను బిడ్డ చనిపోయిన దిగులులో సంతకం చేశాను. ఈ విషయంలో నాకు అంగీకారం లేదంటాడు. గ్రామస్తులందరూ అతనిని చీవాట్లు పెట్టినాసరే తనపట్టు విడువలేదు. దాంతో ఈ సంగమంతా కృళ్ళిపోయిందని పూర్తిగా వదిలేశాను. కష్టాలు అనుగ్రహానికి గుర్తు అని శ్రీ మాష్టరుగారు చెప్పినమాట అక్షరాలా

నిజమైంది. ఈ సంగాన్ని వదలకుంటే దేవుని వైపుమళ్ళను. ఈ కష్టాలలో దేవునివైపే దృష్టయింది.

మామూలుగా జనులు తనవాదం నెగ్గాలని అందరి కాళ్ళు పట్టుకుంటారు. కానీ ఆ కష్టసమయంలో మూడు మైళ్ళ దూరంలోని ఈశ్వరుని గుడికి వెళ్ళేవాడిని. చిట్టడవిలోని ఆ దేవాలయానికెవ్వరూ రారు, నిర్మానుష్యంగా ఉంటుంది. హే ప్రభూ నన్నెందుకు పుట్టించావు, ఈ గలాటాలెందుకు పెడుతున్నావు, నాకు శాంతి ప్రసాదించు తండ్రీ అని ప్రార్ధించేవాణ్ణి.

భగవంతుడు నా ప్రార్ధన విని నన్ను శ్రీ భరద్వాజ మాష్టరు గారి పాదముల చెంతకు చేర్చాడు. ఆ మహనీయుడు నన్ను శ్రీ వెంకయ్య స్వామి వారికి అప్పగించారు.

యద్భావం తద్భవతి అన్నారు. నీ భావాన్నిబట్టి ఫలితముంటుంది అని అన్నారు. ఏ భావము లేకుండా నేను చేసిన పనులకే ఇంతటి మహత్తర ఫలితంగల్గి నన్ను సద్గురు సన్నిధికి చేర్చింది.

అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోవయ్యా అన్న శ్రీ స్వామి వారి మాట ప్రకారం - మనం మదర్‌థెరెస్సా ఆశ్రమంలో లాగా ఇతరులకు సేవ చేస్తూ ఇది భగవంతుని సేవ అనే భావంతో చేస్తే ఇంకెంత ఫలితముంటుందోగదా. మనం ప్రత్యక్షంగా సేవ చేయలేకపోయినా మన కష్టార్జితం ఒక్క ముద్ద ఆ అభాగ్యులకు అందిస్తే భగవంతుడు ఎంతగా సంతోషిస్తాడో గదా! నెల్లూరు, భక్తవత్సలనగర్‌లోని మదర్ థెరెస్సా ఆశ్రమములో ఎవ్వరూ జీతాలు తీసుకోరు. రేపు ఎట్లా అనే భయం లేదు.



ప్రభువు రక్షిస్తారనే సంపూర్ణ విశ్వాసంతో అనాధలకు సేవ చేస్తారు. ఒకసారి ఆశ్రమము చూచి తరించండి.

నిత్యం ఇష్టదైవానికి నమస్కరించడం, పూజచేయడం - మందిరానికి వెళ్ళడం లాంటివి మనం చేస్తుంటే మన బిడ్డలకు అలవాటౌతుంది. మనం చేయకుంటే వారెక్కడ చూచి నేర్చుకుంటారు?

దైవీ సంపదలో మొదటిది, దేవ ద్విజగురు ప్రాజ్ఞ పూజనం అని చెప్పారు. మా తల్లిగారు నిత్యం వడ్లు దంచి మాకు అన్నం పెట్టే రోజులలో కూడా రాత్రి స్నానం చేసి శ్రీ మహావిష్ణుమూర్తికి నైవేద్యము, హారతి ఇవ్వనిదే అన్నం తినేది కాదు. ఆ అలవాటే మా ముగ్గురు పిల్లలకు వచ్చింది. మన పుణ్యమే మనలను సద్గురుసన్నిధికి చేరుస్తుంది. వారి ఆజ్ఞలను పాటించే శక్తినిస్తుంది.

సర్వత్రా నిండియున్న పరమాత్మను గుర్తిస్తూ సాటి జీవులకు మన సేవలందించడం గొప్ప పుణ్య కార్యం గదా. ఋణానుబంధాలు, మనమిచ్చిన వాగ్దానాలు, చేసిన ప్రమాణాలు, మన బాధ్యతలు ఎంతో చక్కగా నెరవేర్చినప్పుడు ఆ పరమాత్మ సంతృప్తి చెంది మనలను శాంతి ధామం తప్పక చేర్చుతారు.

**అన్నమయ్య:** నీ కొలువు నర్తకులమైన మేము మోక్షమిమ్మని మిమ్మడుగ తగునా? మా ఆటపాటలతో మీరు సంతృప్తి చెంది మీరు మాకది అనుగ్రహించవలసినదే గదా!

ఇంద్రియాణాం హిచరతాం యన్మనోనువిధీయతే<br>
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంబసీ (గీత)

ఓ సద్గురురాయా, కఠోర నియమపాలనయున్, ప్రభుభక్తియున్, సేవా నిరతియున్, ప్రసాదించి నన్ కరుణించవే వరదా.

ఈ ఇంద్రియలోలతను పరిహరించు మాప్రభో!

స్వామీ ఇన్ని దివ్యానుభవాలు ప్రసాదించినా పరమ మూర్ఖుడనైన నేను, మీరు నన్ను అనుక్షణం చూస్తున్నారని నిరంతరం గుర్తించలేకున్నాను. చేసిన తప్పే తిరిగి చేస్తున్నాను. ప్రతిరోజు ఈ గురుస్తుతి పారాయణ ద్వారానైనా నా దుష్టసంస్కారాలను పోగొట్టి నిరంతరం మిమ్ము స్మరించే భాగ్యము కల్గించు ప్రభూ. నాకేది శ్రేయస్కరమో అది మీరు నా ప్రార్థన లేకుండానే చేస్తారని హృదయపూర్వకంగా నమ్మి మీరు చూపిన శుభ్రమార్గాన నడిచేసద్బుద్ధిని ప్రసాదించుప్రభూ.